ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 29-8-2019 గురువారం సిటీ సంపుటి 46 సంచిక 20

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఇది.. కడప జిల్లా ఎం. తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం ప్రాసెసింగ్ కర్మాగారం. దీని నుంచి వచ్చే కాలుష్యాలను నింపే చెరువు దగ్గరలోనే ఉంది. ఆ కలుషిత జలాలు భూగర్భంలోకి ఇంకిపోవడంతో.. చుట్టుపక్కల ఊళ్లన్నీ విషపూరితమైపోతున్నాయి.

ఈ పక్క చిత్రంలోని తిరుమల నాయక్.. సమీపంలోని కణంపల్లె గ్రామంలో అయిదెకరాల్లో అరటితోట వేశారు. ఆ తోటకు బోరు నీటిని పెట్టారు. అరటి గెలలు, కాయలైతే కాశాయి గానీ.. అవి తినడానికి పనికిరాకుండా సన్నగా, పీలగా వచ్చాయి. దాంతో బోరునీళ్లు ఇక పనికిరావని అర్థమైన ఆయన.. కొద్దిరోజుల క్రితం తోటను తగలబెట్టేశారు. ఇలా యురేనియం కాలుష్యం వల్ల తమ జీవితాలు దుర్భరమౌతున్నాయన్నది తిరుమల నాయక్ లాంటివాళ్ల ఆవేదన.

ఊరి ఊపిరి తీస్తున్న ఖనిజం

ఆంధ్రప్రదేశ్‌లోని గని పరిసర ప్రాంతమంతా విషపూరితం

- కాలుష్య నిబంధనలు తుంగలో తొక్కిన కేంద్ర సంస్థ
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆందోళన
- ఇదేం నిర్వాకమంటూ షోకాజ్ నోటీసు జారీ
- తెలంగాణలోనూ తవ్వకాలకు కేంద్ర సంస్థ సన్నాహాలు

ఎన్. విశ్వప్రసాద్
ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

ప్రగతి పరుగులెత్తాల్సిందే.. ఆధునికతను అందిపుచ్చుకోవలసిందే.. ఎలాంటి అభివృద్ధి అయినా అది ప్రజల జీవితాలను మరింత మెరుగుపరిచేదిగానూ.. వారి ఉన్నతికి పనికివచ్చేదిగానూ ఉండాలే తప్ప ఊరికి ఉరి వేసేదిగానూ.. పొలాలను పాడుబెట్టేదిగానూ.. జనం ఊపిరి తీసేదిగానూ ఉంటే ఎలా?

అణువిద్యుత్తు కర్మాగారాలను నడిపేందుకు యురేనియం అవసరం. ఆ ఖనిజం కోసం భూమిని తవ్వి వెలికి తీయాల్సిందే కానీ.. ఆ క్రమంలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే పరిస్థితి ఏమిటి? భూమిని.. భూగర్భాన్ని కూడా విషపూరితం చేసేస్తే ఎలా? ప్రభుత్వరంగ సంస్థల నిర్వాకమే ఇలా ఉంటే ఎవరికి మొరపెట్టుకోవాలి? ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లాలో భారత యురేనియం సంస్థ గనిని, ప్రాసెసింగ్ కర్మాగారాన్ని నిర్వహిస్తున్న ఎం. తుమ్మలపల్లె ప్రాంతం వద్ద కనిపిస్తున్న పరిస్థితులు సరిగ్గా ఇలాగే ఉన్నాయి.

భూగర్భాన్ని అత్యంత ప్రమాదకర కాలుష్యం ఆక్రమిస్తోంది. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మీ పరిశ్రమపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ ఈనెల 7న యురేనియం కార్పొరేషన్‌కు షోకాజ్ నోటీసును జారీ చేసింది.

దేశంలో యురేనియం ఉత్పత్తిని భారీగా పెంచే లక్ష్యంతో తాజాగా యురేనియం సంస్థ తెలంగాణలోనూ తవ్వకాలకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై ప్రజల నుంచి, మేధావుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో ఇప్పటికి ఏడేళ్ల కిందటే ఉత్పత్తి ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులపై 'ఈనాడు మీడియా' పరిశోధన చేస్తే దిగ్భ్రాంతికర విషయాలు బయటపడ్డాయి.

పూర్తి కథనం ఉరేనియమే.. 3 లో

దీనిపై ప్రత్యేక కథనం నేడు.. ETV తెలంగాణ, ETV భారత్ లలో!

కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కళాశాలలు

వచ్చే మూడేళ్లలో ఏర్పాటు

- అదనంగా 15,700 సీట్లు అందుబాటులోకి
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్

ఈనాడు, దిల్లీ: వైద్యుల కొరత తీర్చేందుకు దేశవ్యాప్తంగా వచ్చే మూడేళ్లలో కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల మూడో దశలో భాగంగా వీటిని జిల్లా స్థాయి, రిఫరల్ ఆసుపత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేయనుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి ఏర్పాటు కోసం 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. కేంద్రం తన వాటాగా వచ్చే మూడేళ్లలో రూ.24,375 కోట్లు ఇస్తుంది. దీనివల్ల కొత్తగా 15,700 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింత మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని కేంద్రం అంచనా వేస్తోంది. ఇప్పటివరకు వైద్యకళాశాలలు లేని జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. గత అయిదేళ్లలో 85 వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. వేగాన్ని పెంచి వచ్చే మూడేళ్లలోనే 75 ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు.

చక్కెర ఎగుమతులకు రాయితీ

2019-20 సీజన్‌లో పంచదార ఎగుమతి చేసే చక్కెర మిల్లులకు ప్రతి మెట్రిక్ టన్నుకు రూ. 10,448 రాయితీ ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.6,268 కోట్ల భారం పడనుంది. ...మిగతా 2లో

డిజిటల్ మీడియాలోకి 26 శాతం ఎఫ్‌డీఐలు

...వివరాలు బిజినెస్ పేజీలో

పోలీసు సంస్కరణలు అవసరం

- థర్డ్‌డిగ్రీ, ఫోన్‌ట్యాపింగ్‌లు కాలం చెల్లిన పద్ధతులు
- క్రిమినల్ కేసుల్లో దోష నిర్ధరణ రేటు పెరగాలి
- ఫోరెన్సిక్ ఆధారాలు తప్పనిసరి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

14 లో

ఐటీ పోటు తగ్గించండి

కార్యాచరణ బృందం సిఫార్సు

ఈనాడు, దిల్లీ: మధ్యతరగతిపై విధించే వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గించాలని ప్రత్యక్ష పన్నుల స్మృతి (డైరెక్ట్ ట్యాక్స్ కోడ్ -డీటీసీ) రూపకల్పనపై ఏర్పాటయిన కార్యాచరణ బృందం ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అఖిలేశ్ రంజన్ నేతృత్వంలో ఏర్పాటయిన ఈ బృందం గత నెలలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తుది నివేదికను అందజేసింది. మధ్యతరగతి వర్గం ప్రజలు మరింతగా ఖర్చు పెట్టడం కోసం వారి చేతిలో సొమ్ము ఉండాలని, అందుకుగానూ పన్నుల భారం తగ్గించాలని సూచించింది. దాని వల్ల ఆర్థిక వ్యవస్థకు మేలు కలుగుతుందని పేర్కొంది. నివేదిక బహిర్గతం కాకపోయినా, ముఖ్యాంశాలను విశ్వసనీయ వర్గాలువెల్లడించాయి.

ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నులు

- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు- 5 శాతం (పొదుపు చేసి రాయితీలను ఉపయోగించుకోగలిగితే రూ.5 లక్షల వరకు పన్ను భారం నుంచి పూర్తిగా తప్పించుకోవచ్చు.)
- రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు... 20%
- రూ.10 లక్షలు ఆపైన.. 30%

సిఫార్సు చేసిన పన్ను శ్లాబులు

- రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు..... 10%
- రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు..... 20%
- రూ.20 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు..... 30%
- రూ.2 కోట్లు, ఆపైన..... 35%

(అధిక ఆదాయం ఉన్న వర్గాలకు కొత్తగా 35% పన్ను శ్లాబును ప్రతిపాదించడం గమనార్హం.)

ఇవి కాకుండా పన్నుల భారాన్ని తగ్గించడానికి డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ)ని రద్దు చేయాలని సిఫార్సు చేసింది. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను కొనసాగించాలని సూచించింది.

ఇక పాలమూరు పరుగు

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు
- నేడు పనులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు హైదరాబాద్ : నిధులు, భూసేకరణ తదితర సమస్యలతో మందకొడిగా సాగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించిన ముఖ్యమంత్రి కేసీఆర్, గురువారం స్వయంగా పనులను పరిశీలించనున్నారు. రిజర్వాయర్ల నిర్మాణం, లిఫ్టు పనులను పరిశీలించిన అనంతరం అక్కడే సమీక్ష చేయనున్నారు. 12.3 లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు పలు గ్రామాలు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1226 గ్రామాలకు నీరందుతుంది. రూ.35,200 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చింది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం సుమారు రూ.50వేల కోట్లకు చేరింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామం సమీపంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. ఇందులో ఒకటిన్నర టీఎంసీ పాలమూరు-రంగారెడ్డికి, అర టీఎంసీ దిండి ఎత్తిపోతల పథకానికి వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పనులను 21 ప్యాకేజీలుగా విభజించగా, 18 ప్యాకేజీల పనులకు టెండర్లు ఖరారు చేశారు. గడువు దగ్గర పడుతున్నా ఎక్కువ ప్యాకేజీల పనులు లక్ష్యానికి తగ్గట్లుగా జరగలేదు. రూ.29,183 కోట్ల పనులను గుత్తేదారులకు అప్పగించారు. మరో మూడు ప్యాకేజీల పనులకు టెండర్ పిలవాల్సి ఉంది. ఇటీవలే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.10వేల కోట్ల రుణం మంజూరైంది. ఈ రుణంతో వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి నీటిని మళ్లించేలా కొన్ని పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ...మిగతా 2లో

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు షటిల్ రాకెట్లను బహూకరిస్తున్న పీవీ సింధు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్

ఒలింపిక్స్‌లోనూ బంగారం సాధించాలి

- పీవీ సింధును అభినందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ 2లో
- అంతర్జాతీయ విజేతలకు హైదరాబాద్ వేదికగా మారిందని వ్యాఖ్య

దృఢ సంకల్పం.. ఇంజినీరింగ్ అద్భుతం

కాళేశ్వరానికి కలెక్టర్ల కితాబు

ప్రాజెక్టును పరిశీలించిన పాలనాధికారులు

2లో

కోటి చీరలు.. వంద డిజైన్లు

వచ్చే నెల 20 నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

ఇప్పటికే జిల్లాలకు చేరిన 50 లక్షలు

5లో

విద్యుత్ సంస్థల్లో 3195 కొలువులు

భర్తీకి డిస్కంల సన్నాహాలు

6లో

కొత్త సచివాలయం కొలువుదీరాల్సిందే!

ఇప్పుడున్న పది బ్లాకుల్లో ఎనిమిదింటి భవనాలు శిథిలం

సౌకర్యాలు సరిగా లేవు.. పార్కింగుకూ ఇబ్బందులు

మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వ సాంకేతిక కమిటీ నివేదిక

5లో

హైకోర్టుకూ కొత్త భవనం!

ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు

బుద్వేలుకు తరలించరాదంటూ న్యాయవాదుల నిరసన

6లో

ఆశలు చిదిమిన బడి బస్సు

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘోరం
- ముగ్గురు పిల్లల మృతి
- అయిదుగురికి గాయాలు
- తల్లిదండ్రులకు కడుపుకోత

...వివరాలు 6లో

మృతి చెందిన విద్యార్థులు రిషి

మణిచందన

దీక్షిత

ఆ చిన్నారులు బడిలో అప్పటిదాకా బుద్ధిగా చదువుకున్నారు... మధ్యాహ్నం భోజనం చేసేందుకు బస్సులో వసతిగృహానికి బయలుదేరారు. దారిలో ఓ ట్రాక్టర్ ట్రక్కుపై కొందరు యువకులు గణేశుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. బస్సులో ఉన్న పిల్లలు కిటికీల దగ్గరకు చేరుకున్నారు. బొజ్జగణపయ్యను ఆ బుజ్జిగాళ్లంతా ఆరాధనగా చూస్తున్నారు. ఊరేగింపు కోలాహలాన్ని ఆస్వాదిస్తున్నారు. అంతలో ఏమైందో ఏమో వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా అదుపు తప్పింది. డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించారు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

నకిలీ వెబ్‌సైట్లున్నాయి.. జాగ్రత్త

- ఏటా 5 లక్షలకు పైగా పాస్‌పోర్టుల జారీ
- పరిశీలన పూర్తయ్యాక వారంలోనే మంజూరు
- వచ్చే ఏడాది నుంచి ఈ-పాస్‌పోర్టులు
- సంబంధిత కార్యాలయాలన్నీ సికింద్రాబాద్‌లోనే
- 'ఈనాడు'తో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్

పాస్‌పోర్టు జారీ పేరిట నకిలీ వెబ్‌సైట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, దరఖాస్తుదారులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. సేవా కేంద్రంలో పరిశీలన పూర్తయ్యాక 6 నుంచి 7 రోజుల్లో పాస్‌పోర్టు జారీ చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి చిప్‌తో కూడిన పాస్‌పోర్టులు ఇస్తామని తెలిపారు. పాస్‌పోర్టుల జారీ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (తెలంగాణ) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యకలాపాలపై బుధవారం ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ...మిగతా 2లో

పుర పోరులో కారుదే జోరు!

- మున్సిపల్ ఎన్నికల్లో తెరాస విజయం ఏకపక్షమే
- విపక్షాలన్నీ చిత్తవుతాయి
- ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమాయత్తమవ్వాలి
- పార్టీ ప్రధాన కార్యదర్శులకు కేటీఆర్ నిర్దేశం
- పురపాలక సంఘాలపై సమీక్ష

పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశంలో మాట్లాడుతున్న కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

పురపాలక ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధిస్తామని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. పరిషత్ ఎన్నికల మాదిరే వీటిలోనూ సంపూర్ణ ఫలితాలు సాధిస్తామని చెప్పారు. విపక్షాలన్నీ చిత్తవుతాయన్నారు. ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని.. ఎప్పుడొచ్చినా సత్తా చాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆనవాళ్లు కోల్పోతోందన్నారు. భాజపాకు పెద్దగా బలం లేకపోయినా సవాల్ చేస్తోందని.. ఆ పార్టీకి ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దని చెప్పారు. ఈ ఎన్నికల కోసం పార్లమెంటు నియోజకవర్గాలవారీగా ఇన్‌ఛార్జులను నియమిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. దాదాపు అయిదు గంటల పాటు జరిగిన ఈ భేటీలో పురపాలక ఎన్నికలు, పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. 141 పురపాలక సంఘాలపైనా సమీక్ష నిర్వహించారు. వాటిలో పార్టీ బలాబలాలు, సమస్యలు, ఇతర అంశాలను తెలుసుకున్నారు. పలు పురపాలక సంఘాల పరిధిలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడారు. మెజారిటీ సంఘాల్లో పార్టీ బలంగా ఉందని ప్రధాన కార్యదర్శులు కేటీఆర్‌కు వివరించారు. "ఇప్పటికే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నాం. అన్ని పురపాలికల్లోనూ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సభ్యత్వం ద్వారా రూ.22 కోట్లు జమయ్యాయి. ఇప్పుడు మనముందున్న లక్ష్యం పురపాలిక ఎన్నికలే. తెరాస ప్రతి ఎన్నికనూ సవాల్‌గా తీసుకొని ఎదుర్కొంది. అన్నింటా ఘనవిజయాలు సాధించింది. పురపాలిక ఎన్నికల్లోనూ అదే ఒరవడి సాగాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలను నియమించాలి. అంతటా అనుబంధ సంఘాలను నియమించాలి. ఈ జాబితాలను వచ్చే నెల మొదటి వారంలో సీఎం కేసీఆర్‌కు అందజేస్తాం. కమిటీలు పూర్తయిన అనంతరం మొదటి వారం నుంచే నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించాలి. వీటిల్లో పురపాలక ఎన్నికలపై నూతన కమిటీలు, క్రియాశీలక కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలి.

ఇన్‌ఛార్జుల నియామకం

పురపాలక ఎన్నికల కోసం పార్లమెంటు నియోజకవర్గాలవారీగా పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను ఇన్‌ఛార్జులుగా నియమిస్తున్నాం. మూడు నాలుగు పురపాలక సంఘాలకు కలిపి కార్యదర్శి నేతృత్వంలో కమిటీలుంటాయి. వీరు ఆయా నియోజకవర్గాల పరిధిలోని పురపాలికల్లో పార్టీ విజయానికి స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తారు.

దసరా నాటికి కార్యాలయాలు

రాష్ట్రంలోని 30 జిల్లాల్లో చేపట్టిన పార్టీ కార్యాలయాలను దసరా వరకు పూర్తి చేయాలి. జిల్లాల్లో పార్టీ భవనాల నిర్మాణాలను పర్యవేక్షించేందుకు ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌రెడ్డిలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నాం" అని కేటీఆర్ వెల్లడించారు.

గవర్నర్ నరసింహన్ దంపతుల సమక్షంలో కేక్ కోస్తున్న పీవీ సింధు, మానసి. చిత్రంలో సింధు తల్లిదండ్రులు విజయ, రమణతోపాటు చాముండేశ్వరీనాథ్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఒలింపిక్స్‌లోనూ బంగారం సాధించాలి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ గెలవడం ద్వారా పీవీ సింధు దేశ గౌరవాన్ని నిలబెట్టారని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో ఆమె పాల్గొనేందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వ పరంగా చేయడంతోపాటు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో విజేతలను తయారు చేసే వేదికగా హైదరాబాద్ మారిందని తెలిపారు. పీవీ సింధు, ఆమె తల్లిదండ్రులు విజయ, రమణ, కోచ్ గోపీచంద్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్ బుధవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డీజీపీ మహేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, వీసీ సజ్జనార్, మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్ చంద్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింధు తనకు వచ్చిన పతకాన్ని సీఎంకు చూపించారు. ఆమెను సీఎం సత్కరించారు. అనంతరం కేసీఆర్‌కు రెండు షటిల్ రాకెట్లను సింధు బహూకరించారు. సీఎం మాట్లాడుతూ.. "సింధు క్రీడల్లో ఆణిముత్యం. ప్రపంచ విజేతగా నిలవడం మనందరికీ గర్వకారణం. కఠోర సాధన, శ్రమ వల్లే ఆమె ఈ స్థాయికి చేరారు. జాతీయ క్రీడాకారులైన రమణ దంపతులు తమ కుమార్తెను గొప్పగా తీర్చిదిద్దారు. గోపీచంద్ మంచి శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ విజేతలకు హైదరాబాద్ కేంద్రంగా మారడం ఆహ్వానించదగ్గ పరిణామం. సింధు భవిష్యత్తులో అనేక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలి. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలి" అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు.

వచ్చే ఒలింపిక్స్‌లో సింధుకు స్వర్ణపతకం ఖాయం: గవర్నర్

ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధు 2020 ఒలింపిక్స్‌లో కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తారని గవర్నర్ నరసింహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత క్రీడాకారుల సత్తాను సింధు ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. ప్రపంచ పారా బ్యాడ్మింటన్ పోటీల విజేత మానసి జోషి అద్భుత విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. గవర్నర్ దంపతుల ఆధ్వర్యంలో సింధు, మానసి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌లను బుధవారం రాజ్‌భవన్‌లో సన్మానించారు. క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సింధు తల్లిదండ్రులు పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ.. "సింధు, మానసి సాధించినవి దేశం గర్వించదగిన విజయాలు. సింధు స్వర్ణ పతకంతో రావాలని మూడేళ్ల క్రితం రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆకాంక్షించాం. దానిని ఆమె ఇప్పుడు నిజం చేశారు'అని ప్రశంసించారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో సింధు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఇక పాలమూరు పరుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టులో అయిదు లిఫ్టులు, ఆరు రిజర్వాయర్లు ఉన్నాయి. నాలుగు లిఫ్టుల్లో ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం గల 31 పంపులు, 75 మెగావాట్ల సామర్థ్యం గల మూడు పంపులు ఏర్పాటు చేయనున్నారు. ఆరు రిజర్వాయర్లను 67.97 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటన తర్వాత ఈ ప్రాజెక్టు పనులు వేగం అందుకొనే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సంవత్సరాల వారీగా 'పాలమూరు-రంగారెడ్డి'కి చేసిన ఖర్చు వివరాలు

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపు (రూ.కోట్లలో)	ఖర్చు (రూ.కోట్లలో)
2014–15	5	4.56
2015–16	100	386
2016–17	7860.89	708.45
2017–18	4028.99	1976.25
2018–19	3065.30	2615.33
2019–20 (ఆరునెలలకు)	1316.69	520.48

నాలుగు జలాశయాల పనులను పరిశీలించనున్న సీఎం

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్ : ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని కర్వెన, వట్టెం, నార్లాపూర్, ఏదుల జలాశయాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఈ సందర్భంగా సాగునీటిపారుదల శాఖ అధికారులతో ఏదుల వద్ద సమీక్ష నిర్వహించి పనుల పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆయా ప్రాజెక్టుల వద్ద ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. ఈ పథకానికి మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూరు మండలం కర్వెన వద్ద 2015 జూన్ 11వ తేదీన కేసీఆర్ శంకుస్థాపన చేశారు.

పతక విజేతలు అశ్వత్థ నారాయణ, ప్రణవ్ నూతలపాటి, సంజయ్ ప్రామాణిక్, శ్వేత రతనపుర

ప్రపంచ నైపుణ్య పోటీల్లో భారత్ సత్తా

- స్వర్ణం సహా 4 పతకాలు కైవసం

కజన్: అంతర్జాతీయ నైపుణ్య పోటీల్లో భారత్ సత్తా చాటింది. రష్యాలోని కజన్ వేదికగా నిర్వహించిన 45వ ప్రపంచ నైపుణ్య పోటీల్లో 4 పతకాలు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఇందులో ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలున్నాయి. ప్రపంచ నైపుణ్య పోటీల్లో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. తాజా పోటీల్లో జల సాంకేతికత విభాగంలో ఎస్.అశ్వత్థ నారాయణ(25) స్వర్ణం సాధించగా, ప్రణవ్ నూతలపాటి(17) వెబ్ సాంకేతికత విభాగంలో రజతం గెల్చుకున్నాడు. ఆభరణాల విభాగంలో సంజయ్ ప్రామాణిక్(21), గ్రాఫిక్ డిజైనింగ్‌లో శ్వేత రతనపుర(22) కాంస్యాలు దక్కించుకున్నారు. 63 దేశాలు తాజా పోటీల్లో పాల్గొన్నాయి. భారత్ తరఫున 48 మంది పాల్గొన్నారు. 16 స్వర్ణాలతో పతకాల పట్టికలో వైనా అగ్రస్థానంలో నిలిచింది. ఆతిథ్య రష్యా 14 బంగారు పతకాలను దక్కించుకుంది. ముగింపు వేడుకకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరయ్యారు. 2007 నుంచి మన దేశం ప్రపంచ నైపుణ్య పోటీల్లో పాల్గొంటోంది.

వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులపై అక్టోబరు 2 నుంచి నిషేధం

దిల్లీ: ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ సంచులు, కప్పులు, ప్లేట్లు, సీసాలు, స్ట్రాలు, ప్యాకెట్లు తదితరాలపై కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 2 నుంచి నిషేధం విధించనుంది. ఇలాంటి ఉత్పత్తుల తయారీ, దిగుమతి, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని ప్రధాని మోదీ పట్టుదలతో ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కళాశాలలు

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠంగా 60 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఈ రాయితీ ఇవ్వనుంది. చక్కెర కర్మాగారాలు రైతులకు చెల్లించాల్సిన బకాయిల కింద ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోకే జమ చేస్తామని జావడేకర్ తెలిపారు.

- ✦ దిల్లీలో ఇంటర్నేషనల్ కొయిలేషన్ ఫర్ డిజాస్టర్ రెసిలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ) సచివాలయ కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వచ్చే సెప్టెంబర్ 23న న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల కార్యాచరణ సదస్సు సందర్భంగా ఈ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. దీని ఏర్పాటు కోసం కేంద్రం రూ.480 కోట్ల సాయం చేస్తుంది.
- ✦ ఔషధ మొక్కల పెంపకం, పరిశోధన తదితర అంశాల్లో సహకారానికి పెరూ దేశంతో, సంప్రదాయ వైద్యంపై గయానా, గాంబియా దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకారం తెలిపింది.
- ✦ జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు పార్లమెంటు చేసిన సవరణలను మంత్రివర్గం సమీక్షించింది. తొలుత ప్రతిపాదించిన బిల్లులోని అంశాలు, అనంతరం చేసిన సవరణలను పరిశీలించింది.

కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూపాన్ని తెలుసుకుంటున్న సోమేశ్‌కుమార్, కలెక్టర్లు

మేడిగడ్డ బ్యారేజీని తిలకిస్తున్న ఉన్నతాధికారులు

దృఢ సంకల్పం.. ఇంజినీరింగ్ అద్భుతం

- ప్రాజెక్టును పరిశీలించిన పాలనాధికారులు

ఈనాడు, వరంగల్ - ఈనాడు, డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు ఓ ఇంజినీరింగ్ అద్భుతమని, ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢ సంకల్పానికి నిదర్శనమని జిల్లాల పాలనాధికారులు కొనియాడారు. బుధవారం కలెక్టర్ల కాళేశ్వరం పర్యటన విజయవంతంగా కొనసాగింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ నేతృత్వంలో పాలనాధికారుల బృందం బుధవారం ఉదయం హన్మకొండ నుంచి పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక బస్సులో ముందుగా మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్‌తోపాటు, గ్రావిటీ కాలువలో గోదావరి జలాల ఎత్తిపోతలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఒక్కో నిర్మాణాన్ని నిశితంగా పరిశీలించి, ఇంజినీర్లను అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు. ప్రాజెక్టు అన్ని దశలను వివరించేలా అధికారులు మ్యాపును రూపొందించి, వివిధ ప్యాకేజీల కింద నిర్మిస్తున్న బ్యారేజీలు, పంపుహౌసులు, గ్రావిటీ కాలువలు, సొరంగ మార్గాలు, జలాలు వివిధ జలాశయాలకు ఎలా వెళుతున్నాయో వివరించారు. మేడిగడ్డ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్లు ఆసక్తిగా తిలకించారు. అనంతరం బ్యారేజీ పరిసరాలను, గేట్ల ద్వారా నీటి విడుదలను పరిశీలించారు. ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు అధికారుల బృందానికి ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రస్తుతం ఎత్తిపోతలను నిలిపివేసినప్పటికీ కలెక్టర్లు వీక్షించేందుకు మొదటి పంపును అధికారులు అప్పటికప్పుడు ప్రారంభించారు. అక్కడ కలెక్టర్లు స్వీయ చిత్రాలు తీసుకుని మురిసిపోయారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అయిదు గంటలపాటు కలెక్టర్ల పర్యటన కొనసాగింది. అనంతరం వారంతా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర ఆలయాన్ని సందర్శించారు. 33 జిల్లాల పాలనాధికారులు రావాల్సి ఉన్నా.. పలు కారణాల వల్ల 27 మంది మాత్రమే ఈ పర్యటనలో పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం: సోమేశ్‌కుమార్

ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. దీన్ని ప్రతి జిల్లా కలెక్టర్ చూసి స్ఫూర్తి పొందాలనే ఉద్దేశంతో ఈ పర్యటన ఏర్పాటుచేశాం. అనతికాలంలో నిర్మాణం పూర్తయింది. అన్ని శాఖల సంయుక్త కృషితో ఈ విజయం సాధ్యమైంది. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు ఓ వరం.

వాటి కలయిక అమోఘం!

శరీరానికీ, ఆత్మకూ... పదార్థానికీ, పారమాత్మికానికీ మధ్య అవిభాజ్య బంధం ఉంది. ఆ రెంటి కలయిక ఫలితం ఎంతటిదో తెలియని అజ్ఞానం వల్ల మనం దాన్నో నిగూఢమైన రహస్యంగా భావించొచ్చు, అది మనల్ని ఆశ్చర్యచకితుల్నీ చేయొచ్చు. కానీ మనకు అర్థం కానంత మాత్రాన వాటి ప్రభావం ఏ మాత్రం తగ్గదు.

- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

29-8-2019 గురువారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
చతుర్దశి: సా.6-56 తదుపరి అమావాస్య
ఆశ్లేష నక్షత్రం: రా.8-17 తదుపరి మఘ
అమృత ఘడియలు: సా.6-46 నుంచి 8-16 వరకు
వర్జ్యం: ఉ.9-44 నుంచి 11-15 వరకు
దుర్ముహూర్తం: ఉ.9-56 నుంచి 10-46 వరకు
తిరిగి మ.2-55 నుంచి 3-44 వరకు
రాహుకాలం: మ.1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-48; సూర్యాస్తమయం: సా.6.14
మాస శివరాత్రి

నకిలీ వెబ్‌సైట్లున్నాయి.. జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్ అయ్యాక గ్రామీణులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని గుర్తించామని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. విదేశాలకు వెళ్లే వారికి ఇబ్బంది కలగకుండా పీవోఈ (ప్రొటెక్ట్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్), ఎంఆర్‌సీ (మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్), ఐసీసీఆర్ (ది ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్), విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయం (తెలంగాణ). . తదితరాలన్నింటినీ సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం (ఆర్పీవో)లోనే ఈ ఏడాది చివరికి అందుబాటులోకి తెస్తామని వివరించారు.

విష్ణువర్ధన్‌రెడ్డి

గ్రామీణుల కోసం

పాస్‌పోర్టు జారీ ప్రక్రియను ఆన్‌లైన్ చేయడంతో గ్రామీణులు ఇబ్బంది పడుతున్నట్లు మా దృష్టికొచ్చింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రంలోని ముఖ్యమైన కేంద్రాల్లో మైగ్రేషన్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని 'టాంకాం'కు సూచించాం. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి అవగాహన కోసం ప్రత్యేకంగా కార్యశాల (ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ ట్రైనింగ్) నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ఇతర చోట్ల కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుండగా.. మన దగ్గర రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది.

తేల్చాల్సింది పోలీసులే

దరఖాస్తుదారు భారతీయుడా కాదా అని తేల్చాల్సిన బాధ్యత పోలీసులదే. ఇతర రాష్ట్రాల్లో జన్మించి ఉంటే మాకేం సంబంధం లేదంటూ గతంలో మాదిరిగా చేతులెత్తేయడానికి వీల్లేదు. ఈ మేరకు రెండు, మూడ్రోజుల క్రితం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాల డీజీపీలకు ఆదేశాలు జారీ చేసింది.

94 పాస్‌పోర్టులు రద్దు

అక్రమంగా పాస్‌పోర్టులు పొందుతున్న వారిలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలే ఎక్కువగా ఉంటున్నారు. మార్కెట్‌లో లభిస్తున్న నకిలీ ఓటర్ గుర్తింపు కార్డులు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలతో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం పత్రాలను పరిశీలించి, పోలీసుల క్లియరెన్స్ వచ్చిన తర్వాతే జారీ చేస్తున్నాం. ఇటీవలి కాలంలో 94 పాస్‌పోర్టులు రద్దు చేశాం. లుక్‌అవుట్ నోటీసులు, నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్లు జారీ అయిన ఎన్ఆర్ఐ భర్తలకు ముందుగా నోటీసులు జారీ చేసి.. తర్వాత పాస్‌పోర్టుల రద్దుపై నిర్ణయం తీసుకుంటున్నాం.

పెండింగ్, ఫిర్యాదులు సున్నా

ఏటా 5 లక్షలకు పైగా పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాం. పెండింగ్, ఫిర్యాదులు దాదాపుగా లేవు. 2017లో 12, 2018లో 112 దరఖాస్తులు మాత్రమే కోర్టుకేసులు, ఇతరకారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. ఫోర్జరీ చేసేందుకు వీల్లేకుండా, భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తకుండా చిప్‌తో పాస్‌పోర్టులను వచ్చే ఏడాది నుంచి జారీ చేయబోతున్నాం.

ప్రింట్ అవుట్స్‌తో పని లేదు

పాస్‌పోర్టు కోసం ఇక ప్రింట్‌అవుట్లు, నకళ్లు తీసుకు రావాల్సిన అవసరం లేదు. ఒరిజినల్ డాక్యుమెంట్లు తెస్తే సరిపోతుంది. మొత్తం ప్రక్రియను కాగిత రహితంగా మార్చేందుకు ప్రయోగాత్మకంగా 'ఈ-టోకెన్'కు శ్రీకారం చుట్టాం. ఎస్ఎంఎస్ రూపంలో ఎప్పటికప్పుడు మొబైల్‌కు సమాచారం అందుతుంది. పాస్‌పోర్టు గడువు ముగుస్తున్న వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపించి అప్రమత్తం చేస్తున్నాం.

చర్చా వేదిక 'దక్కన్ డైలాగ్'

అంతర్జాతీయ అంశాలపై చర్చించేందుకు వేదికగా 'దక్కన్ డైలాగ్'ను తీర్చిదిద్దాం. చాలా దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసింది. శనివారం నిర్వహించనున్న సదస్సుకు బ్రెజిల్, యూకే, అమెరికా తదితర దేశాలకు చెందిన అంబాసిడర్లు, కాన్సులేట్ జనరళ్లు, ఇతర ముఖ్య ప్రతినిధులు హాజరు కానున్నారు. 'విశ్వ దర్శన్' పేరిట పాఠశాల విద్యార్థులకు మన దేశం, విదేశాంగ విధానం, ప్రపంచీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

కార్యాలయాలన్నీ ఒకే చోట

మాదాపూర్ శిల్పారామం ఎదుట రెండున్నర ఎకరాల్లో అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా విదేశీ భవన్ నిర్మాణం చేపట్టబోతున్నాం. డిజైన్ల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. నిర్మాణానికి మూడు నుంచి నాలుగేళ్లు పట్టే అవకాశముంది. అప్పటివరకు సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయంలోనే పీవోఈ, ఎంఆర్‌సీ, ఐసీసీఆర్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయం (తెలంగాణ) కొలువుదీరేలా ఆధునికీకరణ పనులు చేపడుతున్నాం. ఈ ఏడాది చివర్లో ఒకే చోట కార్యాలయాలన్నీ అందుబాటులోకి రానున్నాయి.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	36.4	26.5
సూర్యాపేట	36.0	28.0
విజయవాడ	36.0	25.4
హన్మకొండ	34.7	27.0
నల్గొండ	34.4	25.2
ఖమ్మం	34.0	32.0
మహబూబ్‌నగర్	32.9	23.1
రామగుండం	32.8	25.2
హైదరాబాద్	32.8	23.6
కరీంనగర్	32.0	24.0
నిజామాబాద్	31.8	24.7
మెదక్	30.9	23.0
ఆదిలాబాద్	30.8	23.7

ఉరేనియమే..

ఎం.తుమ్మలపల్లె ప్రాంతం నుంచి
'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా వేముల మండలం ఎం.తుమ్మలపల్లె ప్రాంతంలో భారత యురేనియం సంస్థ (యూసీఐఎల్) జరుపుతున్న తవ్వకాలు, నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ కర్మాగారం స్థానిక ప్రజలకు పెను విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఖనిజం విషయంలో చూపుతున్న శ్రద్ధను ఆ సంస్థ ప్రమాదకరమైన వ్యర్థాల నిర్వహణ విషయంలో తీసుకోకపోవడం ప్రజాజీవితానికి శాపమైంది. వారికి ప్రాణాధారమైన బోర్లు కలుషితం అవుతున్నాయి.

యురేనియం వ్యర్థాల నిల్వకు భారత యురేనియం సంస్థ ఏర్పాటు చేసిన చెరువు

ఎం.తుమ్మలపల్లె ప్రాంతంలోని పలు బోర్లలో యురేనియం గాఢత నిర్ణీత పరిమితి కంటే అనేక రెట్లు ఎక్కువగా చేరింది. దీన్ని తేల్చింది సాక్షాత్తు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి. మండలి ఒక కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. జల కాలుష్య నియంత్రణ, నిరోధ చట్టం కింద ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ఈనెల 7న యురేనియం సంస్థకు షోకాజ్ నోటీసిచ్చింది. వారంలో సమాధానం రాకపోతే ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పరిశ్రమ మూసివేత వంటి చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించింది. కేంద్రప్రభుత్వ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఇలా నోటీసివ్వడం అరుదు. దాని ప్రతిని 'ఈనాడు మీడియా' సంపాదించింది. నోటీసుకు కేంద్రప్రభుత్వ సంస్థ ఇంకా స్పందించిన దాఖలాలు లేవు.

భూగర్భంలో కాలుష్యం.. పనికి రాకుండా పోతున్న పొలం

'మాది మంచి పొలం. ఒకప్పుడు మా నాన్న దీనిలోనే ఏటా అరటి తోటలు సాగు చేసి డబ్బు సంపాదించాడు. ఆయన పోగుచేసిన పది లక్షలతో ఊళ్లో ఇల్లు కట్టుకున్నాం. మాపొలం చివరన ఉన్న కొండ వెనక యురేనియం వ్యర్థాల చెరువు ఉంది. దానివల్ల మూడేళ్ల కిందట బోరులోని నీళ్లు పాడయ్యాయి. మొదట్లో ఇది అర్థం కాక మరో మూడుబోర్లు కూడా వేయించా. వాటికి రెండులక్షలు ఖర్చయింది. అరటి వేస్తే బోర్లలోని నీళ్లవల్ల తోటలు పెరిగినా కాయలు తినడానికి పనికిరానివి కాస్తున్నాయి. చాలా చిన్న కాయలు.. చేతి వేళ్ల సైజువి వస్తున్నాయి. అందుకే మూడేళ్ల నుంచి ఈ పొలాన్ని బీడుగానే వదిలేశా. ఇప్పుడు జిల్లేడు వంటి పిచ్చి చెట్లు పెరుగుతుంటే బాధని పిస్తోంది.' అని ఎం.తుమ్మలపల్లె సమీప గ్రామమైన మబ్బుచింతలపల్లె రైతు మహేశ్వరరెడ్డి 'ఈనాడు'తో చెప్పారు. యురేనియం ఉత్పత్తి ద్వారా వచ్చిన వ్యర్థాలు భూగర్భంలోకి ఇంకడం వల్ల బోర్లు పాడై వ్యవసాయం దెబ్బతినడం మొదటగా మహేశ్వరరెడ్డి భూమిలోనే జరిగింది. 'ఒకప్పుడు మాబోరు నీటిని ఊళ్లో చాలామంది తీసుకుని వెళ్లి తాగేవారు. ఇప్పుడు తాగడానికి పనికి రావు. నోట్లో కాసిని పోసుకుంటే ఉప్పగా తగులుతాయి' అని ఆయన వాపోయారు. మహేశ్వరరెడ్డి చవిచూసిన అనుభవం ఇప్పుడు చాలామంది ఎదుర్కొంటున్నారు.

యురేనియం ప్రాసెసింగ్ కర్మాగారం వద్ద గుట్టగా పోసిన ముడి ఖనిజం

- మహేశ్వరరెడ్డి పొలంలానే మబ్బుచింతలపల్లె, కె.కె.కొట్టాల, కణంపల్లె గ్రామాల పరిధిలో 100 ఎకరాల వరకూ గత మూడేళ్లలో ఇది విస్తరించింది.
- ఇది కేవలం పంటలకు సంబంధించిన అంశమేకాదు. భూగర్భంలో ప్రమాదకర కాలుష్యం ఇలా విస్తరించడం పర్యావరణంపై.. ఆ ప్రాంత ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తున్నదో తలుచుకుంటేనే ఆందోళన కలిగిస్తున్నది.
- ఈ విషయమై ఇప్పటివరకూ ప్రభుత్వం ఎలాంటి అధ్యయనాన్ని నిర్వహించలేదు.

ప్రమాదకర వ్యర్థాల నిర్వహణకు

ఇవీ నిబంధనలు..

ముడిఖనిజం తవ్వకం, యురేనియం ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే వ్యర్థాల నిర్వహణలో యురేనియం సంస్థ ప్రమాణాలను పాటించలేదని కాలుష్య నియంత్రణ మండలి తేల్చింది. ఈ విషయాన్ని తన నోటీసులో స్పష్టంగా పేర్కొంది. అందులో ఈ కింది వివరాలున్నాయి.

➤ భారత అటవీ పర్యావరణ శాఖ ఎం.తుమ్మలపల్లె సమీపాన గని తవ్వకానికి, యురేనియం ప్రాసెసింగ్ కర్మాగారం నిర్మాణానికి 2007లో అనుమతి ఇచ్చింది. అందులో నిర్దిష్టంగా ఒక నిబంధనను పొందుపరిచింది. దాని ప్రకారం.. వ్యర్థాలను (కొంత బురదలా, కొంత నీటిలా వెలువడుతాయి) నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసే చెరువుకు భూగర్భ జలం కలుషితం కాని రీతిలో లైనింగ్ చేయాలి. చెరువు నిండే క్రమంలో అందులోని నీటిని సేకరించి కర్మాగారంలోనే శుద్ధిచేయాలి. వ్యవసాయానికి పనికివచ్చే ప్రమాణాలతో ఈ శుద్ధి ప్రక్రియ జరగాలి. ఈ క్రమంలో వెలువడే బురదను మళ్లీ చెరువులోకి పంపాలి. శుద్ధి అయిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వాడాలి.

➤ గని తవ్వకానికి, కర్మాగారానికి తాను ఇచ్చిన అనుమతిలో రాష్ట్ర పర్యావరణ మండలి స్పష్టమైన నిబంధన పెట్టింది. వ్యర్థాలను నింపేందుకు తయారు చేసే చెరువు అంతటా 'బెన్‌టోనైట్' (ఇదో రకమైన మట్టి. ఖరీదు ఎక్కువ. నాణ్యతను బట్టి కిలో రూ. 5 నుంచి 10 వరకూ ఉంటుంది)తో 500 మిల్లీమీటర్ల మందంతో పొరను ఏర్పాటు చేయాలి. తర్వాత 250 మైక్రాన్ ఉండే పాలియాథిలిన్ పొరను ఏర్పాటు చేయాలి. తర్వాత 250 మిల్లీమీటర్లతో ఇసుక లేదా మట్టితో మరో పొరను అదనపు రక్షణగా కల్పించాలి.

ఉల్లంఘన ఇలా..

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన మేరకు వ్యర్థాలు నింపే చెరువుకు యురేనియం సంస్థ 250 మైక్రాన్ ఉండే పాలియాథిలిన్ పొరను ఏర్పాటు చేయలేదు. దీనిపై మండలి గత ఏడాది మార్చిలో షోకాజ్ నోటీసును జారీచేసింది. దీనికి యురేనియం సంస్థ సమాధానం ఇస్తూ తాము అణుశక్తి మండలి మార్గదర్శకాల ప్రకారం తగిన మట్టితో అవసరమైన మందంతో వ్యర్థాల చెరువుకు లైనింగ్ ఏర్పాటు చేశామని పేర్కొంది. అయితే అదనపు జాగ్రత్త కోసం పాలియాథిలిన్ పొరను ఏర్పాటు చేసి ఉండాల్సిందని మండలి గట్టిగా అభిప్రాయపడింది.

➤ వ్యర్థాల చెరువుకు లైనింగ్ విషయంలో మండలి ఇచ్చిన మార్గదర్శకాలలో సవరణలు కోరుతూ యురేనియం సంస్థ ఎన్నడూ లేఖ రాయలేదు.

➤ తదుపరి చర్యగా మండలి గత ఏడాది నవంబరు 19న పరిశ్రమకు అదనపు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుత వ్యర్థాల చెరువును భూగర్భంలోకి కాలుష్యం వెళ్లని రీతిలో బాగు చేసేందుకు కాలవ్యవధితో కూడిన కార్యచరణ ప్రణాళికను తమకు సమర్పించాలని అందులో కోరింది. ఇందుకోసం సమీపాన మరో చెరువును ఏర్పాటుచేసి ప్రస్తుతం ఉన్న చెరువు నుంచి వ్యర్థాన్ని అందులోకి మార్చాలని పేర్కొంది.

అయితే ఇవేమీ జరగకపోవడంతో తాజాగా తీవ్రమైన హెచ్చరికతో నోటీసు ఇచ్చింది.

దేశంలో యురేనియం నిల్వలు

తాజా గణాంకాల ప్రకారం దేశంలో సగానికిపైగా యురేనియం నిక్షేపాలు ఎం.తుమ్మలపల్లెలోనే ఉన్నాయి. రాష్ట్రాలవారీగా నిక్షేపాలు ఇలా ఉన్నాయి.



(ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఎం.తుమ్మలపల్లె వద్ద 1,20,229 టన్నులు, గుంటూరు జిల్లా కొప్పునూరు వద్ద 2,341 టన్నుల మేరకు యురేనియం నిల్వలు ఉన్నట్లు అంచనా.)

కణంపల్లె గ్రామంలో రైతు కుటుంబం స్వయంగా తగులపెట్టుకున్న అరటి తోట. భూగర్భ కాలుష్యం వల్ల బోరునీటితో సాగయిన తోటలో తినడానికి పనికిరానివిధంగా కాయలు కాస్తుండటంతో గతిలేక ఆ కుటుంబం ఇలా చేయాల్సి వచ్చింది.

అసాధారణ స్థాయిలో నిర్లక్ష్యం

బోర్లలోని నీటికి కాలుష్య నియంత్రణ మండలి చేయించిన పరీక్షల్లో తేలిన అంశాలు..

1. అణుశక్తి నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం తాగునీటిలో 60 పీపీబీ (పార్ట్స్ పర్ బిలియన్) వరకూ యురేనియం గాఢత ఉండవచ్చు. మబ్బుచింతలపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి అనే రైతు బోరులో అత్యధికంగా 4000 పీపీబీ యురేనియం గాఢత నమోదైంది.
2. అధిక క్షారత్వం, కాఠిన్యం, మెగ్నీయం, సల్ఫేట్లు, సోడియం, నీటిలో కరిగే ఘనవ్యర్థాల (టీడీఎస్)తో పాటు కాపర్, క్రోమియమ్, నికెల్ వంటి భారలోహాలు (హెవీ మెటల్స్) బోర్లలోని నీటిలో ఆమోదనీయమైన పరిమాణం కంటే ఎక్కువగా ఉన్నాయి.
3. మబ్బు చింతలపల్లి గ్రామానికే చెందిన కె.రామాంజనేయులు అనే రైతుకు చెందిన బోరులో 690 పీపీబీ యురేనియం గాఢత బయటపడింది. అంతేకాదు ఇదే బోరులో బీఐఎస్ ప్రమాణాలు దాటి ఉంటున్నాయి.

	పరిమితి	ఉన్నది
(పరిమాణాలన్నీ లీటరుకు గ్రాములలో)		
క్రోమియం	0.05	0.10
నికెల్	0.02	0.11
టీడీఎస్	500	2,045
సల్ఫేట్లు	200	909
అధిక క్షారత్వం	200	604
కాఠిన్యం (టోటల్ హార్డ్‌నెస్)	200	292

యురేనియం తవ్వకాల వల్ల నీటి కలుషితం ఇలా..



పర్యవసానాలేమిటి?

నీరు ఇలా కలుషితం కావడం వల్ల కలిగే పర్యవసానాలు విపరీతంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

- యురేనియం గాఢత ఎక్కువ ఉన్న నీరు మనుషులేకాదు.. జంతువులు తాగడానికీ పనికి రాదు. మనుషులకు మూత్రపిండాలు దెబ్బతింటాయి. నపుంసకత్వం సంభవిస్తుంది. చర్మవ్యాధులు సోకుతాయి.
- నీటిలో అధిక ఘనపదార్థాలు కరిగి ఉండటంవల్ల దానిని తాగితే మూత్రపిండాలు పాడైపోతాయి.
- నీటిలో అధిక క్షారత్వం ఉంటే దానిని ఉపయోగించిన భూమి వ్యవసాయానికి పనికి రాకుండాపోతుంది. నేల గట్టిపడిపోయి మొక్కలను పెరగనివ్వదు.
- క్రోమియం ఎక్కువ ఉండటంవల్ల కూడా ఆ భూమిలో పెరిగిన మొక్కలు పోషకాలను సరిగా తీసుకోలేవు.

బయటపడింది ఇలా..

యురేనియం కర్మాగారం సమీపంలోని బోర్లలోని నీరు పాడైపోయి తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, పంటలూ దెబ్బతింటున్నాయని గోడు వెళ్లబోసుకుంటూ అక్కడి ప్రజలు కాలుష్య నియంత్రణ మండలికి లేఖలు రాశారు. అలాగే స్థానిక ఎంపీ అవినాష్‌రెడ్డి, ఈ సమస్యపై తొలినుంచి పోరాడుతున్న పర్యావరణ వేత్త కె.బాబురావు విజ్ఞాపనలు పంపారు. దీంతో మండలి ఆ గ్రామాల పరిధిలో వివిధ బోర్ల నీటిని పరీక్షలు చేయించింది. భూగర్భజల్లాల్లో యురేనియం గాఢత, అధిక క్షారత్వం (హై ఆల్కలిటి) పరిమితికి మించి అనేక రెట్లు ఎక్కువగా ఉన్నట్లు ఆ పరీక్షలలో తేలింది. యురేనియం సంస్థ ఖనిజ ఉత్పత్తిలో భాగంగా చేసే క్షారయాన నిక్షాళన ప్రక్రియ (ఆల్కలైన్ లీచింగ్ మెథడ్) ఇందుకు కారణం అయి ఉండొచ్చని కాలుష్యనియంత్రణ మండలి అంచనా వేసింది.

సహాయం గురించి ఆలోచించేవారేరి?

'భూగర్భ కాలుష్యం వల్ల మా భూములను సాగు చేసుకోలేకపోతున్నాం.. ఏదో ఒక సహాయం అందించాలని మేమంతా అధికారుల చుట్టూ తిరిగాం. అయినా ఫలితం లేదు.' అని మబ్బుచింతలపల్లెకే చెందిన రైతు సుధాకరరెడ్డి వాపోయారు. 'నాకున్న ఎకరంన్నర పొలం వల్ల ఉపయోగం లేకుండాపోయింది. ఆదాయం లేక అప్పులు పెరుతున్నాయి. ఎలా తీర్చాలో తెలియడం లేదు.' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

తుమ్మచెట్లు పెరుగుతున్నాయ్

కణంపల్లెలోనే మధునాయక్ కుటుంబానికి అయిదు ఎకరాల భూమి ఉంది. అందులో ఒకప్పుడు అరటితోటలు బాగా సాగయ్యేవి. డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసి వాటికి నీరందించేవారు. బోరులోని నీరు విషతుల్యం కావడంతో 20 నెలల నుంచి భూమిని బీడుగా వదిలేశారు. డ్రిప్ పరికరాలనీ తీసేసి పక్కన పెట్టారు. 'ఒకప్పుడు లక్షల ఆదాయం ఇచ్చే అరటి తోటలు వేసిన భూమి ఇది. ఇప్పుడు బీడుగా వదిలేశాం. తుమ్మచెట్లు పెరుగుతుంటే చూసేందుకు చాలా బాధగా ఉంది' అని మధునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

టమోటా వేసినా అదే పరిస్థితి

'మాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఒకప్పుడు అరటి వేసేవాళ్లం. అది ఇప్పుడు దిగుబడి రావడం లేదని ఈసారి టమోటా వేశాం. మామూలుగా అయితే మూడునెలలకే కోతకు రావాలి. మేం వేసి నాలుగు నెలలైంది. ఇప్పుడు చిన్న పిందెలే కాస్తున్నాయి. పంట వస్తుందనే నమ్మకంలేదు. ఏంచేయాలో అర్థం కావాడం లేదు' కణంపల్లెకే చెందిన లలిత వాపోయారు.

స్కోచ్ సంస్థ అధిపతి పన్నీర్‌కొచ్చర్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న వ్యవసాయశాఖ విత్తన విభాగం ఉప సంచాలకుడు శివప్రసాద్, ఉద్యోగులు

వ్యవసాయశాఖకు స్కోచ్ పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా రాయితీ విత్తనాలను విక్రయించే విధానాన్ని ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర వ్యవసాయశాఖకు జాతీయ స్థాయి స్కోచ్ పురస్కారం దక్కింది. బుధవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్కోచ్ సంస్థ అధిపతి పన్నీర్ కొచ్చర్ నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ విత్తన విభాగం ఉప సంచాలకుడు శివప్రసాద్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విత్తనాల విక్రయంలో పారదర్శక విధానాన్ని ప్రవేశపెట్టినందున జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు.

తొమ్మిది జిల్లాల్లో వర్షాభావం

- 10 శాతం తగ్గిన వానాకాలం సాగు విస్తీర్ణం
- వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో వానాకాలం (ఖరీఫ్) పంటల సాగు సాధారణంకన్నా 10 శాతం తగ్గింది. ఆహార ధాన్యాల పంటల సాగు తగ్గుదల 12 శాతం ఉన్నట్లు వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. 9 జిల్లాల్లో వర్షాభావం తీవ్రంగా ఉంది. వీటిలో సాధారణంకన్నా 20 శాతానికి మించి వర్షపాతం లోటు ఏర్పడింది. గత జూన్ ఒకటి నుంచి బుధవారం వరకు రాష్ట్ర సాధారణ వర్షపాతం 567.4 మిల్లీమీటర్ల(మి.మీ.)కు 527.3 మి.మీ.లు కురిసింది. గతేడాది ఇదే సమయంలో 582.7 మి.మీ.లు నమోదైంది. ఈ ఏడాది రాష్ట్రస్థాయి సగటు వర్షపాతం తగ్గుదల 7 శాతమే ఉన్నా కొన్ని జిల్లాల్లో 29 శాతం నమోదైంది. గత జూన్, జులై నెలల్లో వర్షాలు లేనందున లోటు అలాగే కొనసాగుతోంది.

- ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 43.34 లక్షల హెక్టార్లకు 38.79 లక్షల హెక్టార్లలో విత్తనాలు, నాట్లు వేశారు. గతేడాది ఇదే సమయానికి ఇంతకన్నా మరో 53 వేల హెక్టార్లు అదనంగా సాగైంది.
- పత్తి, రాగుల పంటలు మాత్రమే సాధారణంకన్నా అధిక విస్తీర్ణంలో వేశారు.
- పప్పుధాన్యాలు 13, నూనెగింజలు 24, ఆహారధాన్యాలు 12 శాతం తక్కువగా సాగయ్యాయి.
- ప్రధాన ఆహార పంట వరి 96 శాతం విస్తీర్ణంలో నాట్లు వేశారు.

గురుకుల జేఎల్ ఫలితాల ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: గురుకుల జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించామని గురుకుల నియామక బోర్డు కన్వీనర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. మొత్తం 12 సబ్జెక్టుల్లో 281 పోస్టులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించామని, నియామక ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాలు గురుకుల వెబ్‌సైట్లో పొందుపరిచామని వివరించారు.

ఇక్కడ డెంగీ పరీక్షలు ఉచితం

- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద అక్షరాలతో ప్రదర్శన
- వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా డెంగీ జ్వర నిర్ధారణ పరీక్షలు, ఔషధాలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. 'ఇక్కడ డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితం' అని పేర్కొంటూ పెద్ద అక్షరాలతో అన్ని సర్కారు దవాఖానాల్లో బోర్డులు ప్రదర్శించాలని బుధవారం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి సమాచారం సేకరించి రోజు వారీ వ్యాధుల నమోదు వివరాలను 'ఇ-బర్డ్' పోర్టల్‌లో పొందుపర్చాలని నిర్ణయించింది. ఇంకా పలు ఆదేశాలు జారీ చేసింది.

- జ్వరపీడితులు పేరు నమోదుకోసం ఎక్కువ సేపు వరుసల్లో నిలబడటం కష్టం కాబట్టి.. గరిష్ఠంగా 20 నిమిషాల్లోనే నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- ఉన్నతస్థాయి అత్యవసర సేవలు అవసరమని భావిస్తే.. తక్షణం రోగిని హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు తరలించడానికి వీలుగా అన్ని ఆసుపత్రుల వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

కేసు భయంతో.. బాలుడి ఆత్మహత్య

- పోలీసుల వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ
- మృతదేహంతో 5 గంటల పాటు ఆందోళన
- లాఠీఛార్జి అనంతరం పరిస్థితి అదుపులోకి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసులు కేసు పెట్టారేమోనని భయపడి 17 ఏళ్ల బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన దుర్ఘటన బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. మృతికి పోలీసుల వేధింపులే కారణమని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబికులు ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి పోలీసుస్టేషన్ ఎదుట 5 గంటలపాటు ఆందోళ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం అశ్వారావుపేట పట్టణం జంగారెడ్డిగూడెం రహదారిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను కొందరు ధ్వంసం చేశారు. చోరీ యత్నం జరిగినట్టు పత్రికల్లోనూ, సామాజిక మధ్యమాల్లోనూ వచ్చింది. ధ్వంసం చేసిన యువకుడు రెండు రోజుల క్రితం సీఐ అబ్బయ్య వద్దకు వెళ్లి తానే తాగిన మైకంలో ధ్వంసం చేసినట్లు చెప్పి లొంగిపోయాడు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు... ఏటీఎం బయట ఉన్న ముగ్గురు యువకులను సాక్షులుగా పెట్టారు. ఆత్మహత్య చేసుకున్న బాలుడు కూడా ఆ సాక్షుల్లో ఉన్నాడు. విచారణకని పిలిస్తే బుధవారం స్టేషన్‌కు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడున్న నిందితుడి తల్లిదండ్రులకు 'మీ కుమారుడికి శిక్ష పడే అవకాశాలున్నాయ'ని పోలీసులు చెప్పడం విన్నాడు. తనపైనా కేసు నమోదైందని భయపడ్డాడు. స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అశ్వారావుపేట సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ బిడ్డ పోలీసుల వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబికులు ఆందోళనకు దిగారు. నివారించాలని సీఐ అబ్బయ్య ప్రయత్నింగా ఆయనతో మృతుడి బంధువులు వాగ్వాదానికి దిగారు. మృతదేహాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లే యత్నాన్ని అడ్డుకున్న పోలీసులను నెట్టివేశారు. వారికి దొరక్కుండా ఇద్దరు వ్యక్తులు విగతజీవిని ద్విచక్ర వాహనంపై స్టేషన్‌కు తీసుకెళ్లి ఆందోళనకు దిగారు. పాల్వంచ డీఎస్పీ మధుసూదన రావు శాంతింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు పోలీసులు లాఠీఛార్జి చేసి ఆందోళన చేస్తున్నవారిని చెల్లాచెదురు చేశారు. పోలీసు భద్రతతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఈనాడు మాంద్యానికి మందు?

కొలం కలిసొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి అదనపు నిధులు వచ్చి పడుతున్నాయి. బిమల్ జలాన్ కమిటీ సిఫార్సులపై రిజర్వ్‌బ్యాంక్ కేంద్ర మండలి ఆమోదముద్ర వేయడం తరువాయి, ఇటీవలి కాలంలో కనీ వినీ ఎరుగనంత మొత్తంలో కేంద్ర కోశాగారంలోకి మిగులు నిధుల ప్రవాహానికి దారులు తెరుచుకున్నాయి! ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఆవరిస్తూ దేశీయంగానూ వృద్ధిరేటు అంచనాలు తెగ్గోసుకుపోతున్న తరుణమిది. ఈ సంవత్సరం జనవరి-మార్చి మధ్య 5.8శాతానికి పరిమితమైన వృద్ధిరేటు తరవాతి త్రైమాసికంలో 5.7శాతానికి కుంగింది. మూడీస్ సంస్థ జోస్యం పలికిన 6.7శాతం కన్నా తక్కువకు వృద్ధిరేటు తల వేలాడేస్తుండగా- జీఎస్‌టీ (వస్తుసేవల పన్ను) పద్దుకింద రాబడి, ఆదాయ పన్ను వసూళ్లు నిర్దేశిత లక్ష్యాలకు దూరంగా ఆగిపోవడం వ్యూహకర్తల్ని కలవరపరుస్తోంది. బడ్జెట్లో భారీయెత్తున ప్రకటించిన పెట్టుబడి ప్రణాళికల నిమిత్తం నిధులకు కొరత వెన్నాడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర కాలానికి స్థూల దేశీయోత్పత్తిలో 3.3శాతానికి ద్రవ్యలోటు కట్టడి కావాలన్నది ప్రభుత్వ ప్రవచిత లక్ష్యం. ఏడాది మొత్తానికి సుమారు ఏడు లక్షల కోట్ల రూపాయలుగా లెక్కతేలాల్సిన ద్రవ్యలోటు రాశి ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికం చివరికే రూ.4.32 లక్షల కోట్లకు ఎగబాకింది. కమ్ముకొస్తున్న ఆర్థిక సంక్షోభంనుంచి గట్టెక్కడమెలాగని తలపట్టుకున్న కేంద్రానికి జలాన్ కమిటీ సిఫార్సులు వీనుల విందయ్యాయి. ఆర్‌బీఐ మండలి సమ్మతించిన ప్రకారం 2018-19 సంవత్సరానికి రూ.1,23,414 కోట్ల మిగులు మొత్తంతోపాటు సవరించిన ద్రవ్య పెట్టుబడి చట్రం (ఈసీఎఫ్) ప్రాతిపదికన రూ.52,637 కోట్ల అధిక నిల్వలు కేంద్ర ఖజానాకు జమపడనున్నాయి. మొన్న ఫిబ్రవరిలో చెల్లించిన రూ.28 వేలకోట్ల మధ్యంతర డివిడెండు పోను తక్కిన మొత్తం లెక్కించినా- ఆర్‌బీఐ నుంచి డివిడెండుగా బడ్జెట్లో ప్రస్తావించిన రూ.90 వేలకోట్లకన్నా అధికంగా నిధుల ప్రవాహం కేంద్రానికి సాంత్వన ప్రసాదించనుంది. ఈ నిధుల్ని ఎలా వినియోగించాలన్నదానిపై ఇదమిత్థంగా ఇంకా నిర్ధారణకు రాలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నా- అవి మాంద్యానికి మేలిమి ఔషధంగా ఉపకరించాలన్నదే పలువురు నిపుణుల ఉమ్మడి సలహా!

అదనపు నిధుల అంశమే ఏడాది క్రితం రిజర్వ్ బ్యాంకుకు, మోదీ ప్రభుత్వానికి మధ్య ఘర్షణాత్మక వాతావరణానికి కేంద్ర బిందువైంది. అధిక డివిడెండ్ కావాలని కేంద్రం ఆర్‌బీఐపై ఒత్తిడి పెంచడం అనుచితమేనని విమర్శించినందుకు రిజర్వ్‌బ్యాంక్ బోర్డులో డైరెక్టరుగా ఉన్న నచికేత్ మోర్‌పై నిరుడు అక్టోబరులో ఉన్నట్టుండి వేటుపడింది. కేంద్రీయ బ్యాంకు స్వయంప్రతిపత్తిపై డిప్యూటీ డైరెక్టర్ విరాల్ ఆచార్య సూటి వ్యాఖ్యలతో సర్కారు అగ్గిమీద గుగ్గిలమైంది. అప్పటికి ఆర్‌బీఐ వద్ద పోగుపడిన రూ.9.63 లక్షల కోట్ల నిధుల్లో తనకు రూ.3.6 లక్షల కోట్ల మేర బదిలీ చేయాలన్న కేంద్రం విజ్ఞప్తిని రిజర్వ్‌బ్యాంక్ సారథిగా ఉర్జిత్ పటేల్ తోసిపుచ్చారన్న కథనాలు వెలుగుచూశాయి. ఆర్‌బీఐ దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వ విధానానికి కట్టుబాటు చాటిన పటేల్ గత డిసెంబరులో రాజీనామా చేసి నిష్క్రమించడం తెలిసిందే. సహాయ నిరాకరణ దశకు చేరిన రిజర్వ్‌బ్యాంక్ సారథ్య పగ్గాలు శక్తికాంత దాస్‌కు దఖలుపడిన దరిమిలా ఆర్‌బీఐ మిగులు నిధుల విషయమేమిటో తేల్చడానికి బిమల్ జలాన్ కమిటీ నియుక్తమైంది. మూడు నెలల గడువును పొడిగించి, ఆర్థిక కార్యదర్శిగా సుభాష్‌చంద్ర గార్గ్ స్థానే రాజీవ్ కుమార్‌ను నియమించాకనే వాతావరణం కొంత తేటపడింది. కనుకనే కీలక వడ్డీరేట్ల కోతలను వెన్నంటి మిగులు నగదు నిల్వల బదిలీపైనా రిజర్వ్‌బ్యాంక్ బాణీ కేంద్రం నాగస్వరానికి అనుగుణంగా మారింది. ఆర్‌బీఐ ఆస్తిఅప్పుల పట్టీ (బ్యాలన్స్ షీట్) ప్రాతిపదికన 6.5-5.5 శాతం మేర అత్యవసర నిధిని ప్రత్యేకించాలని బిమల్ జలాన్ కమిటీ సిఫార్సు చేయగా, కనిష్ఠ పరిధికి ఓటేయడం ద్వారా కేంద్రానికి అందుబాటులోకి వచ్చే నిధులు పెరిగాయి. ముమ్ముందూ ఇదే ఒరవడి స్థిరపడితే రిజర్వ్‌బ్యాంక్ ఆర్థిక సుస్థిరత మాటేమిటి?

ద్రవ్యలోటును ఎదుర్కోవడంలో మునుపటి ప్రభుత్వాలకన్నా మెరుగైన రికార్డు కలిగిన తమ సర్కారుకు రిజర్వ్‌బ్యాంక్ మిగులు నిధులు అక్కర్లేదని ఆర్థిక మంత్రిగా అరుణ్ జైట్లీ గత డిసెంబరులో లోక్‌సభాముఖంగా స్పష్టీకరించారు. ఆర్‌బీఐ చెంత ఉన్న మిగులు నిల్వల్ని పేదరిక నిర్మూలనకు, ప్రభుత్వరంగ బ్యాంకుల అదనపు పెట్టుబడి అవసరాలకు ఉపయోగించవచ్చునని నాడాయన సూచించారు. ఇప్పటి వాస్తవ పరిస్థితి వేరు. ఆర్థిక మంత్రిత్వశాఖను పర్యవేక్షిస్తున్న నిర్మల ఇటీవల ప్రకటించిన ప్రకారం బ్యాంకులకు రూ.70 వేలకోట్ల మూలధన ప్రదానంపై ఇచ్చిన మాట దక్కించుకోవడానికి ఆర్‌బీఐ మిగులు నిధులే అక్కరకు రానున్నాయన్నది విశ్లేషకుల అంచనా. ప్రస్తుతం స్థూల రుణాల్లో 28 శాతం నిష్పత్తిలో రిజర్వ్‌బ్యాంక్ వద్ద మిగులు నిల్వలు ఉంటున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం, అందులో సగం 14 శాతం దాకా నిధులు సరిపోతాయన్న వాదనకు లోగడే ఓటేసిన ఆర్థిక మంత్రిత్వశాఖ మిగులును ఎలా సద్వినియోగపరచాలన్నదానిపై ఇప్పటికీ ఒక స్పష్టతకు రాలేకపోయిందని- అమాత్యుల స్పందనే వెల్లడిస్తోంది. పొదుపు నిధుల్ని దీర్ఘకాలిక పెట్టుబడులుగా మళ్ళించాలే తప్ప లోటుభర్తీకి వినియోగించరాదన్న సూచనలు ఎన్నాళ్లుగానో వినిపిస్తున్నాయి. పన్ను వసూళ్లలో లోటుభర్తీకి ఆర్‌బీఐ నిధుల్ని ఉపయోగిస్తే, ద్రవ్యోల్బణ సమస్య పెచ్చరిల్లుతుందన్న హెచ్చరికలూ తేలిగ్గా తోసిపుచ్చలేనివి. తయారీ రంగం బహుముఖ సవాళ్ల పాలబడిన దృష్ట్యా పారిశ్రామికాభివృద్ధి సూచీ కోలుకోవడానికి సుదీర్ఘకాలం పడుతుందన్న వ్యాఖ్యల వెలుగులో కేంద్రం అప్రమత్తం కావాలి. నెమ్మదించిన ఆర్థిక రంగాన్ని తిరిగి ఉరకలెత్తించే సరైన ఉద్దీపన చర్యలకు మిగులు నిధుల్ని మళ్ళించడమే విజ్ఞతాయుత నిర్ణయంగా మన్ననలందుకుంటుంది!

రుణగ్రస్త రాష్ట్రాలతో లక్ష్యం నెరవేరేనా?

డాక్టర్ ఎస్.అనంత్

రాబోయే అయిదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థను అయిదు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న నరేంద్ర మోదీ సర్కారు సంకల్పం సర్వత్రా ఆసక్తిని, ఆశాభావాన్ని రేపుతోంది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే నానుడి ప్రకారం ఏదీ అసాధ్యం కాదు. అయితే, ఆర్థిక ఫలాలు ప్రజలందరికీ అందకపోతే లాటిన్ అమెరికా దేశాల్లో మాదిరిగా తీవ్ర ఆదాయ వ్యత్యాసాలు, సామాజిక అశాంతి ప్రబలి మొదటికే మోసం వస్తుంది. అలాంటిది జరగకుండా జాగ్రత్త పడుతూనే, అయిదు లక్షల కోట్ల డాలర్ల స్వప్నం నెరవేరడానికి రాష్ట్రాలే కీలకమని గుర్తించాలి. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడనిదే ఈ స్వప్నం నెరవేరదు. అభివృద్ధి, సంక్షేమాలకు కేంద్ర ప్రభుత్వం వెచ్చించే నిధులకన్నా రాష్ట్రాలు వ్యయం చేసే నిధులే అధిక ప్రయోజనాలను అందిస్తాయి. పైగా ఆ ప్రయోజనాలు బహుముఖంగా ఉంటాయి. కాబట్టి అన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు సమన్వయంతో కృషి చేస్తేనే అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం సుసాధ్యమవుతుంది. ముందుగా మన రాష్ట్ర ప్రభుత్వాలు తాము అనుసరిస్తున్న ఆర్థిక నమూనాలను పునఃసమీక్షించుకోవాలి. తమ పంథా మార్చుకోవడానికి కఠిన నిర్ణయాలకు వెనకాడకూడదు. ఆ చొరవ చూపడంలో రాష్ట్రాలు ఎంత ఆలస్యం చేస్తే అంతగా వాటి ఆర్థిక స్వస్థత దిగజారిపోతుంది.

ఏ ఆర్థిక వ్యవస్థ అయినా రెట్టింపు పెరగాలంటే వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, సేవా రంగం, ఎగుమతులు అన్నీ జోరందుకోవాలి. ఇంతవరకు భారత్ సాధించిన అభివృద్ధి అంతా సేవారంగంలో దిగువ శ్రేణి మీద, ప్రభుత్వంలో అన్ని స్థాయిలు ఎడాపెడా చేసిన అప్పుల మీద ఆధారపడింది. ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు చేసిన అప్పుల వల్ల వ్యవసాయం, పరిశ్రమల్లో ఉద్యోగాలు పెరిగిందీ లేదు, మౌలిక వసతులు విస్తరించిందీ లేదు. ప్రభుత్వం అదనంగా విలువ జోడింపూ సాధించలేకపోయింది. ఏదో ఒక విధంగా అధిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును సాధిస్తే చాలనుకొంది. ఇంతవరకు అన్ని ప్రభుత్వాలదీ ఇదే వరస. సాంకేతికత విజృంభిస్తున్న ఈ రోజుల్లో అదనపు విలువ జోడింపు చాలా చాలా ముఖ్యం. అందుకు ఉత్పాదకత పెంచాలి. భారత సర్కారు ఆ దిశగా కృషి చేయకుండా అప్పుల మీద వస్తుసేవల వినియోగం పెంచి, తద్వారా జీడీపీ వృద్ధిని చూపుతూ వస్తోంది. అంతేతప్ప గత పదేళ్లలో నికర విలువ జోడింపు కనీసం రెట్టింపైనా పెరగలేదు.

ప్రధాని మోదీ

అప్పుల కొండ

రాష్ట్రాల్లో 2014-17 మధ్యకాలంలో కర్మాగారాల సంఖ్య చాలా స్వల్పంగానే పెరిగింది. అదే 2010-14 మధ్య కర్మాగారాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. ఆ తరవాత వస్తుసేవల పన్ను (జీఎస్టీ) దెబ్బకు ఉన్న కర్మాగారాలు మూతపడి వాటి స్థానాన్ని భర్తీ చేసే స్థాయిలో కొత్త కర్మాగారాలు ఏర్పడలేదు. ఇంకా విచారకరమేమంటే 2012-13 నుంచి 2016-17 వరకు అన్ని రాష్ట్రాల్లో పెట్టుబడి సంచయం క్షీణించడం. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వచ్చిపడే వరకు రాష్ట్రాలు ఆర్థికంగా వృద్ధి పథంలోనే ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు సైతం సూచించాయి. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం, పాత రుణాలపై వడ్డీ చెల్లింపులు పెరిగిపోతుంటే రెండోవైపు జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు అనే జంట తంటాలతో ఆదాయం అదే స్థాయిలో పెరగక ఖజానాకు పెద్ద బొర్రె పడుతోంది. అయినా కూడా రాష్ట్రాలు వార్షిక బడ్జెట్లలో ఆదాయాన్ని అసలుకన్నా ఎక్కువగా అంచనా వేసి, తాహతు మించి ఖర్చు చేస్తూ, చివరకు తీవ్రలోటులోకి జారిపోతున్నాయి. రాష్ట్రాలు తాము తీసుకున్న రుణాలను మరింత సమర్థంగా, బాధ్యతగా ఖర్చుచేయాలి. పొదుపునకు ప్రాధాన్యమివ్వాలి. 2008 తరవాత మళ్ళీ ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టే ప్రమాదం పొంచి ఉందని గ్రహించి ఆచితూచి ఖర్చుచేయాలి.

1991 నుంచి రాష్ట్రాల రుణ భారం పెరగడమే తప్ప తరిగింది లేదని ఇటీవల రిజర్వు బ్యాంకు గణాంకాలు రూఢిచేశాయి. 1991లో అన్ని రాష్ట్రాల రుణ భారం రూ.1.28 లక్షల కోట్లు. 2019 మార్చినాటికి అవి 45 లక్షల కోట్ల రూపాయలను మించాయి. 1990లో రూ.8,660 కోట్లుగా ఉన్న వడ్డీ చెల్లింపులు 2019కల్లా మూడు లక్షల కోట్ల రూపాయలను మించిపోయాయి. జీతభత్యాలు, పింఛన్లు, బాధ్యతారహితమైన పథకాలు, రుణ కిస్తీల చెల్లింపులకే రాష్ట్రాల ఆదాయం హరించుకుపోతోంది. ఉదాహరణకు 1990-91లో అవిభక్త ఆంధ్రప్రదేశ్ పింఛన్లకు రూ.330 కోట్లు ఖర్చుచేయగా, రాష్ట్ర విభజన అనంతరం ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే 2018-19లో ఈ పద్దుకు రూ.15,200 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. తెలంగాణ పింఛన్ల ఖర్చు రూ.11,700 కోట్లకు చేరింది. ఆర్థిక మాంద్యంలో ఇంత ఖర్చును రెండు తెలుగు రాష్ట్రాలు తట్టుకోగలుగుతాయా? ఆదాయ వనరులు లేకపోయినా కేవలం ఓట్లు దండుకొని ఎన్నికల్లో గెలవడం కోసమని రాజకీయ పార్టీలు పేదలకు సబ్సిడీలు, ఉద్యోగులకు వేతనాలు, పింఛన్ల పెంపుదలను పాచికలుగా వాడుతున్నాయి. ఆ ఖర్చులు భరించలేక పదేపదే రిజర్వు బ్యాంకు వద్దకు ఓవర్ డ్రాఫ్టుల కోసం పరుగెడుతున్నాయి. అత్యవసరమైనప్పుడు తీసుకోవలసిన ఓవర్ డ్రాఫ్ట్ రాష్ట్రాలకు నిత్యావసరమైపోవడం విచారకరం.

అయిదేళ్లలో అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం

రాష్ట్రాలు తమ సామాజిక సంక్షేమ వ్యయాన్ని పునఃసమీక్షించుకోవలసిన సమయం వచ్చేసింది. సంక్షేమ పథకాలు, సబ్సిడీలను నిజంగా అర్హులకే పరిమితం చేయాల్సింది పోయి ఓట్ల కోసం అసంఖ్యాక జనానికి పందేరం చేస్తున్నాయి. ఈ క్రమంలో అనర్హులూ వచ్చిచేరుతున్నారు. 1990-91లో రూ.35,130 కోట్లుగా ఉన్న రాష్ట్రాల సామాజిక వ్యయం, 2018-19 వచ్చేసరికి రూ.14.90 లక్షల కోట్లకు చేరుకుంది. ఇన్ని లక్షల కోట్లు వెచ్చిస్తున్నా పేదరికం మాత్రం అలానే ఉంది. దీనికి కారణమేమిటో రాష్ట్రాలు ఆలోచించుకోవాలి. సామాజిక వ్యయం వల్ల ప్రజల అవసరాలు తీరడమే కాదు, వారితోపాటు యావత్ దేశమూ ఆర్థికంగా అభివృద్ధి చెందే వాతావరణం ఏర్పడాలి. అందుకు దిట్టమైన పునాదులు పడాలి. ప్రజలకు సామాజిక భద్రత ఉండటం అవసరమే. వృద్ధులు, బాలలు, దివ్యాంగులు, నిస్సహాయులను ఆదుకోవడానికి సామాజిక సబ్సిడీలు తప్పక ఇవ్వాలి. కానీ, పని చేయడానికి తగిన వయసు, శారీరక, మానసిక శక్తి ఉన్నవారికీ సబ్సిడీలు, పింఛన్లు ఇవ్వడం ఏమాత్రం సబబు కాదు. పైగా రాష్ట్రాలు అప్పుచేసి మరీ సబ్సిడీలు ఇవ్వడం భవిష్యత్తుకు, ఆర్థిక భద్రతకు ఏమాత్రం క్షేమకరం కాదు. పేదలకు సబ్సిడీలు ఇవ్వొద్దని ఎవరూ అనడం లేదు, రాష్ట్రాలు అప్పుచేసి పప్పుకూడు తినడం మంచిది కాదని చెప్పడం మాత్రమే ఇక్కడ ఉద్దేశం. ఉన్న డబ్బంతా సామాజిక సంక్షేమ పథకాలకే ఖర్చయిపోతే, పరిశ్రమలు, మౌలిక వసతుల స్థాపనకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి? అవి లేకుండా ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన సాధ్యం కాదు. ఉద్యోగాలు, వ్యాపారాలు పెరిగితేనే కదా ప్రభుత్వాలకు ఆదాయం సమకూరేది! ఆదాయం పెరిగినప్పుడు సంక్షేమానికి నిధులు లభిస్తాయి. ఆ పని చేయకుండా అప్పుల మీద బండి నడిపించలేమని ప్రభుత్వాలు గుర్తించాలి.

ఆర్థిక క్రమశిక్షణ తక్షణావసరం

రాష్ట్రాలకు నిధుల కటకట ఏర్పడినప్పుడల్లా బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇతర ఆర్థిక సంస్థల వద్దకు పరుగెడుతుంటాయి. ఈ సంస్థలపై వచ్చే మెత్తని ఒత్తిళ్ల వల్ల అవి రాష్ట్రాలకు రుణాలివ్వక తప్పడం లేదు. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాలకు సైతం కొత్త అప్పులు ఇవ్వాల్సి వస్తోంది. ఈ కొత్త రుణాలను పాత రుణ కిస్తీలు, వడ్డీ చెల్లించడానికో వెచ్చిస్తారని తెలిసి కూడా అప్పులివ్వక తప్పడం లేదు. ఇది చివరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల సుస్థిరతకు చేటుతెస్తోంది. దీన్ని నివారించడానికి రాష్ట్రాలు నిధుల కోసం బ్యాంకుల మీద కాకుండా బాండ్ మార్కెట్ల మీద ఆధారపడటం మంచిది. అందుకే కేంద్రం ఈ దిశగా రాష్ట్రాలను మార్కెట్ రుణాలు తీసుకోవాలని సూచిస్తోంది. బాండ్ల ద్వారా నిధులు సేకరించదలచిన రాష్ట్రాలు మొదట తమ ఇల్లు చక్కదిద్దుకోవలసి ఉంటుంది. ఆర్థికంగా గట్టి పునాదులు ఉన్న రాష్ట్రాలు విడుదల చేసే బాండ్లకు మాత్రమే విలువ ఉంటుంది. వాటిని కొనడానికి వ్యక్తులు, సంస్థలు ముందుకొస్తాయి. బాండ్ల విపణి విస్తరిస్తున్న కొద్దీ ఆర్థిక క్రమశిక్షణ, బాధ్యత ఉన్న రాష్ట్రాల బాండ్లకు గిరాకీ హెచ్చుతుంది. అప్పులు తగ్గించుకుని ఆదాయం పెంచుకున్న రాష్ట్రాలది పైచేయి అవుతుంది.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్రం ఓటు బ్యాంకు రాజకీయాలకు, రాజకీయ అగత్యాలకు అతీతంగా ఆలోచించాలి, జనాకర్షక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేసేసి సమస్యల్లో పడవద్దని రాష్ట్రాలకు జాగ్రత్త చెప్పాలి. చేతులు కాలకముందే కేంద్రం ఈ పని చేయాలి. ఖర్చులు, బడ్జెట్ లోట్లను తగ్గించుకొంటే దీర్ఘకాలంలో ఆర్థికాభివృద్ధి సుసాధ్యమవుతుందని హితవు చెప్పాలి. రేపటి ఆర్థిక స్వస్థత కోసం రాష్ట్రాలు ఇవాళ చేదు గుళిక మింగడానికి సిద్ధపడాలి. స్వీయ రాజకీయ ప్రయోజనాలకోసం ఖజానాను దివాలా తీయించే పెడధోరణులతో దారి తప్పిన రాష్ట్రాలపై 360వ అధికరణాన్ని కొరడాలా ఝుళిపించే అధికారాన్ని రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిందని మరవకూడదు. భారత దేశం లేదా అందులో కొన్ని ప్రాంతాల ఆర్థిక సుస్థిరత కానీ, పరపతి కానీ దెబ్బతింటాయనుకొంటే రాష్ట్రపతి 360వ అధికరణ కింద ఆర్థిక ఆత్యయిక స్థితిని ప్రకటించవచ్చు. అదే జరిగితే జీతాలు, పింఛన్లు, అప్పులు తీర్చేస్తోమత... ఇలా అన్నింటిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అది ప్రస్తుత మాంద్య ప్రమాదంకన్నా ఎన్నోరెట్లు తీవ్రమైనది అవుతుంది!

(రచయిత- ఆర్థిక, సామాజిక రంగ నిపుణులు)

తెలుగు నుడికి గుడి

'తేనెతేటల నవకంపు సోనలకును సాటియగును మా తెలుగు భాషామతల్లి' అని సురవరం ప్రతాపరెడ్డి కీర్తించినా, 'నీ తెలుగెవ్వరిపాలు చేసితివాంధ్రా' అని వేలూరి శివరామశాస్త్రి ఆవేదన చెందినా రెండూ వాస్తవాలే. మన తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని, విభిన్న స్రవంతులను తనలో లీనం చేసుకోగల సామర్థ్యం గలదంటూ, అత్యంత సమన్వయ శక్తిసంపన్నమైనదిగా, రూపనిష్పత్తి, వైవిధ్యం గల భాషగా పాశ్చాత్య మేధావులు ప్రశంసించారు. నేటితరం మాత్రం 'వర్తమాన అవసరాలకు మన తెలుగుభాష సరిపోతుందా?' అని పరభాషా వ్యామోహంలో పలవరిస్తున్నది. 'మా పిల్లలకు తెలుగు రాదు' అని సగర్వంగా చెప్పుకొంటున్న తల్లిదండ్రుల్ని చూసి కాబోలు- కాళోజీ 'తెల్గు బిడ్డవయ్యి తెలుగు రాదంచును సిగ్గులే కనింక చెప్పుటెందుకురా, అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా' అని ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. నానాటికీ ఈ తరానికి తల్లి భాష దూరమైపోతున్నదనే ఆవేదన భాషాభిమానుల్లో ఉంది.

మనిషి ఉనికికి కీలకం భాష, ప్రాణం భాష. నాగరికతా వికాసంలో భాషలదే ప్రధాన పాత్ర. ఏ భాషైనా ఆ భాష మాట్లాడే మనుషుల చారిత్రక, సామాజిక, జ్ఞాన అనుభవాలను జీర్ణించుకుని మనుగడ సాగిస్తుంది. ప్రపంచంలో ఒక నిర్ణీత ప్రదేశం, ప్రత్యేక భాష, సంస్కృతి, చరిత్ర కలిగిఉన్న జన సముదాయాన్ని ఒక జాతిగా పరిగణిస్తారు. భాషాపరంగానే జాతికి ప్రత్యేక గుర్తింపు దక్కుతుంది. భాషకు పరమ ప్రయోజనం మనుషుల మధ్య భావ ప్రసరణకు ప్రధాన వాహికగా ఉపయోగపడటమే. భాష మనుషుల హృదయ స్పందనను, బుద్ధి వైభవాన్ని వెల్లడిస్తుంది. మానవుల మధ్య సామాజిక బాంధవ్యాన్ని నెలకొల్పుతుంది. ప్రజాస్వామ్యం ఉనికికి ఆయువుపట్టు భాష. భాష కారణంగానే జనజీవనం సుసంపన్నంగా మారుతుంది.

సంస్కృతీ దర్పణం

ఒక జాతి సంస్కృతి రూపుదిద్దుకోవడంలో జాతికి ముఖం వంటి మాతృభాష ప్రధాన భూమిక పోషిస్తుంది. భాషకు అంతరంగంలా సంస్కృతి, సంస్కృతికి వెన్నెముకలా భాష ఏర్పడతాయి. ఒక జాతికి దాని భాషా సంస్కృతులకు విడదీయరాని సంబంధం ఏర్పడుతుంది. మన మాతృభాష స్థాయిని ఎంత పెంచుకుంటే మన సంస్కృతి అంత ఉచ్ఛస్థితిలో ఉంటుంది. ఈ రెండింటివల్లా సమాజం మరింత అభివృద్ధి సాధించగలుగుతుంది. ఈ విషయంలో తెలుగువారు ఇతర భాషా సమాజాల కన్నా వెనకబడి ఉన్నారనడం అహేతుకమేమీ కాదు. పొరుగున తమిళ, కన్నడ, మలయాళ, ఒడియా భాషీయులకన్నా మాతృభాషను అక్కున చేర్చుకోవడంలో తెలుగువారిది అలసత్వ ధోరణి. 'నేను తెలుగువాడిని' అని చెప్పుకోవడానికి తగిన వాతావరణాన్ని కల్పించుకోలేకపోయాం. ఈ తరంలో తెలుగు భాష వాడకం తగ్గిపోవడం కలవరపరుస్తోంది. కొంత కాలంగా భాషోద్యమాలు ప్రారంభమయ్యాయి. 'తెలుగు తక్కువస్థాయి భాష... ఒకప్పుడు సంస్కృతం, తరవాత ఆంగ్లం గొప్ప భాషలు' అనే అభిప్రాయం విద్యావంతుల్లో చోటుచేసుకుంది. సంస్కృత పదాల వాడకం పెరిగి అసలైన తెలుగు పదాలను మరచిపోతున్నాం. పండితులు చాలామంది ఇప్పటికీ సంస్కృతాన్నే ఆదరిస్తుండగా, ఆధునిక విద్యాధికులు ఆంగ్ల వ్యామోహంలో ఉన్నారు. తెలుగు పదాలను చదువు లేని గ్రామీణ ప్రజలే నేటికీ వాడుతున్నారు.

నేడు తెలుగు భాషాదినోత్సవం

మనం తెలుగు నుడికారాన్ని మరచిపోతున్నాం. తెలుగు సంస్కృత భాషాజన్యమని కొందరు పండితులు భావిస్తే, తెలుగు మూల ద్రావిడ భాషలోంచి పుట్టిందని పాశ్చాత్య భాషావేత్తలు, భారతీయ భాషా శాస్త్రజ్ఞులు ప్రతిపాదించారు. తెలుగు ద్రావిడ భాష అనే వాదనే ప్రబలంగా ప్రాచుర్యంలో ఉంది. మారేపల్లి రామచంద్రశాస్త్రి 90 ఏళ్ల క్రితం 'తెలుగు స్వతంత్ర భాష' అని ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ద్రావిడ భాష తెలుగుకు తల్లి కాదని, తోబుట్టువని అన్నారు. ఆయన ఎన్నో అచ్చ తెలుగు పదాలను సృష్టించారు. 'నుడిదండ' పుస్తకం రాశారు. 'తెలుగు నుడికడలి' తయారు చేయడానికి నాలుగు దశాబ్దాలు శ్రమించారు. అందులో చాలా భాగం పాడైపోవడం తెలుగు జాతి దురదృష్టం. ఆదిభట్ల నారాయణదాసు 'వెన్నుని వేయి పేరుల వినుకలి' పేరుతో విష్ణు సహస్రనామాలను తెలుగు చేశారు. 'తల్లి-విన్కి' పేరుతో లలితా సహస్రనామాలను పద్య, గద్యాత్మకంగా తెలుగులో రాశారు. శ్రామికజనుల నిత్య వ్యవహారంలో ఆయా వృత్తులకు సంబంధించిన పారిభాషిక పదాలు లభిస్తాయి. గతంలో వృత్తి పదకోశాలు వెలువడకపోలేదు. ప్రజల భాషను, వివిధ వృత్తులవారి పదజాలాన్ని నిఘంటువుల్లో చేర్చాలి. వాటికి ప్రామాణికత కల్పించాలి. మాండలికాలను, యాసలను 'గ్రామ్యం'గా భావించడం తగదు. 'తెనుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది' అని చెళ్ళపిళ్ళవారు భావించారు. తెలుగు భాషకు సమగ్ర నిఘంటువు రావలసి ఉంది.

ప్రపంచంలో నాగరికత, విజ్ఞానం పెరుగుతున్నప్పుడు ప్రజల అవసరాల మేరకు కొత్త వస్తుసామగ్రి వాడకంలోకి వస్తుంది. ఇతర దేశాల సాంకేతిక పరిజ్ఞానం మనకు అందుతుంది. ఆ వస్తు సముదాయాన్ని వ్యక్తీకరించే పదజాలం మన భాషలో లేకపోవచ్చు. దాన్ని రూపొందించుకోవాలి. అంతవరకు ప్రసిద్ధంగా ఉండే అన్యదేశ్యాలను ఉపయోగించుకోవడం తప్పు కాదు. తెలుగుభాషను సాంకేతికంగా వైజ్ఞానికంగా తీర్చిదిద్దాలి. సంగీత, సాహిత్య, నాట్యాది కళా ప్రక్రియల వైభవానికి ఆలంబనగా నిలిచిన భాష... ఆధునిక భావజాల వ్యక్తీకరణకు పనికిరాదనే వాదన సరికాదు.

అభినవ వాగనుశాసనుడు

'దేశానికి స్వాతంత్ర్యం ఎటువంటిదో, ప్రజలకు భాషా స్వాతంత్ర్యం అటువంటిదే. స్వాతంత్ర్యాన్ని నిరుపయోగమో, దురుపయోగమో చేయకూడదు కదా...' అన్నారు గిడుగు రామమూర్తి. ఆయన తెలుగులో తొలి భాషా శాస్త్రజ్ఞుడు. వ్యావహారిక భాషోద్యమంతో ప్రజల భాషకు పట్టం కట్టడానికి జీవితాంతం కృషి చేశారు. తెలుగు వాడుకభాషకు గౌరవం కల్పించడమే గిడుగు ఏకైక లక్ష్యం. 'దేశ క్షేమానికి భాషా క్షేమం పునాది' అని ఆయన భావించారు. ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకొంటున్నాం. తెలుగు భాషను రక్షించుకోవడం తెలుగు వారి ఆత్మగౌరవ సమస్య. ఈ విషయంలో సామాజిక చైతన్యం పెరగాలి. తల్లిభాషలో విద్య నేర్చుకునే విద్యార్థిలో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ, నేర్చుకునే గుణం, చదివే తత్వం పెరుగుతాయనే వాస్తవాన్ని అందరూ గుర్తించేలా చేయాలి. తల్లి భాషను కాపాడుకోవడమంటే తల్లిని గౌరవించడమే. జాతి సంపదను సంరక్షించుకోవడమే!

– డి.భారతీదేవి

ధ్యాన ముద్ర

అందరికీ ధ్యానం చేయాలని ఉంటుంది. అది అందరికీ సాధ్యంకాదు. మరి చేసేవారి ప్రత్యేకత ఏమిటి? లేదా వారు సాధించిన ప్రత్యేకత ఏమిటి, మిగిలినవారి లోపమేమిటి? ఏమీ లేదు. ఆ ధ్యాన పద్ధతిని సరిగ్గా అవగాహన చేసుకోకపోవడమే. దానిమీద తగినంత, ఉండవలసినంత శ్రద్ధ లేకపోవడమే. ఫలితం వచ్చేవరకు సంయమనం చూపకపోవడమే. ఫలితం కోసం తొందరపడటమే.

ధ్యానం మనసుకు సంబంధించినది. మనసులోని ఏకాగ్రతకు

కోటి చీరలు.. వంద డిజైన్లు

- వచ్చే నెల 20 నుంచి బతుకమ్మ చీరల పంపిణీ
- ఇప్పటికే జిల్లాలకు చేరిన 50 లక్షలు

ఈనాడు - హైదరాబాద్

సిద్ధమవుతున్న బతుకమ్మ చీరలు

ఇదీ బతుకమ్మ చీరల లెక్క..	
సంవత్సరం	చీరలు
2017	95.48 లక్షలు
2018	99.02 లక్షలు
2019	1.02 కోట్లు

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 1.02 కోట్ల మంది మహిళలకు ఉచితంగా చీరలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల 20 నుంచి పంపిణీ ప్రారంభం కానుంది. పూలపండుగ సెప్టెంబరు 28న ప్రారంభమవుతుండగా.. అంతకంటే ఒకరోజు ముందే పంపిణీని పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. బతుకమ్మ సందర్భంగా 18 ఏళ్లు దాటిన పేద మహిళలకు ప్రభుత్వం గత మూడేళ్లుగా చీరలను పంపిణీ చేస్తోంది. గత ఏడాది కంటే ఈ సారి అదనంగా ఉత్పత్తి చేసి అందజేయనున్నారు. రూ.313 కోట్లతో చీరలను సిరిసిల్లలో నేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉత్పత్తి అయిన వాటిల్లో 50 లక్షల చీరలను జిల్లాలకు పంపించారు. మిగతావి నెలాఖరుకు పూర్తవుతాయి. జిల్లాలకు చేరిన వాటిని జిల్లా కేంద్రాల్లోని గోదాముల్లో నిల్వచేస్తున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు చేరుతాయి. కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రామస్థాయిలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా పంపిణీ జరుగుతుంది. పట్టణాలు, నగరాల్లో పుర, నగర పాలక సంస్థల పరిధిలోని మహిళా సంఘాల ద్వారా వీటిని అందజేస్తారు.

ఇటీవల తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించారు. చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు.

ఒక్కో చీర రూ.280!

బతుకమ్మ చీరలను ఈ సారి మరింత నాణ్యత, నవ్యతతో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వంద డిజైన్లలో వీటిని తయారు చేయించారు. ఒక్కో చీరకు సగటున రూ.280 వ్యయమైంది. పంపిణీ సందర్భంగా వృధా, మిగులు లేకుండా ప్రతి చీరను విధిగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

అందగాడు.. అందుతున్నాడు

- చంద్రయాన్-2లో మరో దశ విజయవంతం
- చంద్రుడికి మరింత చేరువకు ఉపగ్రహం

ఈనాడు డిజిటల్, బెంగళూరు: చంద్రుడిపై అడుగుపెట్టే క్రమంలో చంద్రయాన్-2 మరో దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. కక్ష్య తగ్గింపు దిశగా ఇప్పటికే రెండు ప్రక్రియలను దాటిన చంద్రయాన్-2 బుధవారం మూడో ప్రక్రియను సజావుగా ముగించింది. బుధవారం ఉదయం 9.04 గంటలకు ప్రారంభమైన మూడో ప్రక్రియ 1,190 సెకన్ల పాటు కొనసాగింది. బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కంట్రోల్ నుంచి ఇస్రో యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియ ద్వారా చంద్రుడి ఉపతరిలం నుంచి చంద్రయాన్-2 దూరాన్ని 179 కి.మీ x 1,412 కి.మీల పరిధికి చేర్చారు. కొత్త కక్ష్యను నిర్దేశించే క్రమంలో చంద్రయాన్-2 ఉపగ్రహం సమర్థమంతమైన సాంకేతిక గమనాన్ని ప్రదర్శిస్తోందని ఇస్రో ప్రకటించింది. ఉపగ్రహానికి చెందిన అన్ని పరికరాలు నిర్దేశిత స్థితిలోనే పనిచేస్తున్నాయని పేర్కొంది. కక్ష్య తగ్గింపులో తదుపరి ప్రక్రియ ఈనెల 30న సాయంత్రం ఆరు నుంచి- ఏడు గంటల మధ్య పూర్తి కానుందని ఇస్రో అంచనా. ఈనెల 20న చంద్రుడి కక్ష్యలో 114కి.మీ x 18,072 కి.మీ. దూరంలో అడుగుపెట్టిన చంద్రయాన్-2 ఆ మరుసటి రోజు రెండో దశలో భాగంగా 118కి.మీ x 4,412 కి.మీ. కక్ష్యను చేరుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబరు 1న చివరి ప్రక్రియలో భాగంగా ఇది 100 కి.మీ x 100కి.మీ కక్ష్యను చేరుకుంటుంది.

సింగరేణి కార్మికులకు చేయూతనివ్వండి

కేంద్ర సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు మాజీ ఎంపీ వివేక్ బృందం వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో సింగరేణి కార్మికులకు చేయూతనివ్వాలని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్‌ఠాకూర్‌కు భాజపా నేత, మాజీ ఎంపీ వివేక్ బృందం విజ్ఞప్తి చేసింది. బుధవారం దిల్లీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ రామచందర్‌రావు, పార్టీ రాష్ట్ర సమన్వయకర్త నూనె బాల్‌రాజ్ తదితరులు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, రైల్వేమంత్రి పీయూష్ గోయెల్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌లతో భేటీ అయ్యారు. పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమస్యలతో పాటు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై ఠాకూర్‌తో చర్చించారు. తెలంగాణలో పలు ప్రాంతాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలపై పీయూష్ గోయెల్‌తో చర్చించారు. మంచిర్యాలలో ఏపీ, కేరళ సహా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరారు. తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 23 నుంచి 42కు పెంచాలని రవిశంకర్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం హైకోర్టులో 13 మందే న్యాయమూర్తులు ఉన్నారని, పెండింగ్ కేసులు వేలాదిగా పేరుకుపోయాయని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను ఎమ్మెల్సీ రామచందర్‌రావు కేంద్రమంత్రులకు వివరించారు. అనంతరం మాజీ ఎంపీ వివేక్ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై పలు ఆరోపణలు చేశారు. కాళేశ్వరాన్ని కమీషన్ల ప్రాజెక్టుగా మార్చారని విమర్శించారు.

శతాబ్ది, డబుల్‌డెక్కర్ రైళ్లలో ఇక టికెట్ల ధరపై రాయితీ

ఈనాడు, హైదరాబాద్: కూర్చుని ప్రయాణించే ఏసీ ఛైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ల ధరలపై రాయితీలు సెప్టెంబరు నెలాఖరు నుంచి అమల్లోకి వస్తాయని దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఈ రాయితీ పథకాన్ని ఎంపిక చేసిన శతాబ్ది, ఏసీ డబుల్‌డెక్కర్, ఇంటర్‌సిటీ, గతిమాన్, తేజస్ రైళ్లల్లో అమలుచేస్తామని పేర్కొంది. సీట్లు ఎక్కువగా ఖాళీ ఉండే చోట్ల ఇది వర్తిస్తుందని, వాటి భర్తీ నిష్పత్తిని పరిశీలించి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని రైల్వేబోర్డు కమర్షియల్ విభాగం నుంచి అన్ని రైల్వే జోన్లకు తాజాగా మార్గదర్శకాలు అందాయి.

విద్యార్థులే అక్షరాస్యత సాధకులు

- వారితో కుటుంబ సభ్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు విద్యాశాఖ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అక్షరాస్యత పెంపే లక్ష్యంగా విద్యాశాఖ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. విద్యార్థులే తమ కుటుంబ సభ్యులకు, అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలకు చదువు చెప్పి అక్షరాస్యులను చేసే దిశగా విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించినా అక్షరాస్యతలో వెనకబడింది. దానివల్ల మానవ అభివృద్ధి సూచికలోనూ వెనకబడి ఉంటుంది. పాఠశాలల్లో బడిఈడు పిల్లల నమోదు వంద శాతం ఉంటున్నా వయోజనుల్లో నిరక్షరాస్యుల వల్ల అక్షరాస్యత శాతం జాతీయ సగటు కంటే బాగా తక్కువ ఉంది. అక్షరాస్యతలో జాతీయ సగటు శాతం 73 ఉండగా రాష్ట్రంలో అది 66.54 శాతంగా ఉంది. ప్రధానంగా 50 సంవత్సరాల వయసు పైబడిన సుమారు 40 లక్షల మందిని అక్షరాస్యులను చేయకుంటే అక్షరాస్యతలో ముందుకు వెళ్లలేమని విద్యాశాఖ కార్యదర్శి భావిస్తున్నారు. అందుకే రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఒక్కో నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా చేస్తేనే రాష్ట్రం అక్షరాస్యత శాతంలో ప్రగతి సాధించడానికి వీలవుతుందన్నది ఆయన ఆలోచన. ఈ క్రమంలోనే విద్యార్థులతో వారి కుటుంబసభ్యులను అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

కొత్త సచివాలయం కొలువుదీరాల్సిందే!

- మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వ సాంకేతిక కమిటీ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు కొత్త సచివాలయాన్ని నిర్మించాలని ప్రభుత్వ సాంకేతిక కమిటీ మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించింది. భవనాలు శిథిలం కావడంతోపాటు మంత్రులు, అధికారులు, సిబ్బంది అవసరాలకు అనుగుణంగా లేవని, పార్కింగు ప్రధాన సమస్యగా ఉందని వెల్లడించింది. కొత్త సచివాలయ నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఉన్న దాంట్లో స్థితిగతుల పరిశీలనకు రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి కన్వీనర్‌గా మరో ముగ్గురు ఈఎన్‌సీలు రవీందర్, మురళీధర్, సత్యనారాయణలతో ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ పలు దఫాలు సచివాలయాన్ని సందర్శించి నిర్మాణాలను పరిశీలించి నివేదికను రూపొందించింది. సచివాలయంపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సభ్యుడు, మరో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లను సాంకేతిక కమిటీ బుధవారం కలిసి ఈ నివేదికను అందజేసింది. నివేదికను పరిశీలించి తగు సిఫార్సులతో ముఖ్యమంత్రికి అందజేస్తామని మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు.

మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లకు నివేదికను అందజేస్తున్న రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, మురళీధర్, సత్యనారాయణ, రవీందర్

అన్నీ సమస్యలే..

"సచివాలయంలో డి-బ్లాక్ 16 ఏళ్ల క్రితం, హెచ్-బ్లాక్ పదేళ్ల క్రితం నిర్మించినవి. మిగతా అయిదు బ్లాకులు దశాబ్దాలకు పూర్వానివి. పాత భవనాలు పటిష్ఠంగా లేవు. అన్నీ సమస్యలే నెలకొన్నాయి. మొత్తం 29 శాఖలు, 2000 మంది వరకు సిబ్బంది ఉండగా.. అందుకు అనుగుణంగా వసతులు లేవు. అగ్నిమాపక శకటాలు స్వేచ్ఛగా తిరిగే వీలు లేదు. భద్రతాప్రమాణాలకు అనుగుణంగా భవనాలు లేవు. అనేక బ్లాకుల్లో ఎలుకల బెడద ఉంది. కొన్ని గదులు వర్షానికి ఉరుస్తున్నాయి. నీటిసరఫరా, మురుగు నీటి వ్యవస్థ సరిగా లేదు. సమావేశాలకు సరైన వేదికలు లేవు. క్యాంటీన్ బాగా లేదు. సందర్శకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇబ్బందుల దృష్ట్యా కొత్త సచివాలయం నిర్మించాలి" అని సాంకేతిక కమిటీ నివేదించింది. సాంకేతిక అంశాలను సైతం కమిటీ పేర్కొంది.

213 వైద్య పోస్టుల భర్తీ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 213 వైద్య(సహాయ ఆచార్యులు) పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. సోమ, మంగళవారాల్లో రెండ్రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వైద్య విద్య సంచాలకులు నియామకాలు చేపట్టి, బుధవారం పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో ఇప్పటికే పని చేస్తున్న స్పెషలిస్టు వైద్యుల్లో 143 మందిని వైద్య విద్య సంచాలకుల పరిధిలోకి సహాయ ఆచార్యుల హోదాలో స్వీకరించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టిన నియామక ప్రక్రియలో ఎంపికైన మరో 70 మంది అభ్యర్థులకు కూడా పోస్టింగ్‌లిచ్చారు. వీరిలో అబ్‌స్ట్రీషియన్ అండ్ గైనకాలజిస్టులు 28 మంది, ఆర్థోపెడిక్స్ 17 మంది, జనరల్ సర్జరీ వైద్యులు 33 మంది, జనరల్ మెడిసిన్ 22 మంది, పీడియాట్రిక్స్ 38 మంది, రేడియాలజిస్ట్‌లు 14 మంది చొప్పున ఉండగా.. టీబీ, కార్డియాలజీ, సైకియాట్రీ, డీపీఎమ్, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, ఈఎన్‌టీ, అనస్థీషియా, ఆప్తల్మాలజీ తదితర విభాగాలకు చెందిన సహాయ ఆచార్యులను నియమించారు. వీరందరినీ రాష్ట్రంలోని వేర్వేరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ఖాళీల్లో భర్తీ చేస్తూ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి బుధవారం ఆదేశాలిచ్చారు.

అబ్బే.. క్యూనెట్‌తో లావాదేవీల్లేవ్!

సంస్థ తరఫున మేం ప్రచారం చేయలేదు • సైబరాబాద్ పోలీసులకు పలువురు ప్రముఖుల వివరణ

ఈనాడు, హైదరాబాద్: గొలుసుకట్టు వ్యాపారంతో వివాదాలు మూటగట్టుకున్న 'క్యూనెట్' సంస్థతో ఆర్థిక లావాదేవీలు లేవని.. సంస్థ తరఫున తాము ఎలాంటి ప్రచారం చేయలేదని పలువురు ప్రముఖులు సైబరాబాద్ పోలీసులకు తాజాగా వివరణ ఇచ్చారు. సంస్థకు ప్రాచుర్యం కల్పించేలా ప్రముఖుల ప్రచారం సాగిందనే ఆరోపణల నేపథ్యంలో సినీతారలు షారూఖ్ ఖాన్, అనిల్‌కపూర్, బొమన్ ఇరానీ, వివేక్ ఒబెరాయ్, జాకీ ష్రాఫ్, అల్లు శిరీష్, పూజాహెగ్డే, క్రికెటర్ యువరాజ్ సింగ్ తదితరులకు తాఖీదులు పంపించారు. తొలిసారి ఇచ్చిన వాటికి ఎవరూ స్పందించలేదు. రెండో విడత తాఖీదులకు మాత్రం షారుఖ్, అనిల్‌కపూర్, బొమన్‌ఇరానీ తమ న్యాయవాదుల ద్వారా వివరణల్ని పంపించగా, సైబరాబాద్ ఆర్థిక నేరవిభాగం పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు.

ఎవరేం వివరణ ఇచ్చారంటే..

❑ **షారుఖ్ ఖాన్** : ఓ మొబైల్ కంపెనీ చేపట్టిన ధార్మిక కార్యక్రమానికి మాత్రమే హాజరయ్యాను. విరాళాల సేకరణ అని చెప్పడంతో వెళ్లాను. ఆ సంస్థకు క్యూనెట్ స్పాన్సర్‌గా ఉన్న విషయం నాకు తెలియదు.

❑ **అనిల్‌కపూర్** : ముంబయి కేంద్రంగా నడిచే ఓ క్యాన్సర్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు దుబాయిలో జరిగిన కార్యక్రమానికి వెళ్లా. అది ధార్మిక కార్యక్రమం అనే ఉద్దేశంతోనే వెళ్లాను తప్ప క్యూనెట్‌తో ఎలాంటి సంబంధం లేదు.(అనిల్‌కపూర్ వివరణ నేపథ్యంలో క్యాన్సర్ అసోసియేషన్‌కు సైబరాబాద్ ఆర్థిక నేరవిభాగం పోలీసులు నోటీసు పంపించారు. ఆ సంస్థ ఇచ్చే వివరణ ఆధారంగా దర్యాప్తులో ముందుకెళ్లే యోచనతో ఉన్నారు)

❑ **బొమన్ ఇరానీ** : ఇంతకు ముందు క్వెస్ట్‌నెట్ సంస్థ ముంబయిలో నిర్వహించిన కొన్ని మోటివేషనల్ తరగతులకు హాజరయ్యాను. ఇప్పుడు ఆ సంస్థలో ప్రమోటర్‌గా లేను. ఆ సంస్థతో నాకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. (ఇందులో స్పష్టత లేదనే కారణంతో బొమన్ ఇరానీని మరోసారి వివరణ అడగాలని పోలీసులు యోచిస్తున్నారు)

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ఈపీఎఫ్ ఉద్యోగుల సమ్మెతో స్తంభించిన కార్యకలాపాలు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: భవిష్యనిధి ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఈపీఎఫ్ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి అఖిల భారత ఈపీఎఫ్ ఉద్యోగ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఈపీఎఫ్ ఉద్యోగులు దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా బర్కత్‌పురలోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో ఉద్యోగులు విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. కార్యాలయంలోని 60 సెక్షన్ల ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు హాజరై సంఘీభావం ప్రకటించారు. అఖిల భారత ఈపీఎఫ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి డి.గోపాల్ గౌడ్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి అజీజ్, 'కాగ్' ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాజగోపాల్, పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఈపీఎఫ్ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. సుందర్‌శివరావు, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పి. రాంబాబు, హైదరాబాదు యూనిట్ ఉపాధ్యక్షుడు మనోజ్ జాదవ్ మాట్లాడారు. కేడర్ పునర్‌వ్యవస్థీకరణకు సంబంధించిన నివేదికను కేంద్ర ధర్మకర్తల మండలి ఆమోదించి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అమలు చేయడం లేదని తెలిపారు.

ట్రెసాలో టీజీటీఏ విలీనం

ట్రెసా ప్రధాన కార్యదర్శిగా గౌతంకుమార్ ఎన్నిక

గౌతంకుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: రెవెన్యూ సంఘాల విలీనంలో భాగంగా తెలంగాణ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా)లో తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్(టీజీటీఏ) విలీనమైందని ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి తెలిపారు. టీజీటీఏ అధ్యక్షుడిగా ఉన్న గౌతంకుమార్ ట్రెసా ప్రధాన కార్యదర్శిగా నియమితులైనట్లు చెప్పారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయంలో జరిగిన ట్రెసా, టీజీటీఏ ఈసీ కార్యవర్గ సమావేశంలో ఈ విలీన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం ఏర్పాటు చేసే క్రమంలో రెవెన్యూ ఉద్యోగుల హక్కులకు భంగం కలిగితే పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను కొనసాగించాలని, కొత్త చట్టాలు తీసుకొచ్చినా తాము ఆహ్వానిస్తామన్నారు. కొద్ది రోజుల్లో అన్ని జిల్లాలు పర్యటించి ఉద్యోగులను సంఘటితం చేస్తామని, జిల్లాలకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

సెప్టెంబరు 29న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబరు 29న అంకురార్పణ చేయనున్నట్లు తితిదే తెలిపింది. సెప్టెంబరు మాసంలో విశేష ఉత్సవాలను ప్రకటిస్తూ.. 1న శ్రీవరాహ జయంతి, శ్రీబలరామ జయంతి, 2న వినాయక చవితి, 3న రుషి పంచమి, 10న శ్రీవామన జయంతి, 12న అనంత పద్మనాభవ్రతం, 30న శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, ధ్వజారోహణం జరుగుతుందని వివరించింది.

గిరిజనులపై ఇంకా వివక్షేనా?

- 12 శాతం రిజర్వేషన్‌పై కేంద్రంతో చర్చిస్తా: ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు

జడ్చర్ల గ్రామీణం, రాజాపూర్, న్యూస్‌టుడే: గతంతో పోలిస్తే ఆదివాసులు, గిరిజనుల పరిస్థితి కొంత మెరుగైనట్లు కనిపించినా.. వివక్ష మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉందని జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్ సాయి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం సింగమ్మగూడ తండాలో బృందం పర్యటించింది. గిరిజనులతో ముఖాముఖి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకుంది. తండాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో ఎస్టీ ఉద్యోగులకు ఇప్పటికీ అన్యాయమే జరుగుతోందన్నారు. పదోన్నతులు, బదిలీల్లో ఇది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న తెలంగాణ సీఎం కేసీఆర్ మునుపటి హామీపై కేంద్రప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. గిరిజన తండాల్లో తాగునీరు, రోడ్ల సమస్యలు పరిష్కారం కావాలని; విద్య, వైద్యసేవలు మెరుగుపడాలని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు వివరించారు. సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబల్ నాయక్ పాల్గొన్నారు.

సింగమ్మగూడ తండా సభలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్ సాయి

ఆ ఆడపులి మరణానికి విషప్రయోగమే కారణం!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని చంద్రాపూర్ ప్రాంతంలో ఇటీవల మూడేళ్ల ఆడపులి.. విషప్రయోగం వల్లనే చనిపోయిందని తేలింది. మరణించిన పులికి సమీపంలోనే అడవిపంది కళేబరం కనిపించడంతో, మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు ఆరా తీశారు. అడవి పందుల బెడద నుంచి తప్పించుకునేందుకు ఓ వ్యక్తి విషం కలిపిన ఆహారాన్ని ఎరగా వేశాడని, అది తిని పంది చనిపోయిందని గ్రహించారు. ఆ జంతువును తిన్న కారణంగానే పులి కూడా మరణించినట్లు నిర్ధారించారు.

మున్సిపల్ ఎన్నికల పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ముందు చేపట్టిన ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సెప్టెంబరు 9కి వాయిదా పడింది.

మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు, పక్కన అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అక్కడా ఉంటాం.. ఇక్కడా ఉంటాం

- తెలుగు రాష్ట్రాల్లో తెదేపా అవసరముంది
- తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: 'తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ ఉండటం చారిత్రక అవసరం. తెలుగు జాతికి సంపద సృష్టించే నగరం ఉండాలనే ఉద్దేశంతోనే హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాం. రాష్ట్ర విభజన జరిగాక అదే రీతిలో అమరావతిని అభివృద్ధి చేద్దామనుకున్నా. ఈలోగా ఎన్నికలొచ్చాయ్. జగన్ ఒక్క అవకాశం ఇవ్వాలని కోరితే ప్రజలిచ్చారు. కానీ ఆయన 3 నెలల్లోనే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారు' అని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరులోని తెదేపా ఏపీ రాష్ట్ర కార్యాలయానికి బుధవారం తెలంగాణలోని ఖమ్మం జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. తెలంగాణలోనూ తెదేపాను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ.. 'ఏపీ పనుల్లో పడి నేను మిమ్మల్ని పట్టించుకోకపోయినా మీరు మాత్రం పార్టీకి కట్టుబడి ఉన్నారు. తెలంగాణలో నాయకులు పార్టీని వీడి వెళ్లినా క్యాడర్ ఉంది. అక్కడకు తప్పకుండా వస్తా. తెదేపా శాశ్వతంగా ఉంటుంది. నేను ఏది చేసినా అభివృద్ధి కోసమే చేశా. తెలంగాణలో ఒకప్పుడు 25 ఇంజినీరింగ్ కళాశాలలే ఉండేవి. 250 కళాశాలలకు పెంచడంవల్ల ఎంతో మంది తెలంగాణ బిడ్డలు విదేశాలకు వెళ్లగలిగారు. అప్పట్లో గోపీచంద్ అకాడమీకి 5 ఎకరాలు కేటాయించడంవల్ల పీవీ సింధు, శ్రీకాంత్, సైనా నెహ్వాల్, సాయిప్రణీత్ వంటి ప్రపంచస్థాయి మేటి క్రీడాకారులు తయారయ్యారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించిన సింధు తెలుగు బిడ్డ కావడం మనకు గర్వకారణం' అని పేర్కొన్నారు.

లక్ష్మీ బ్యారేజీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

మహదేవ్‌పూర్, కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ(మేడిగడ్డ) బ్యారేజీ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. లక్ష్మీ బ్యారేజీకి ఎగువ ప్రాంతం నుంచి 1.12 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 25 గేట్లను ఎత్తి అంతే స్థాయిలో నీటిని దిగువకు పంపుతున్నారు. సరస్వతి (అన్నారం)బ్యారేజీకి ఎగువ ప్రాంతం నుంచి మూడు వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా రెండు గేట్లను ఎత్తి 4,500 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. లక్ష్మీ బ్యారేజీ వద్ద 6.1, సరస్వతి బ్యారేజీలో 9.47 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకంపై ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో జూనియర్ కార్యదర్శుల నియామకానికి సంబంధించి, కలెక్టర్లకు అనుమతి ఇస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రతి పంచాయతీకి ఒకరు ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ వీటిల్లో పేర్కొన్నారు. 24 జిల్లాల్లో ఎంపిక కమిటీల వద్ద ఉన్న మెరిట్ లిస్టు ఆధారంగా, ఖాళీగా ఉన్నచోట్ల నియమించుకోవాలన్నారు. కోర్టు వివాదంలో ఉన్న పోస్టులను మినహాయించి, మిగిలిన వాటిని భర్తీ చేయాలని తెలిపారు.

జాతీయ మహాసభలో అభివాదం చేస్తున్న తెలంగాణ పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం నేతలు

పద్మబ్రాహ్మణ పురోహితులకు అవకాశాలు కల్పించాలి

జాతీయ మహాసభలో సంఘం నేతల డిమాండ్

నారాయణగూడ, న్యూస్‌టుడే: పద్మబ్రాహ్మణ పురోహితులకు బ్రాహ్మణులతో సమానంగా అన్ని దేవాలయాల్లో అవకాశాలు కల్పించాలని తెలంగాణ పద్మబ్రాహ్మణ

రాకాసి రాబందు!

శిక్షకుడు పీటర్ వెంజెల్ చేతిపై దర్జాగా వాలిన ఈ రాబందు పేరు మొలీనా. దాని బరువు 15 కిలోలు. రెండు రెక్కలను చాచితే 3.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద వేటాడే పక్షి మొలీనానేనని అంచనా. గతేడాది నవంబరు నుంచి డెన్మార్క్‌లోని బైండ్‌స్లెవ్ గద్దల సంరక్షణ కేంద్రంలో ఈ భారీ రాబందు ఉంటోంది. వెంజెల్ దానికి రోజూ పలు అంశాల్లో శిక్షణనిస్తుంటారు.

చట్ట సభల్లో చర్చ పక్కదారి పట్టకూడదు

శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ప్రజాశ్రేయస్సు మేలు కోసం సాగే చట్ట సభల్లో ఒక్క నిమిషం సమయం.. ఒక పదం వృథా కారాదని శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దిల్లీలో లోక్‌సభ సభాపతి ఓం బిర్లా అధ్యక్షతన బుధవారం నిర్వహించిన శాసన సభాపతులు, మండలి ఛైర్మన్ల సమావేశంలో ఆయన, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు. సమావేశంలో సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. "సభాపతులు, మండలి ఛైర్మన్లతో నిర్వహించే ఇటువంటి సమావేశాలు చట్ట సభల మెరుగైన నిర్వహణకు ఎంతో తోడ్పడతాయి. 130 కోట్ల మంది దేశ ప్రజల అభిప్రాయాలకు పార్లమెంటు, శాసనసభలు ప్రతీకగా నిలుస్తున్నాయి. ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చట్టసభల్లోనే నిర్ణయాత్మక చర్చలు సాగుతాయి. ఈ చర్చలపై దేశ ప్రజలు ఆసక్తి చూపుతారు. అంతటి ప్రాధాన్యమున్న చట్ట సభల సమావేశాల్లో ఒక్క నిమిషం సమయం, ఒక పదం కూడా వృథా కారాదు. తెలంగాణ శాసనసభలో రోజుకు పది ప్రశ్నలతో కూడిన ప్రశ్నోత్తరాల సమయం ఉంది" అని పోచారం శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

రైతుబీమాపై ఇతర రాష్ట్రాల ఆరా

ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ ఆర్.పి. సింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అమలు చేస్తున్న రైతుబీమా పథకం దేశంలో మొదటిదని, దీని గురించి ఇతర రాష్ట్రాలు సైతం తమను సంప్రదిస్తున్నాయని భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) చీఫ్ మేనేజర్ ఆర్.పి.సింగ్ చెప్పారు. ఈ పథకంపై బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి సమీక్ష జరిపారు. దీనికి హాజరైన సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంతో కలసి పనిచేయడం ఎల్ఐసీకి గొప్ప అనుభవమని, ఇదే సహకారాన్ని ఇకముందూ కొనసాగిస్తామన్నారు. ఈ నెల 14 నుంచి రెండో ఏడాది రైతుబీమా అమల్లోకి వచ్చిందని, గతేడాది మరణాలకు సంబంధించిన పరిహారాలన్నీ వెంటనే ఇచ్చేయాలని పార్థసారథి అధికారులకు సూచించారు.

సీబీఐ విచారణకు వెనుకంజ ఎందుకు?

భాజపాకు రేవంత్‌రెడ్డి ప్రశ్న

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు కొనుగోళ్లలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న రాష్ట్ర భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్.. సీబీఐ విచారణ చేయించే విషయంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఒకరి ఉనికి మరొకరు కాపాడే విధంగా తెరాస- భాజపా కొద్ది రోజులుగా విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై ఆరోపణలు చేసుకుంటూ తెర వెనక నాటకాలాడుతున్నాయని మండిపడ్డారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ ప్లాంట్లు భద్రాద్రి, కొత్తగూడెం, యాదాద్రి.. మొత్తం రూ. 32,600 కోట్ల పనులను నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్ సంస్థకు అప్పగించారన్నారు. ఇన్ని వేల కోట్ల పనులకు టెండర్లు పిలవకుండా.. నామినేషన్ పద్ధతిలో ఒకే సంస్థకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాల ఒప్పందాలు, కొనుగోళ్ల వ్యవహారాలపై విచారణ కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర హోంశాఖ, కేంద్ర నిఘా సంస్థలతోపాటు రాష్ట్ర భాజపా శాఖకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ తీరును ఎండగడుతామన్నారు.

బీహెచ్ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను చూపుతున్న టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి

అధికార దాహంతోనే కేటీఆర్ విమర్శలు: పొన్నం

హైదరాబాద్, న్యూస్‌టుడే: అధికార దాహంతోనే తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. తుమ్మిడిహట్టి పర్యటనకు వెళ్లిన తమపై విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తమ డిమాండ్ వల్లే తుమ్మిడిహట్టి వద్ద శిలాఫలకం వేశారంటున్న తెరాస నాయకులు అక్కడ ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ నేతలది కంఠశోష: తెరాస నేతలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు కొంగు బంగారమైన కాళేశ్వరం ప్రాజెక్టును చూసి భరించలేక కాంగ్రెస్ నాయకులు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని, కంఠశోష తప్ప వారు సాధించేదేమీ ఉండదని తెరాస ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోనేరు కోనప్ప, దిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి అన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత కోల్పోయారన్నారు. తమ్మిడిహట్టిపై కూడా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తెరాస పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్థాయి నేతను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకుడు పొన్నం ప్రభాకర్‌కు లేదని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పరుగులు తీయించేందుకు కేసీఆర్ గురువారం అక్కడికి వెళ్తున్నారని, ఆ ప్రాజెక్టు కాళేశ్వరం మాదిరిగా సత్వరమే పూర్తవుతుందని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ ప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా ములుగు ఎమ్మెల్యే, జాతీయ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సీతక్క నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సుస్మితాదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యాజమాన్య సంస్థ)

రిజి.కార్యాలయము : బి అన్నపూర్ణనగర్ పబ్లిక్ సర్వెంట్స్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి ప్లాట్ నెం. 80/A, 81/A గోరంట్ల, గుంటూరు

బెరడు తీసిన యూకలిప్టస్ పల్ప్‌ఉడ్ విక్రయ ప్రకటన

Ref. No. OP/001/EPW/2019-20 తేది : 27-8-2019

ఆం.ప్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ యొక్క (31) యూనిట్ల యూకలిప్టస్ తోటల నుండి ఆశిస్తున్న సుమారు 2.06 లక్షల Mt.ల బెరడు తీసిన యూకలిప్టస్ పల్ప్‌ఉడ్‌ను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ-పోర్టల్ అనగా "https://www.konugolu.ap.gov.in" " Konugolu" పై 13 సెప్టెంబరు, 2019న గం.11.00ల నుండి గం. 13.00ల వరకు (మొదటి విడత) మరియు గం. 14.00ల నుండి గం.16.00ల వరకు (రెండవ విడత) ఈ-టెండరు కం ఈ-వేలం ద్వారా విక్రయించుటకు ప్రతిపాదించబడినది. విక్రయింపబడని / ధృవీకరించబడని మిగిలిన యూనిట్లు 20 సెప్టెంబరు, 2019 మరియు 26 సెప్టెంబరు, 2019న విక్రయింపబడును. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్లు : "https://www.konugolu.ap.gov.in & https://www.apfdcl.com ను దర్శించండి.

DIPR No. 111PP/CL/Advt/1/1/2019-20 సం/-వైస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్

కరెంటు వాడకంలో సరికొత్త రికార్డు

- బుధవారం అత్యధికంగా 10,960 మెగావాట్ల డిమాండ్
- 12 వేల మెగావాట్ల సరఫరాకు సిద్ధమవుతున్న డిస్కంలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ చరిత్రలో రోజూవారీ విద్యుత్ డిమాండ్ అత్యధికంగా బుధవారం నమోదైంది. మధ్యాహ్నం 2.35 గంటలకు 10,960 మెగావాట్లకు చేరుకుంది. ఇంతకుముందు అత్యధిక రికార్డు 2018 సెప్టెంబరు 11న 10,818 మెగావాట్లు ఉండగా దానికన్నా 142 మెగావాట్లు అదనంగా బుధవారం పెరగడం గమనార్హం. వచ్చే నెలాఖరులోగా ఏదో ఒకరోజు 12 వేల మెగావాట్లకు డిమాండ్ చేరుతుందని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు అంచనా వేస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలకు భారీ సామర్థ్యమున్న విద్యుత్ మోటార్లను నడుపుతున్నందున కరెంటు డిమాండ్ ఈనెల 19 నుంచి గణనీయంగా పెరిగి 10 వేల మెగావాట్లను దాటింది. సాధారణంగా రాష్ట్రంలో ఆగస్టులో గతంలో ఎన్నడూ 10 వేల మెగావాట్లకు చేరలేదు. ఈ ఏడాది కాళేశ్వరం మోటార్లకు రోజూ 700 నుంచి 800 మెగావాట్ల దాకా అదనపు వినియోగం ఉంటోందని డిస్కంలు తెలిపాయి. పంటల సాగు అధికంగా ఉన్న ఉత్తర తెలంగాణ ప్రాంతంలో డిమాండ్ ఎక్కువగా ఉంది. వరంగల్ కేంద్రంగా ఉత్తర తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసే ఉత్తర డిస్కం పరిధిలో బుధవారం 4,333 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. సరిగ్గా గతేడాది ఇదేరోజు ఈ డిస్కం పరిధిలో 2,658 మెగావాట్ల డిమాండ్ ఉండగా ఈ ఏడాది అంతకన్నా 63 శాతం పెరిగింది. రాష్ట్రస్థాయిలో ఈ పెరుగుదల 25 శాతమే ఉంది. 2018 ఆగస్టు 28న రాష్ట్ర డిమాండ్ 8,766 మెగావాట్లుంటే ఈ ఏడాది అంతకన్నా 25శాతం పెరిగి 10,960 మెగావాట్లకు చేరింది. గత 4 రోజులుగా రాష్ట్రంలో వర్షాలు తగ్గడం వల్ల బోర్ల నుంచి పంటలకు నీరు పెట్టడం అధికమైంది. ఇళ్లలో సైతం కరెంటు వినియోగం పెరుగుతోంది. మరో 3 రోజులు వర్షాలులేనందున డిమాండ్ ఇంకా పెరగవచ్చని అంచనా.

అందుబాటులో 11,500 మెగావాట్లు

ప్రస్తుతం 11,500 మెగావాట్ల వరకు విద్యుత్ అందుబాటులో ఉంది. ఇప్పుడున్న వినియోగం తీరును చూస్తే 12 వేల మెగావాట్లకు చేరే అవకాశమున్నందున డిస్కంలు అప్రమత్తమయ్యాయి. తాత్కాలిక ఒప్పందంతో 500 మెగావాట్లను వెంటనే కొనాలని ట్రాన్స్‌కో బుధవారం నిర్ణయించింది. డిమాండ్ ఎంత పెరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014 జూన్ 2న 7,775 మెగావాట్ల వినియోగముంటే ఇప్పుడు 11 వేల మెగావాట్లకు చేరిందని వివరించారు. విద్యుత్ వినియోగం పెరుగుదల రాష్ట్ర ప్రగతికి నిదర్శనమని చెప్పారు.

ఈ నెలలో విద్యుత్ డిమాండ్ పెరిగిన తీరు (మెగావాట్లు)

తేదీ	డిమాండ్
ఆగస్టు 1	8,463
5	8,542
10	8,900
16	10,180
20	10,326
27	10,617
28	10,960

విద్యుత్ సంస్థల్లో 3,195 కొలువులు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల్లో కిందిస్థాయి ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కంల పరిధిలో 3,195 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి అతి త్వరలో ప్రకటనలు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. న్యాయ వివాదాలు రాకుండా ఉండేందుకు కొన్ని అంశాలపై న్యాయ సలహాలను దక్షిణ డిస్కం అడిగింది. న్యాయ విభాగం నుంచి సమాధానం వచ్చిన తరవాత ప్రకటన జారీచేయనున్నారు. దక్షిణ డిస్కంలో రెండు వేల జూనియర్ లైన్‌మెన్, మరో 500 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉత్తర డిస్కం పరిధిలో 695 జూనియర్ అసిస్టెంటు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఉత్తర డిస్కం పరిధిలో ఇటీవల 2553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు ప్రకటన ఇచ్చారు. నియామక ప్రక్రియ దాదాపు చివరికి వచ్చింది. త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని ఉత్తర డిస్కం సీఎండీ అన్నమనేని గోపాలరావు 'ఈనాడు'కు చెప్పారు. దక్షిణ డిస్కం పరిధిలో ఖాళీ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎండీ రఘుమారెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత విద్యుత్ సంస్థల్లో పోస్టులను భారీగా ప్రభుత్వం మంజూరు చేసింది. అవసరాన్ని బట్టి వాటిని భర్తీ చేస్తున్నారు. కిందిస్థాయిలో జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నందున సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర విద్యుత్ ఉద్యోగ ఉద్యోగుల 1104 సంఘం నేత సాయిబాబు తెలిపారు. ఈ పోస్టులు భర్తీ సత్వరం భర్తీ చేయాలని సీఎండీలను కోరినట్లు ఆయన చెప్పారు.

ఆశలు చిదిమిన పాఠశాల బస్సు

- బస్సు బోల్తా ఘటనలో ముగ్గురు పిల్లల మృతి

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల; న్యూస్‌టుడే, వేములవాడ: మరో మూడు రోజుల్లో వినాయకచవితి పండక్కి పిల్లలు ఇంటికి వస్తారని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు.. ఇక వారు లేరు అనే పిడుగులాంటి వార్త విని నిలువెల్లా కంపించిపోయారు. కంటికి మంటికి ధారగా విలపిస్తుంటే వారిని ఓదార్చే గుండెలూ విలవిల్లాడాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో బుధవారం పాఠశాల బస్సు బోల్తా ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా.. సిరిసిల్ల ఆసుపత్రిలో మరో విద్యార్థి ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది. వేములవాడ వాగీశ్వరి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు.. పట్టణ శివారులోని చింతల్‌రాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అదే పాఠశాలకు చెందిన వసతి గృహంలో ఉంటున్నారు. మధ్యాహ్న భోజనానికని 28 మంది విద్యార్థులు పాఠశాల మినీ బస్సులో వసతిగృహానికి బయల్దేరారు. పట్టణ శివారులోని నాలుగు వరుసల రహదారికి ఓవైపు ట్రాక్టర్‌లో కొంతమంది యువకులు వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తెస్తున్నారు. విద్యార్థులంతా కిటికీల్లో నుంచి ఆ సందడిని ఆసక్తిగా తిలకిస్తుండగా వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అంతే వేగంతో డివైడర్‌పై కొంతదూరం వెళ్లింది. బస్సు తలుపు దగ్గర ఉన్న రెండో తరగతి చదువుతున్న రుద్రంగి మండలం బడితండాకు చెందిన గుగులోతు దీక్షిత(8), పదో తరగతి చదువుతున్న వేములవాడ గ్రామీణం మండలం వట్టెంలకు చెందిన మణిచందన(15) రహదారిపై పడ్డారు. వారిపై బస్సు పడింది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అత్యవసర ద్వారాన్ని పగులగొట్టుకుని మిగతా విద్యార్థులు బయట పడ్డారు. గాయపడిన రిషి, రాకేష్, సాయినిఖిల్, అజయ్, రోహిత్, రేవంత్‌లను సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. రుద్రంగి మండలం బడితండాకు చెందిన గుగులోతు రిషి (8) తలకు బలమైన గాయమై సిరిసిల్ల ఆసుపత్రిలో మృతి చెందాడు. మిగతా అయిదుగురికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, డీఎస్పీ వెంకటరమణ

అతివేగం... అజాగ్రత్త

బస్సు డ్రైవరు రఫీక్ రహదారి డివైడర్‌ను ఢీకొట్టినా అదే వేగంతో.. అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే పోలీసు బృందంతో ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. రఫీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరీక్షల్లో డ్రైవర్ మద్యం తాగినట్లు చూపించకపోవడంతో లోతైన పరీక్ష నిర్వహించేందుకు అతని రక్త నమూనాలను సేకరించారు. జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు బస్సుకు ఫిట్‌నెస్ లేదని పేర్కొన్నారు. డ్రైవరుతోపాటు 17 మంది ప్రయాణించాల్సిన బస్సులో 28 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారని తెలిపారు.

మంత్రి ఈటల దిగ్భ్రాంతి

కరీంనగర్‌లో ఉన్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

కేటీఆర్ సంతాపం

తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు మంత్రి ఈటలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో సంఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హైకోర్టుకూ కొత్త భవనం!

- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు
- బుద్వేలుకు తరలించరాదంటూ న్యాయవాదుల నిరసన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకూ నూతన భవనం నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయని విశ్వసనీయంగా తెలిసింది. అయితే హైకోర్టును బుద్వేలుకు తరలించే ప్రతిపాదనను న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ హైకోర్టు పరిరక్షణ సమితి పేరుతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బుధవారం రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డికీ వినతిపత్రం అందజేశారు.

ఇదీ నేపథ్యం

ఏపీ హైకోర్టు విభజన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గచ్చిబౌలి లేక బుద్వేలు ప్రాంతాల్లో కొత్త హైకోర్టు నిర్మాణానికి ప్రతిపాదించింది. గతంలో హైకోర్టు అగ్నిప్రమాదానికి గురైనప్పుడూ బుద్వేలులో కొత్త హైకోర్టు భవనాన్ని నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. ప్రభుత్వం కూడా అక్కడ 100 ఎకరాలు కేటాయించింది. హైకోర్టు భవనం ప్రస్తుత అవసరాలకు సరిపోతున్నప్పటికీ భవిష్యత్తు అవసరాలకు నూతన భవనం అవసరమని ఫుల్ కోర్టు సమావేశంలో చర్చ జరిగింది. కంపెనీ లా ట్రైబ్యునల్, అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్, ఇతర ట్రైబ్యునళ్లు పలు ప్రాంతాల్లో ఉండటంతో న్యాయవాదులకు ఇబ్బందిగా ఉంది. అలానే న్యాయమూర్తులు పెరిగితే ఈ భవనం సరిపోదన్న అభిప్రాయం ఉంది. ఇప్పటికే హైకోర్టు పక్కన ఉన్న ప్రసూతి ఆస్పత్రిని తరలించి అక్కడ భవనాలను, మరో కాంప్లెక్స్‌ను నిర్మించాలన్న ప్రతిపాదన ఉందని ఇటీవల ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. ఇక్కడ భవనాలను నిర్మించడం కంటే అత్యాధునిక సదుపాయాలతో అన్ని కోర్టులు ఒకే గొడుగు కింద ఉండేలా కొత్త భవన సముదాయాన్ని నిర్మిస్తే బాగుంటుందని న్యాయమూర్తులు చర్చించారు. ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి కొంత మంది సీనియర్ న్యాయవాదులతో కూడా చర్చించినట్లు సమాచారం. న్యాయవాదులకు సౌకర్యంగా ఉండేలా భవన సముదాయాన్ని నిర్మిస్తే అభ్యంతరం లేదని వారు చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు తదితరాలన్నీ చారిత్రక భవనాల్లో నడుస్తున్నాయి. ఉస్మానియా ఆసుపత్రి మరమ్మతులకు సిద్ధంగా ఉండగా హైకోర్టు కూడా అదే స్థితికి చేరే పరిస్థితి ఉంది. చారిత్రక భవనాలుగా ప్రకటించి పరిరక్షిస్తే తప్ప వాటికి మనుగడ ఉండదన్న అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు కొత్త భవనం ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

హైకోర్టును బుద్వేలుకు తరలించాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నరసింహారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు

తితిదే ధర్మకర్తల మండలి జాబితాలో జూపల్లి రామేశ్వర్‌రావు!

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుల జాబితా దాదాపు ఖరారైంది. పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. ప్రతిపాదనల్లో ఉన్న పేర్లపై చర్చించి తుది జాబితాకు ఆమోదం తెలిపారని సమాచారం. ప్రస్తుతం పాలకమండలి సభ్యుల సంఖ్య 19 ఉండగా.. ఈసంఖ్యను 25కి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం చట్టసవరణ చేస్తూ ఆర్డినెన్స్‌ను తేవాలి. గవర్నర్ వద్దకు పంపేందుకు దస్త్రం సిద్ధం చేస్తున్నట్లు వైకాపా వర్గాలు తెలిపాయి. గవర్నర్ ఆమోద ముద్ర వేయగానే సభ్యుల పేర్లు వెల్లడించనున్నారు. తమిళనాడు నుంచి ఇండియా సిమెంట్స్ ఎండీ ఎన్.శ్రీనివాసన్, కృష్ణమూర్తి, కర్ణాటక నుంచి కృపేందర్ రెడ్డి, సుందర్, తెలంగాణ నుంచి ముగ్గురుండనున్నారు. పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వర్‌రావు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇక ఏపీ నుంచి ఎమ్మెల్యేల్లో యూవీ రమణమూర్తి రాజు (కన్నబాబు), ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పదవిరీత్యా తితిదే పాలకమండలిలో సభ్యుడుగా ఉండనున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి పేరు కూడా సభ్యుల జాబితాలో ఉండొచ్చన్న ప్రచారం ఉన్నా, గతంలో ఛైర్మన్‌గా చేసి, సభ్యుడిగా కొనసాగేందుకు భూమన సుముఖత వ్యక్తం చేయడం లేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

గంజాయి విక్రయ కేంద్రాలపై పోలీసుల దాడులు

- 'ఈనాడు-ఈటీవీ' కథనానికి స్పందన

ఈనాడు, హైదరాబాద్; న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్, గోల్కొండ: హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయ కేంద్రాలపై పోలీస్ అధికారులు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాడులు నిర్వహించారు. బుధవారం 'ఈనాడు'లో 'రాజధానిలో గంజాయ్' శీర్షికన ప్రచురితమైన కథనంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.అంజనీకుమార్ స్పందించారు. గంజాయి విక్రేతల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వెంటనే అరెస్ట్ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగరం, శివారు ప్రాంతాల్లో గంజాయి పొట్లాలు విక్రయిస్తున్న వ్యాపారులు, సరఫరాదారులను లక్ష్యంగా చేసుకుని గోల్కొండ, ఆసిఫ్‌నగర్, హుమాయూన్‌నగర్, మంగళ్‌హాట్, కుల్సుంపుర, హబీబ్‌నగర్ పోలీస్ ఠాణాల పరిధుల్లోని గంజాయి విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. పోలీసులు వస్తున్న సమాచారం తెలుసుకున్న కొందరు విక్రేతలు పారిపోయారు. గోల్కొండలోని అలిజాపూర్‌లో ఆసిఫ్‌నగర్ ఏసీపీ నంద్యాల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గోల్కొండ ఠాణా అధికారులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు.

నలుగురిపై పీడీ చట్టం...

ఆసిఫ్‌నగర్ ఠాణా పరిధిలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడి ప్రస్తుతం జైల్లో ఉన్న నలుగురు నిందితులు దిబ్బ లక్ష్మయ్య, నక్కా శ్రీను, దినేష్ సింగ్, రాజుసింగ్‌లపై పోలీసులు పీడీ చట్టం ప్రయోగించారు. ప్రస్తుతం వీరు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కమలం కన్ను!

- సంప్రదింపులు జరుపుతున్న భాజపా నేతలు

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి కొందరు కీలక నేతల్ని చేర్చుకున్న కమలదళం ఇక ఆ పార్టీ శాసనసభ్యులపై దృష్టి సారించింది. తెలంగాణ శాసనసభలో భాజపాకు ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఈ సంఖ్యను పెంచుకోవడం ద్వారా అసెంబ్లీలో బలపడేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఇప్పటికే తనవైపునకు తిప్పుకుంది. పార్టీ మారితే అనర్హత వేటు పడటం, ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కమలదళంలో చేరిక విషయంలో రాజగోపాల్‌రెడ్డితోపాటు భాజపా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. తెరాసలో చేరిన ఎమ్మ



మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512 ■ makarandam@eenadu.in

మకరందం

ఆయన వదనం ఓంకారం...
ఆయన మాట శ్రీకారం...
ఆయన పూర్ణసృష్టికి సంకేతం.
అతి గొప్ప ఆధ్యాత్మికతత్త్వం ఆయనదేనంటూ శాస్త్రాలు,
ఉపనిషత్తులు వివరిస్తున్నాయి.
యోగ గణపతిగా ఆయన ప్రాధాన్యాన్ని
యాజ్ఞవల్క్యస్మృతి చెబుతోంది.

మహా గణపతి

ఘన యోగపతి

'త్వం మూలాధారే స్థితోస్మి నిత్యమ్...
త్వం యోగినో ధ్యాయంతి నిత్యమ్'.

మానవ శరీరంలోని మూలాధార స్థానంలో ఉండే దైవానివి నీవే... యోగులందరూ ఎప్పుడూ నిన్నే ధ్యానిస్తూ ఉంటారని గణపతి అథర్వశీర్షం చెబుతోంది. యోగశాస్త్రంలో వినాయకుడిని మూలాధారచక్రానికి అధిష్ఠాన దేవతగా భావిస్తారు. మూలాధారం వద్ద సుషుమ్న నాడి మూడు చుట్టలు చుట్టుకుని, పైన పడగ కప్పుకొని ఉన్న పాములా ఉంటుందని పతంజలి వెల్లడించారు. యోగి తన సాధన ద్వారా సుషుమ్నను మేల్కొలుపుతాడు. దీంతో మిగిలిన అయిదు చక్రాలూ ఉత్తేజితం అవుతాయి. ఈ క్రియవల్ల హంసలా మనిషిలో సంచరించే ప్రాణవాయువు సహస్రార కమలాన్ని చేరుకుంటుంది. అప్పుడు ఆత్మ పరమాత్మ ఏకమవుతాయి. ఈ యోగప్రక్రియ మొత్తానికి సూత్రం మూలాధారం. ఆ చక్రానికి అధిష్ఠానదేవత గణపతి.

మన శరీరంలో సుషుమ్నతో పాటు ఇడ, పింగళ అనే నాడులు ఉంటాయి. వీటిలో 'ఇడ' బుద్ధికి, 'పింగళ' సిద్ధికి సంకేతాలు. సుషుమ్న ఎప్పుడూ ఇడ, పింగళతో కలిసే ఉంటుంది. అంటే, మూలాధార అధిపతి అయిన గణపతి సిద్ధి, బుద్ధితో కలిసి ఉంటాడన్నమాట. గణపతికి సిద్ధి, బుద్ధి భార్యలు అనడంలో అంతరార్థం కూడా ఇదే. మనలో ఉన్న దురాలోచనలు తొలగితే మంచి బుద్ధి కలుగుతుంది. ఎప్పుడైతే మంచి బుద్ధి కలుగుతుందో అప్పుడు మనసు శాశ్వతమైన ముక్తిస్థానాన్ని కోరుకుంటుంది. గణపతి ఆరాధన ద్వారా మంచి బుద్ధి వస్తుంది. మోక్షం వైపు మనిషి సాధన జరుగుతుంది. గణపతి ఉపాసనలోని అంతరార్థం, ఆయన తత్త్వం ఇదే. యోగశాస్త్రం ప్రకారం మానవశరీరంలోని మూలాధారంలో త్రికోణ యంత్రం ఉంటుంది. దానికి అధిపతి గణపతి కాబట్టి యంత్ర శాస్త్రంలోనూ ఆయనదే తొలిస్థానం

గజవదనం ఓంకారాన్ని సూచిస్తుంది. 'అ'కారం నుంచి 'క్ష'కారం వరకు ఉన్న అక్షరాలను కంఠం మొదలు చరణాల వరకు వివిధ అంగాలుగా భావించిన మన మహర్షులు 'అక్షర గణపతి'ని ఆవిష్కరించారు. అక్షర స్వరూపమైన గణపతిని ఆరాధించడం అంటే అక్షరాల్ని ఉపాసించటమే అవుతుంది. అక్షరం అంటే నాశనం కానిది అని అర్థం. నాశనం లేనిది జ్ఞానం ఒక్కటే. గణపతి ఉపాసన అంటే జ్ఞానాన్ని ఉపాసించటమే అవుతుంది.

వ్యాసమహర్షి మహాభారతాన్ని రాసే నేర్పు గణపతికే ఉందని భావించాడు. గణపతి కూడా సరేనన్నాడు. అయితే, వ్యాసుడు నేను చెప్పే ప్రతి శ్లోకాన్నీ పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే రాయా'లంటూ నియమం పెట్టాడు. వ్యాసుడు చెబుతూనే ఉన్నాడు. గణపతి రాస్తూనే ఉన్నాడు.. ప్రతి శ్లోకాన్నీ పూర్తిగా అర్థం చేసుకుంటూ. అలా పంచమ వేదమైన మహాభారతం ఆవిర్భవించింది. అద్భుతాలు జరగాలంటే ఏమరుపాటు పనికిరాదు. గొప్ప సన్నద్ధత, దృఢదీక్ష కావాలి. పనులు ప్రారంభించాక వచ్చే ఆటంకాలు చూసి బెదరిపోకూడదు. చివరదాకా పట్టుదలగా నిలవాలి. అప్పుడే విజయం వరిస్తుంది. విద్యార్థులకు ఉండాల్సిన ఈ లక్షణాలన్నిటినీ గణపతి ఆచరణాత్మకంగా అందించాడు.

మట్టితో ప్రాణ ప్రతిష్ఠ

ఆకాశం నుంచి వాయువు, అందులో నుంచి అగ్ని, దాని నుంచి నీరు, నీటి నుంచి భూమి ఏర్పడ్డాయి. జడ పదార్థమైన భూమి, చైతన్యం కలిగిన నీటితో కలిసి ప్రాణశక్తిని పొందుతుంది. ఆహార పదార్థాలు, ఓషధులు అందిస్తుంది. ఇలా ప్రాణ, జడశక్తుల కలయికతో సృష్టి సాగుతుందనడానికి సంకేతంగా గణపతి విగ్రహాన్ని మట్టి, నీరు కలిపి తయారుచేస్తారు. మట్టి గణపతిని పూజించడం, ఆ తర్వాత నిమజ్జనం చేయడం ఉత్తమ ఆచారంగా చెబుతారు.

ఒక్కడే... ఒక్కడే...

గణపతిని త్రిగుణాలకు అతీతుడుగా, త్రికాలాలకు (భూత, భవిష్యత్, వర్తమాన) అందనివాడుగా పంచభూతాలకు ఆత్మగా, సకల దేవతాస్వరూపుడిగా అథర్వణ వేదంలోని గణపతి అథర్వశీర్షం ప్రకటిస్తుంది. త్రిమూర్తులతో సహా పంచభూతాలూ ఆయన స్వరూపమే అంటోందీ స్తోత్రం. 'ఓం నమో వ్రాతపతయే నమో గణపతయే నమః ప్రమథపతయే నమస్తే అస్తు లంబోదరాయ ఏకదంతాయ విఘ్నవినాశినే శివసుతాయ వరదమూర్తయే నమః' ... గణపతి అథర్వ శీర్షంలో అత్యంత ప్రసిద్ధిపొందిన మంత్రపాఠం ఇది. స్తోత్రరూపంగా సాగే ఈ అథర్వశీర్ష పారాయణ వేగంగా ఫలితాలను ఇస్తుందని నమ్ముతారు.

– కప్పగంతు రామకృష్ణ

ఆ గణపతి వేరయా...

'ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమం జ్యేష్ఠరాజం
బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆన సృణ్వన్నూతిభిస్సీదసాదనం'

గణపతిని పూజించే మంత్రాల్లో అత్యంత ప్రసిద్ధిపొందిన మంత్రం ఇది. రుగ్వేదం రెండో మండలంలో ఇది ఉంది. గణపతిని రాజుల్లో పెద్దవాడుగా, దేవతల్లో పూజలందుకునే మొదటివాడుగా, 33 కోట్ల దేవతాగణాలకు అధినాయకుడిగా వర్ణిస్తుంది రుగ్వేదం. గణాలకు నాయకుడిగా గణపతిని చెబుతోందే కానీ గజముఖ స్వరూపం గురించి ఈ వేదంలో కనిపించదు. మొత్తంగా గణపతి సర్వస్వతంత్ర, సర్వవ్యాపక, సర్వశక్తి సమన్వితుడైన దేవుడని సమస్త సాహిత్యం విస్పష్టంగా ప్రకటిస్తోంది. అశ్వమేధయాగంలో ఉపయోగించే ఒక మంత్రం ఉంది.

గణానాం త్వా గణపతిగ్ం హవామహే /
ప్రియానాం త్వా ప్రియపతిగ్ం హవామహే /
నిధినాం త్వా నిధిపతిం హవామహే వసో మమ /
అహమజానీ గర్భధమా త్వమజాసి గర్భధం..'

అంటూ సాగే ఈ మంత్రం హిరణ్యగర్భుడిగా ఉన్న ప్రజాపతిని ఉద్దేశించింది. ఇందులో ఎక్కడా గజముఖుడైన గణపతి ప్రస్తావన లేదు. మైత్రాయణీ సంహితలో 'తత్ కరటాయ విద్మహే హస్తిముఖాయ ధీమహి తన్నో దంతిః ప్రచోదయాత్' అనే మంత్రం ఉంది. ఈ ఒక్కచోటే గజముఖుడి గురించి వేదాల్లో కనిపిస్తుందని పరిశోధకులు వివరిస్తున్నారు.

స్వరూపం ఇచ్చే సందేశం

- **ఏనుగు తల** – జ్ఞానానికి, యోగానికి సంకేతం
- **పెద్ద చెవులు** – ఎక్కువగా వినటం
- **చేతిలోఉన్న పరశువు** – అజ్ఞానాన్ని ఖండించే లక్షణం
- **చేతిలో ఉన్న పాశం** – విఘ్ను నివారణకు ప్రతీక
- **తొండం** – ఓంకారం
- **విరిగిన దంతం** – త్యాగానికి చిహ్నం
- **నాగబంధం** – శక్తికి, కుండలినికి సంకేతం
- **మనిషి శరీరం** – మాయకు, ప్రకృతికి చిహ్నం
- **ఎలుక వాహనం** – అన్ని జీవులపై సమభావనకు చిహ్నం

ధర్మ సందేహం

వినాయకుడి పూజ మహిళలు చేయకూడదంటారు ఎందుకు?
రుక్మిణి, హైదరాబాద్

వినాయక చవితి పూజ మహిళలు చేసుకోవచ్చు. నిషేధం ఎక్కడా లేదు. నిత్యపూజ గానీ, వినాయకచవితి నాటి వ్రతం గానీ.. ఎలాంటి సందేహం లేకుండా మహిళలు ఆచరించవచ్చు. అయితే, కోరికలతో మొక్కుకుని వినాయకునికి చేసే పూజలు (కామ్యకర్మలు) మాత్రం మహిళలకు నిషేధం అన్నారు పెద్దలు. వినాయకుడు బ్రహ్మచారి కావడమే కారణమని చెబుతారు. గణపతి భార్యలుగా చెప్పే సిద్ధి, బుద్ధి కార్యసిద్ధికి, సద్బుద్ధికి సంకేతాలు మాత్రమే.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

జ్ఞానపథం

అలా ఇస్తే...త్యాగం!

ఒకసారి రమణమహర్షి ఆశ్రమానికి ఓ దంపతులు తమ అయిదేళ్ల కుమారుడితో కలిసి వచ్చారు. తాము తెచ్చిన పండ్ల బుట్టను దగ్గర పెట్టుకుని దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలో మహర్షి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుని మెల్లగా మందిరంలోకి అడుగుపెట్టారు. వెంటనే ఆ అయిదేళ్ల పిల్లాడు ఎవరో పురమాయించినట్లు తాము తెచ్చిన బుట్టలోంచి ఒక పండును తీసుకున్నాడు. పరుగెత్తుకెళ్లి రమణుల చేతిలో పెట్టి ఆయన పాదాలకు ప్రణామం చేశాడు. తల్లిదండ్రులతో సహా అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు రమణులు ఆ చిన్నారిని దగ్గరకు తీసుకుని 'చూడండి! ఈ బాలుడు ఎంత సహజంగా, సంతోషంగా ఈ పండును ఇచ్చాడో! స్వచ్ఛందంగా తనకు ఇవ్వాలనే భావన ఈ పసివాడికి ఎక్కడి నుంచి వచ్చింది? ఇదే త్యాగ గుణం. ఈ పసి మనసులో మహర్షి తిరిగి ఏమిస్తాడన్న ఆలోచనే లేదు. తన దగ్గరున్నది ఆయనకు ఇచ్చేయాలనే తాపత్రయం తప్ప. దీన్నే వైరాగ్యం అంటారు. అలాంటి పసి మనసుతో ఉండడమే యోగం. అదే సిసలైన ఆనందం' అన్నారు.

– స్వామి జ్ఞానదానంద



'అయిష్టంగా, ప్రేమ లేకుండా పెట్టిన రొట్టె చేదుగా ఉండడమే కాదు... అది ఆకలిని సగమే తీరుస్తుంది'
- ఖలీల్ జిబ్రాన్

దానధర్మాలంటే పెద్ద విరాళాలివ్వడం కాదు, మనకున్న దాన్ని పంచుకోవడం.

క్రీస్తువాణి

ఓ మంచి మాట..!



ఇద్దరు మనుషుల మధ్యే కాదు, రెండు కుటుంబాల మధ్యే కాదు... రెండు దేశాల మధ్య యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?.

దీనికి సమాధానం 'మన నోట్లోంచి వచ్చే మాట సరైంది కానప్పుడు'. అందుకే ప్రభువు మన నోటి లోపలికి వెళ్లేదానికంటే, బయటకు వచ్చే మాటతోనే జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

దీనిపై క్రీస్తు తన శిష్యుడైన పేతురు ద్వారా ఒక అద్భుత వాక్యాన్ని చెప్పించారు...'జీవితాన్ని ప్రేమించి, మంచి రోజులను చూడగోరేవారు చెడ్డ మాటలు పలకకుండా తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండా తన పెదాలను కాచుకోవాలి' అని. గాయాలు మానడానికి తేనెను పూస్తారు. అలాగే మనసుల మధ్య ఏర్పడే గాయాలకు లేపనంగా మంచి మాటలనే మకరందాన్ని పూయాలి.

-ఎం.సుగుణరావు

ఇస్లాం సందేశం

పిల్లనిచ్చేటప్పుడు...

సయీద్ ముసయ్యిబ్ (రహ్మాలై) రోజూ మదీనా మసీదులో ఖురాన్ పాఠం బోధించేవారు. దానిని వినేందుకు ఎంతోమంది శిష్యులు వచ్చేవారు. వారిలో అబ్దుల్లాహ్ అనే శిష్యుడు ఎంతో ధర్మవర్తనుడు. ఆయన కొద్ది రోజులు పాఠం వినడానికి రాలేదు. ఆ తర్వాత మసీదుకు వచ్చిన అతడిని చూసి గురువుగారు "అబ్దుల్లాహ్! ఇన్ని రోజులు ఏమైపోయావ్?" అని అడిగారు. "ఏం చెప్పమంటారు గురువుగారు! మా ఆవిడ కన్నుమూసింది. ఆ దుఃఖంలో రాలేకపోయాన"ని చెప్పాడు.

ఈ మాటలు విని ముసయ్యిబ్ (రహ్మాలై) కాసేపు మౌనంగా ఉండిపోయారు. "ఇప్పుడు నువ్వు ఒంటరిగా ఎలా ఉంటావ్ నాయనా" అని ఓదార్చారు. "మా అమ్మాయిని పెళ్లాడతావా?" అని అడిగాడు. అబ్దుల్లాహ్ ఆశ్చర్యపోయాడు. ముసయ్యిబ్ గొప్ప పండితులు. ఆయన కుమార్తెను తమ ఇంటి కోడలిగా చేసుకునేందుకు ఎంతోమంది సంపన్నులు పోటీ పడుతుండేవారు. కానీ ధార్మికతకు ప్రాధాన్యమిచ్చిన ముసయ్యిబ్ తన కుమార్తెను అబ్దుల్లాహ్‌కిచ్చి వివాహం జరిపించారు. కొద్ది రోజుల తర్వాత భార్యను పుట్టింట్లోనే ఉంచి ఇంటికి వెళ్లాడు అబ్దుల్లాహ్! ఇంట్లో ఎండిన రొట్టెలు నానబెడుతుండగా.. తలుపు శబ్దం అయింది. ఎవరని అడిగితే 'సయీద్' అని బదులొచ్చింది. అబ్దుల్లాహ్ కంగారుపడ్డాడు. ఈ దీనస్థితిని చూసి... గురువుగారు తన కూతురును కాపురానికి పంపడని బాధపడ్డాడు. ఇలా ఆలోచిస్తూనే తలుపు తీసి గురువును లోనికి ఆహ్వానించాడు. 'ఏమిటి అబ్దుల్లాహ్! నీ భార్యను మా ఇంట్లో ఉంచావే.. అమ్మాయిని అప్పగించడానికే వచ్చా!' అని చెప్పి గుమ్మం నుంచే వెళ్లిపోయారు. కొత్త పెళ్లి కూతురు ఎంతో సంతృప్తితో ఇంట్లో అడుగు పెట్టింది.

– ఖైరున్నీసాబేగం

ఈ కాలంలో అమ్మాయిని ఇవ్వడానికి అబ్బాయి ఆస్తిపాస్తులకే ప్రాధాన్యమిస్తున్నారు తల్లిదండ్రులు. 'అందచందాలు, వంశ మర్యాదలు, ఆస్తిపాస్తులు, ధార్మికత... వీటిలో ధార్మికత ఆధారంగానే వివాహం జరిపించండి" అని ప్రవక్త (స) పిలుపునిచ్చారు.ధార్మికత, నిబద్ధత కలిగి ఉంటే.. వారి జీవితాలు ఆదర్శంగా ఉంటాయి.

ఈనాడు సినిమా

'డిస్కో రాజా' కనిపిస్తాడు

రవితేజ

రవితేజ కథానాయకుడిగా ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'డిస్కో రాజా'. పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్ కథానాయికలు. వి.ఐ.ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఇటీవల హైదరాబాద్‌తోపాటు దిల్లీలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు. వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 2న ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. "వి.ఐ.ఆనంద్ విభిన్నమైన కథ, కథనాలతో రూపొందిస్తున్న చిత్రమిది. రవితేజ శైలి వినోదం ఉంటూనే, ప్రేక్షకుల్ని ఆసక్తికి గురిచేసే అంశాలు ఉంటాయి" అని చిత్రవర్గాలు తెలిపాయి. బాబీ సింహా, వెన్నెల కిషోర్, సత్య, తాన్య హోప్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, మాటలు: అబ్బూరి రవి, ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్.

గీతోపదేశం

నీ శక్తే ఆయుధము
నీ ప్రేమే ఆలయము
నమ్మరా ఒరే తమ్ముడా
నీ చెమటే ఇంధనము
ఈ దినమే నీ ధనము
లెమ్మురా నువ్వే బ్రహ్మరా

గీతం: అభిమాని లేనిదే...
చిత్రం: నాగవల్లి
రచన: చంద్రబోస్
– పంపినవారు: వి.కృష్ణారెడ్డి, ఆత్మకూరు

'గ్యాంగ్ లీడర్'లో నాని

చేతిలో పువ్వు ఎవరో నా లవ్వు

నితిన్

నితిన్ కథానాకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'భీష్మ'. సింగిల్ ఫరెవర్... అనేది ఉపశీర్షిక. రష్మిక మందన్న కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాని క్రిస్మస్‌కి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నితిన్ ప్రకటించారు. చేతిలో పువ్వుతో డిజైన్ చేసిన ప్రచార చిత్రాన్ని ట్విటర్‌లో పంచుకుంటూ, 'చేతిలో పువ్వు... ఎవరవుతారో నా లవర్. ఈ క్రిస్మకి శాంటాక్లాజ్ నాకు ఒక అమ్మాయిని బహుమానంగా పంపాలని కోరుకుంటున్నా' అంటూ ట్వీట్ చేశారు నితిన్.

ప్రేమ.. స్నేహం.. వినోదం

శర్వానంద్, రీతూ వర్మ

ఇటీవలే 'రణరంగం'తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు శర్వానంద్. తన చేతిలో ప్రస్తుతం రెండు చిత్రాలున్నాయి. '96' రీమేక్, 'శ్రీకారం' సెట్స్‌పై ఉన్నాయి. ఇప్పుడు మరో చిత్రానికి కొబ్బరికాయ కొట్టేశారు. శర్వానంద్ కథానాయకుడిగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. రీతూ వర్మ కథానాయిక. శ్రీకార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మాతలు. బుధవారం ఉదయం చెన్నైలో మొదలైంది. నిర్మాతలు మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే చిత్రమిది. స్నేహం, ప్రేమ అంశాలూ ఉంటాయి. ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు. 2020 వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: జాక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: సుజిత్ సారంగ్


ఇషాన్ ఖత్తర్, అనన్య పాండే

ఓ రాత్రి.. ఒక టాక్సీ.. ఓ జంట కథ

'ధడక్'తో పరిచయమైన ఇషాన్ ఖత్తర్, 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్2'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన అనన్య పాండే నాయకానాయికలుగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ప్రముఖ దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఖాలీ పీలీ' అనే పేరు ఖరారు చేశారు. దాంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో ఇషాన్ సిక్స్‌ప్యాక్ దేహంతో ఆకట్టుకుంటున్నాడు. మక్బూల్ ఖాన్ తెరకెక్కించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ముంబయిలో ఓ రాత్రి టాక్సీ ప్రయాణంలో ఓ అమ్మాయి, అబ్బాయి మధ్య జరిగే ప్రేమకథతో ఇది రూపొందుతోంది. వచ్చే జూన్‌లో విడుదల చేస్తారు.

సాయి పల్లవి

నా నటనని మార్చేస్తోంది అదే

ఆత్మ విశ్వాసమే అసలైన అందం అంటుంది సాయిపల్లవి. తొలి చిత్రంతోనే తెలుగు ప్రేక్షకుల్ని 'ఫిదా' చేసిందామె. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా, ఆమె తన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్ని దోచేస్తుంటుంది. పోషించే ప్రతి పాత్రతోనూ మానసికపరమైన సంబంధాన్ని ఏర్పరచుకొంటానని, అదే నా నటనని ప్రత్యేకంగా మార్చేస్తుంటుందని చెబుతోందామె. "ఒక కథ వినేటప్పుడే అందులో నేనున్నానో లేదో నాకు అర్థమైపోతుంది. దర్శకుడు చెబుతున్న కథ, అందులో పాత్ర నచ్చిందనిపిస్తే చాలు... అందులో నాకు నేను కనిపిస్తాను. ఆ మరుక్షణం నుంచే ఆ పాత్రతో వ్యక్తిగత అనుబంధం ఏర్పడుతుంది. సినిమా పూర్తయ్యేవరకూ ఆ పాత్ర నాతోనే ప్రయాణం చేస్తుంటుంద"ని సాయిపల్లవి చెబుతోంది. ఆమె ప్రస్తుతం రానాతో కలిసి 'విరాటపర్వం'లో నటిస్తోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగచైతన్య సరసన కూడా నటించబోతోంది సాయిపల్లవి.

ఆకలేస్తే అక్షరాలు చలేస్తే పుస్తకాలు

అతని పేరు పెన్సిల్ పార్థసారథి. ఆకలేస్తే అక్షరాలు తిని, చలేస్తే పుస్తకాలు కప్పుకుని పడుకునే టైపు! పేద్ద రచయిత కావాలనేది అతని కల. థ్రిల్లర్ నవలలు రాస్తూ, వాటితో ప్రేక్షకుల్ని పిచ్చెక్కించేయాలని కంకణం కట్టుకున్నాడు. హాలీవుడ్ సస్పెన్స్ సినిమాలు చూస్తూ, సరిగ్గా అందులోని ట్విస్టుల్నే తన కథల్లో పేర్చేస్తూ, అదే క్రియేటివిటీ అని పొంగిపోతూ ఏకంగా 28 పుస్తకాలు రాసేశాడు. ఓరోజు అతని దగ్గరకు ఐదుగురు ఆడవాళ్లు వచ్చారు. వచ్చాక.. పార్థసారథి జీవితమే ఓ సస్పెన్స్ డ్రామాలా మారిపోయింది. ఇంతకీ ఆ ఆడవాళ్లెవరు? పార్థసారథి కోసం ఎందుకొచ్చారు? అనేది తెలుసుకోవాలంటే 'గ్యాంగ్ లీడర్' సినిమా చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటించిన చిత్రమిది. విక్రమ్ కె.కుమార్ దర్శకుడు. మైత్రీ మూవీస్ నిర్మించింది. సెప్టెంబరు 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. గురువారం ట్రైలర్‌ని విడుదల చేశారు. "సరదాగా సాగిపోయే సినిమా ఇది. షూటింగ్ కూడా అంతే హాయిగా సాగిపోయింది. ప్రతినాయకుడిగా కార్తికేయ నటించారు. తన నటన అందరికీ నచ్చుతుంది. కథలో మలుపులు ఆసక్తిని కలిగిస్తాయ"న్నారు నాని.

కొత్త కబుర్లు

విజయ్ దేవరకొండ

తరుణ్ భాస్కర్

కేవలం మీకు మాత్రమే!

కథానాయకులు నిర్మాతలవుతున్నారు. దర్శకులేమో కథానాయకులుగా మారుతున్నారు. అయితే ఈ రెండూ ఒకే సినిమా కోసం జరుగుతుండడం విశేషం. ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ నిర్మాతగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'పెళ్లిచూపులు'తో దర్శకుడిగా నిరూపించుకున్న తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రానికి 'మీకు మాత్రమే చెబుతా' అనే టైటిల్‌ని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇదో వైవిధ్యభరితమైన కథ అని పేరుని బట్టే అర్థం చేసుకోవచ్చు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

కాజల్

జాన్ అబ్రహామ్‌తో కాజల్


జాన్ అబ్రహామ్

బాలీవుడ్ కథానాయకుడు జాన్ అబ్రహామ్‌తో కాజల్ జోడీ కట్టింది. వారిద్దరూ కలసి 'ముంబయి సాగా' అనే చిత్రంలో జంటగా కనిపించబోతున్నారు. ఇటీవలే సెట్స్ మీదకు వెళ్లిన ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మి, సునీల్ షెట్టి, జాకీ ష్రాఫ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'షూటవుట్ ఎట్ వడాలా', 'షూటవుట్ ఎట్ లోఖండ్‌వాలా' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సంజయ్ గుప్తా తెరకెక్కిస్తున్న మరో గ్యాంగ్‌స్టర్ చిత్రమిది. 1980, 90 ప్రాంతంలో ముంబయిలో జరిగిన గ్యాంగ్‌వార్‌ల నేపథ్యంలో రూపొందుతోంది. బుధవారం నుంచి ఈ సినిమా చిత్రీకరణలో కాజల్ పాల్గొంటోంది. వచ్చే ఏడాది విడుదల చేయనున్నారు.

సుదీప్, సల్మాన్‌ఖాన్

సల్మాన్ మెచ్చిన 'పహిల్వాన్'

సుదీప్ ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'పహిల్వాన్'. తెలుగుతో పాటు కన్నడ, హిందీ, తమిళం, మలయాళంలో వచ్చే నెల 12న విడుదలవుతోంది. ఎస్.కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రమిది. వారాహి చలన చిత్రం సంస్థ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఇటీవలే ట్రైలర్‌ని విడుదల చేశారు. ప్రముఖ కథానాయకుడు సల్మాన్‌ఖాన్ 'పహిల్వాన్' ట్రైలర్‌ని చూసి మెచ్చుకున్నట్టు చిత్రబృందం తెలిపింది. "సుదీప్ మల్లయోధుడిగా నటించిన చిత్రమిది. ట్రైలర్‌లో ఆయన లుక్, యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు ఆకట్టుకున్నాయి. ఇటీవలే సల్మాన్‌ఖాన్‌ని సుదీప్ కలవగా ఆయన ట్రైలర్‌తో పాటు చిత్రబృందాన్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ఇందులో ప్రముఖ హిందీ నటుడు సునీల్‌శెట్టి పాత్ర కూడా అలరిస్తుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆకాంక్షసింగ్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ జన్యా, ఛాయాగ్రహణం: కరుణాకర్.

అభయ్, మేఘా చౌదరి

ప్రయోగమా? ప్రమాదమా?

అభయ్, మేఘా చౌదరి జంటగా నటించిన చిత్రం 'మార్షల్'. శ్రీకాంత్ కీలక పాత్రధారి. జై రాజా సింగ్ దర్శకుడు. అభయ్ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబరు 13న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "వైద్య వృత్తి చాలా గొప్పది. డాక్టర్లు కళ్ల ముందు కదలాడే దేవుళ్లు. అలాంటి వృత్తిలో కొన్ని చీడ పురుగులు కూడా ఉన్నాయి. వైద్యం పేరుతో, ప్రయోగాల పేరుతో అమాయకుల ప్రాణాల్ని బలి తీసుకుంటున్నారు. అలాంటి ఓ డాక్టర్ కథ ఇది. శ్రీకాంత్ పాత్ర కొత్త తరహాలో సాగుతుంది. అభయ్‌కి నటుడిగా మంచి పేరొస్తుంది. సామాజిక నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ హంగులూ ఉన్నాయ"న్నారు దర్శకుడు. సంగీతం: రవి బసురి.

వసుంధర

పుట్టిన వెంటనే చెత్తబుట్టలోకి చేరిన ఆమె... తరువాత పక్షవాతానికి గురైంది. అయితేనేం... చదువుల సరస్వతిగా నిలిచింది. బిగ్‌బీకి ఎదురుగా హాట్‌సీటులో కూర్చునే అర్హత సాధించింది. 'కౌన్‌బనేగా కరోడ్‌పతి'లో పాల్గొని పన్నెండున్నర లక్షల రూపాయలను సొంతం చేసుకుంది. అందరి హృదయాలను గెలిచిన ఆమే... నూపుర్ చౌహాన్. తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను వసుంధరతో ప్రత్యేకంగా పంచుకుందిలా...

చెత్తబుట్ట నుంచి... హాట్‌సీట్ వరకూ

ఓ సాధారణ మహిళగా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమంలో పాల్గొంటానని కలలోనూ అనుకోలేదు. ఈ ఏడాది మేలో ఆసక్తి ఉన్నవారు ఆ కార్యక్రమంలో పాల్గొనవచ్చంటూ ప్రకటనతోపాటు కొన్ని ప్రశ్నలిచ్చారు ఛానల్ నిర్వాహకులు. ప్రయత్నించాలనే ఉద్దేశంతో సమాధానాలు పంపా. తరువాత టెలిఫోన్ ఇంటర్వ్యూ చేశారు. సమాధానాలిచ్చి పాసయ్యా. లఖ్‌నవూలో ఆడిషన్స్‌కి రమ్మని పిలుపు. అమ్మతో కలిసి వెళ్లా. అర్హత సాధించడంతో కార్యక్రమంలో పాల్గొనమని విమానం టిక్కెట్లు పంపారు. మొదటి రెండు రోజులూ నేను ఫాస్టెస్ట్ ఫింగర్ ఫస్ట్ టెస్టులో ఫెయిల్ అయ్యా. సిద్ధంగా ఉన్న అభ్యర్థులను హాట్‌సీట్‌కు ఎంపిక చేసే పరీక్ష అది. కుడివైపు పక్షవాతంతో ఒక్కచేత్తో వేగంగా చేయలేకపోయా. మూడో రోజున అర్హత సాధించకపోతే, బయటకొచ్చేయాలి. అదే చివరి అవకాశం. పట్టుదలగా చేసి హాట్‌సీట్‌కు చేరుకున్నా. అమితాబ్ సర్ నా కథ విని నిల్చుని స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. మొదటి పది ప్రశ్నల వరకు వెంట వెంటనే సమాధానం చెప్పగలిగిన నేను ఆ తరువాత కొంచెం తడబడ్డా. పన్నెండున్నర లక్షలు రూపాయలు గెలుచుకున్నా. అక్కడితో బయటకు వచ్చేశా. నన్ను చూస్తుంటే తనకు గర్వంగా ఉందని బిగ్ బి అంటుంటే నాకు ఏడుపొచ్చేసింది. స్టూడియో నుంచి బయటకొస్తున్నప్పుడు గత మంతా గుర్తొచ్చింది.

కదల్లేకపోయా... మాది ఉత్తరప్రదేశ్, ఉన్నావ్‌లోని కపూర్‌పూర్. నాన్న రాజ్‌కుమార్‌సింగ్ చౌహాన్ సామాన్య రైతు. అమ్మ కల్పన. పెళ్లైన చాలా ఏళ్లకు అమ్మ కడుపున పడ్డా. అమ్మ గర్భం దాల్చినప్పటి నుంచీ నా గురించి కలలు కనేదట. నా పేరును ముందుగానే రాసి పెట్టుకుని, పెద్ద చదువులు చదివించాలనుకుందట. ఆ రోజు అమ్మకు పురిటినొప్పులు వస్తోంటే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ ఏదో యాక్సిడెంట్ కేసును చూస్తుంటే, నర్సులే అమ్మ దగ్గరున్నారట. కాన్పు సమయంలో నేను సగం మాత్రమే బయటకొచ్చా. అప్పటికే నేను నీలం రంగులో ఉండటంతో డాక్టర్ వచ్చి ఫోర్సెప్స్‌తో పూర్తిగా బయటకు తీశారు. నాలో ఏ కదలికా లేకపోవడంతో చనిపోయానని చెప్పి చెత్తబుట్టలో పారేశారట. ఇది తెలిసి అంతా ఏడ్చారట. పాపాయిని శుభ్రం చేసి ఇస్తే... మా సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేసుకుంటామని చెబుతూనే... మరోసారి నన్ను కదిపి చూడమని మా నానమ్మ అడిగిందట. నర్సు నా వీపు మీద తట్టేసరికి ఏడవడం మొదలుపెట్టానని అమ్మ చెప్పింది. ఆ సమయంలో చేసిన వైద్యం నా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇంటికొచ్చి నాలుగు నెలలు గడిచినా సరైన కదలిక లేకపోవడంతో వైద్యులకు చూపించారు. వాళ్లు హైదరాబాద్ తీసుకెళ్లమన్నారు. ప్రసవ సమయంలో ఫోర్సెప్స్ వాడటంతో నా మెదడుకు గాయమై, కుడివైపు పూర్తిగా పక్షవాతం వచ్చిందని తేల్చారు. అమ్మావాళ్లు చూపించని డాక్టర్ లేడు. నాలుగేళ్లకు వాకర్ సాయంతో నడవగలిగా.

పాఠాలు చెప్పే స్థాయికి... అమ్మావాళ్లు నన్ను నానమ్మ ఇంట్లో ఉంచి చికిత్స చేయించేవారు. ఎనిమిదేళ్లకు నన్ను స్కూల్‌కు తీసుకెళ్తే, దివ్యాంగుల పాఠశాలలో చేర్పించమన్నారు. అక్కడ నా ఐక్యూ పరిశీలించిన వైద్యులు నా మెదడు ఆరోగ్యంగా ఉందని, సాధారణ పాఠశాలలో చేర్పించొచ్చని అన్నారు. దాంతో బడిలో చేర్పించారు. అక్కడెవరూ నాతో స్నేహం చేసేవారు కాదు. టీచర్లూ నాకు ఏం చెప్పినా అర్థం కాదనేవారు. అప్పుడే అపర్ణాజోషి టీచర్ నాకు చదువు విలువ తెలియజేశారు. నాలో ఓ ఆశయాన్ని నింపారు. ఇప్పటికీ ఆమే నా మెంటార్. ప్రతి తరగతిలో మొదటిస్థానంలో నిలిచా. బీఏ చదివా. కంప్యూటర్ కోర్సులో డిప్లొమా పూర్తి చేశా. ప్రస్తుతం ప్రభుత్వోద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. ఓవైపు చదువుతూనే, కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నా. మొదట నలుగురైదుగురు పిల్లలుండేవారు. వారిని పంపేందుకు పెద్దవాళ్లు ఒప్పుకొనేవారు కాదు. ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి తొమ్మిది వరకు ట్యూషన్లు బ్యాచ్‌ల వారిగా చెప్పే స్థాయికి విద్యార్థులు పెరిగారు. గతజన్మలో చేసిన పాపంతోనే ఈ వైకల్యం వచ్చిందని నా చిన్నప్పుడు విమర్శించిన వారంతా ఇప్పుడు ప్రశంసిస్తున్నారు. ఈ డబ్బుతో కూలిపోయేలా ఉన్న మా ఇంటిని బాగు చేయిస్తా. మంచి ఉద్యోగం సాధించి, ఎప్పటికైనా పెద్ద ఆసుపత్రిలో వైద్యనిపుణుల దగ్గర చికిత్స చేయించుకుంటా.

తమ్ముడు ఇంటికి రావడం లేదు!

? మా తమ్ముడు నాలుగు నెలల క్రితం ఎవరికీ చెప్పకుండా పెళ్లి చేసుకున్నాడు. ఎంత మందితో చెప్పించినా... అందరం ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించినా వాడు ఇంటికి రావడం లేదు. దీని గురించి ప్రతిక్షణం ఆలోచించడంతో నాకు మనశ్శాంతి కరవైంది. ఆందోళన తగ్గాలని హ్యాపీ హార్మోన్లు పెరిగే ఆహారం తీసుకుంటున్నా. నిద్ర బాగా పట్టాలని పాలూ తాగుతున్నా. ఎలాంటి ఆలోచనలు రాకూడదని ఇతర వ్యాపకాలు పెట్టుకున్నా ప్రయోజనం లేదు. దీన్నుంచి బయటపడాలంటే నేనేం చేయాలి?

– ఓ సోదరి

మీ తమ్ముడు పెళ్లి చేసుకునే ముందు అతనో అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు, పెళ్లి చేసుకోబోతున్నట్లు ఇంట్లో ఏమైనా చెప్పాడా... చాలావరకు కులాంతర, మతాంతర వివాహాల్లో కుటుంబ సభ్యులు అంగీకరించనప్పుడు ఇలాగే ఇంట్లో చెప్పకుండా పెళ్లి చేసుకుంటారు. మీ తమ్ముడూ అదే చేశాడు. ఆ తరువాత కొత్త కోడలితో తమ్ముడిని ఇంటికి తీసుకురావడానికి మీరెంత వరకు ప్రయత్నించారో ఆలోచించండి. మీరంతా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారు కానీ.. వాళ్ల పెళ్లిని అంగీకరించి దాన్నో వేడుకలా చేయాలనుకుంటున్నట్లు సర్దిచెప్పే ప్రయత్నం చేశారా... మీరెవరూ అంగీకరించరనే ఉద్దేశంతోనే అతడు ఇంటికి రావడం లేదేమో ఆలోచించండి. ముందు మీ తమ్ముడి పెళ్లిని అంగీకరిస్తామని చెబుతూనే... అతనికి మీపై నమ్మకం కలిగించేలా చేయండి. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఎవరికైనా ఆందోళనలు సహజం. మీరు తమ్ముడి గురించి అతిగా ఆలోచిస్తున్నారనిపిస్తోంది. 'మేం తినడం మానేస్తాం... చనిపోతాం' అంటూ వారిని బ్లాక్‌మెయిల్ చేయకుండా 'నువ్వు ఎప్పుడు వచ్చినా మేం సాదరంగా ఆహ్వానిస్తామ'నే సందేశం పంపండి. అప్పుడప్పుడు మీరు అతనితో కలవడానికి ప్రయత్నించండి. మీపట్ల నమ్మకం కలుగుతుంది. మీ కుటుంబ సభ్యులకూ నచ్చజెప్పండి. తమ్ముడు తప్పు చేయలేదని, తన జీవితానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నాడని చెప్పండి. ఇలాంటి పరిస్థితుల్లో మీకు వ్యాపకాలు ఉండటం మంచిదే.

డియర్ వసుంధర

డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

జ్వరాలకు బంతిమొక్క+దాల్చినచెక్క



పిల్లలే కాదు... పెద్దలూ జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతోన్న కాలమిది. వీళ్లందరితో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. వీటన్నింటికీ కారణాలు పలు రకాలు ఉన్నా... మూలకారణం మాత్రం మన ఇల్లే. మన చుట్టూ ఉండే వాతావరణమే. ఇంటిని అద్దంలా చూసుకునే ఇల్లాలు ఈ జాగ్రత్తలూ తీసుకుంటే... తొంబైశాతం అనారోగ్యాలను దూరంగా పెట్టొచ్చు.

ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా ప్రతిఒక్కరూ జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. వైరల్ జ్వరాలూ వణికిస్తున్నాయి. మహిళలు తలచుకుంటే... వీటిని రాకుండానూ చేయొచ్చు. అపరిశుభ్రతే ఈ సమస్యలన్నింటికీ కారణం అంటున్నారు వైద్యులు.

◆ అవి దోమల ఆవాసాలు...

ఇది వానాకాలం. ఈ కాలంలోనే నీరు ఎక్కువగా ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతుంది. దాంతో దోమలు వృద్ధి చెందుతాయి. ముఖ్యంగా పాత, విరిగిపోయిన వస్తువులు, మూత పెట్టని నీళ్ల డ్రమ్ములు, కూలర్లు, కొబ్బరి బోండాల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం చాలా ఎక్కువ. ఇవి ఆ నిల్వ నీటిలోనే పుట్టి మన ఇంటి పరిసరాల్లోనే పెరుగుతాయి. దోమలు ఇంట్లో వెలుతురు పడని ప్రాంతాల్లో, దుస్తులు పెట్టే అరల్లో, మూలల్లో, వంటగదిలో, మంచం, సోఫాలు, కుర్చీల కింద ఆవాసం ఏర్పరుచుకుంటాయి. తడిచెత్తపైనా నివాసం ఉంటాయి. ఇంట్లో మరమ్మతులు, ఇతర పనులు చేపట్టినప్పుడు వచ్చే వ్యర్థాలను కుప్పలుగా పోసినా దోమలతో సమస్యే. డెంగ్యూకి కారణమయ్యే ఈడిస్ దోమలు నిల్వ నీటిలోనే పుడతాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు ఇంటిని శుభ్రం చేయాలి. ఎవరికివారు పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి.

◆ పరిశుభ్రతే ప్రధానం...

మొదట మన ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, ఇనుప సామాన్లు, పూల కుండీలు, విరిగిపోయిన కుర్చీలు, మంచాలు... వంటివాటిని తీసేయడం మంచిది.

- డ్రమ్ముల్లో, మిగతా పెద్ద పెద్ద పాత్రల్లో నిల్వ చేసుకునే నీటిని వారం కంటే ఎక్కువ రోజులు ఉంచకూడదు. ప్రతి వారం ఆ నీటిని పారబోసి కొత్తనీటిని పట్టుకోవాలి.
- మేడపై, ఇంటి రేకులపై పాత వస్తువులుంటే తీసేయాలి. పాడైపోయిన ఫర్నిచర్, కాగితాలు, పుస్తకాలను తరచూ తొలగించాలి.
- ఇంట్లో సింకుతోపాటు నీళ్లు ఉండే అన్ని ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ తడి లేకుండా చూసుకోవాలి. ఈ కాలంలో మొక్కలనూ ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఆ ప్రాంతాలు పొడిగా ఉంచుకోవాలి.

అత్తవారింట చిచ్చు పెట్టిన శైలు..!

- చాలామంది ఇళ్లల్లో సమస్య చెత్త. దీన్ని ఎప్పటికప్పుడు తొలగించడమే కాదు, రోడ్డు మీదో, గోడ వతలో కాకుండా... కవర్లలో తీసుకుని, ముడివేసి చెత్త సేకరించేవారికే ఇవ్వాలి. చెత్త డబ్బాలపై మూతలు పెట్టడం తప్పనిసరి.
- కేవలం మన ఇంటినే కాదు... చుట్టుపక్కలా శుభ్రంగా ఉండేలా చూడాలి. ఇరుగుపొరుగుతో కలిసి ఆ ప్రాంతాలను శుభ్రం చేయించడమో, మీరే స్వయంగా చేయడమో తప్పనిసరి. మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వడమూ మంచి ఆలోచనే.

● ఆహారపరంగా...

వైరల్ జ్వరాల నుంచి తులసి రక్షణనిస్తుంది. గుప్పెడు తులసి ఆకులను కప్పు నీటిలో వేసి బాగా మరిగించాలి. కషాయంతోపాటు ఆ ఆకులను తాగేయాలి. దగ్గు సమస్య తగ్గుతుంది.

- యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలను సమపాళ్లలో తీసుకుని బరకగా పొడి చేసి భద్రపరుచుకోవాలి. కప్పు మరిగించిన నీటిలో పావు చెంచా పొడి వేసి మూత పెట్టాలి. నిమిషం తరువాత వడకట్టి చెంచా తేనె కలిపి వేడివేడిగా తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే దగ్గు, జలుబు, కఫం, అలర్జీ, సైనసైటిస్ లాంటివాటికి అడ్డుకట్ట వేయొచ్చు.
- వర్షాకాలంలో జలుబు, దగ్గుతోపాటు ఎక్కువగా వచ్చేది జ్వరం. దీన్ని తగ్గించడానికి ధనియాలు చక్కటి ఔషధంలా పనిచేస్తాయి. రెండు చెంచాల ధనియాలను వేయించి, కప్పు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఇది వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి. ప్రతి నాలుగైదు గంటలకోసారి తగ్గేవరకూ తాగుతూ ఉంటే... ఉపశమనంగా అనిపిస్తుంది.

- నేలవేము మొక్కను శుభ్రంగా కడిగి రసం తీసుకుని కొద్దికొద్దిగా తీసుకున్నా వైరల్ జ్వరాలు తగ్గుతాయి. తిప్పతీగని నీటిలో వేసి మరిగించి, కషాయంలా చేసుకుని చెంచా చొప్పున తీసుకోవాలి. కప్పు నీటిలో గుప్పెడు తులసి ఆకులు వేసి కాచి వేడిగా ఉండగానే తేనె కలిపి తాగినా జ్వరం అదుపులో ఉంటుంది.
- జలుబు సమస్య ఇబ్బంది పెడుతోంటే... కప్పు నీటిలో ఒకటిన్నర చెంచా మిరియాల పొడి కలిపి వేడి చేయాలి. నీళ్లు సగం అయ్యాక వడబోసి కొద్దిగా బెల్లం కలిపి వేడివేడిగా తాగితే జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.
- అనారోగ్యాలు దాడి చేయకుండా ఉండాలంటే... రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ముఖ్యంగా కాచి, చల్లార్చిన మంచినీటిని తాగాలి. ఆహారాన్ని ఎప్పుడూ వేడివేడిగా తీసుకోవడమే మంచిది. మిగిలిపోయిన పదార్థాలను మళ్లీ మళ్లీ వేడి చేసి తినే పద్ధతి వద్దేవద్దు.
- ఈ కాలంలో మాంసాహారాన్ని వీలైనంత తక్కువగా తీసుకోవాలి. వేడి వేడి సూపులు ఎంత ఎక్కువగా తాగితే అంత మంచిది. అరుగుదల బాగుంటుంది. చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి.

దోమలు పోవాలంటే....

ఈ చిట్కాలు పాటించి చూడండి.

- నీరు నిలిచి ఉన్న చోట కాస్త కాఫీ పొడి చల్లితే...దోమలు పెరగకుండా ఉంటాయి.
- వెల్లుల్లి దోమల్ని నివారిస్తుంది. కొన్ని వెల్లుల్ని రెబ్బల్ని దంచి నీటిలో వేసి కషాయంలా చేసుకోవాలి. దీనికి కాస్త నిమ్మగడ్డి నూనె కలిపి ఇంట్లో అక్కడక్కడా చల్లినా దోమలు దరిచేరవు. వెల్లుల్లిని ఎండబెట్టి పొడి చేసి కర్పూరంతో కలిపి ధూపంలా వేస్తే.... ఆ పొగ ఇల్లంతా వ్యాపిస్తుంది.
- నిమ్మ నూనె, యూకలిప్టస్ నూనె కలిపి కిటికీలకు ఉండే పరదాలపై చల్లితే మూలల్లో దోమలు ఆవాసం ఏర్పరుచుకోవు.
- సాయంత్రం వేళ... నిప్పులపై కాస్త సాంబ్రాణి పొగగా వేసినా దోమలు పరార్.

డాక్టర్ గాయత్రీదేవి
ఆరోగ్యవీరం

దోమల్ని నివారించే మొక్కలు

ఈ కాలంలో మీ పెరట్లో ఈ మొక్కలు ఉండేలా చూసుకోండి.

- **సిట్రనెల్లా:** ఘాటైన సువాసన కలిగిన ఈ మొక్క దోమల నివారిణిగా పనిచేస్తుంది. ఇది ఐదు నుంచి ఆరు అడుగుల ఎత్తువరకూ సులువుగా పెరుగుతుంది.
- **లెమన్‌బామ్:** పుదీనా కుటుంబానికి చెందిన మొక్క ఇది. హార్స్ మింట్‌గా ప్రసిద్ధి చెందిన దీన్ని ఎవరైనా సులువుగా పెంచుకోవచ్చు. దీని సువాసనకు దోమల్ని నియంత్రించే శక్తి ఉంటుంది. ఈ ఆకులను ఎండబెట్టి టీలానూ చేసుకోవచ్చు.
- **బంతి:** వర్ణరంజితమైన పూలతో పెంచుకునే ప్రదేశానికి నిండుదనం తెస్తుంది. దీనిలో ఉండే పైరేత్రం అనే పదార్థం కీటక నివారిణిగా పని చేస్తుంది. కుండీల్లో, తోటల్లో మీకు నచ్చినట్లుగా అందంగా పెంచుకోవచ్చు.
- **వెల్లుల్లి:** దీన్ని ఎక్కువగా తినడం వల్ల మన శరీరం దోమల్ని ఆకర్షించదట. అంతేకాదు దీనికి క్యాన్సర్ కారకాల్ని అడ్డుకునే శక్తీ ఎక్కువే. వెల్లుల్లిని కుండీల్లో పెంచుకోవడం సులువే.
- **జెరానియం:** కుండీల్లో సైతం సులువుగా పెంచుకునే మొక్కల్లో ఇదొకటి. సహజంగా దీనికి ఉండే నిమ్మ సువాసనని దోమలు ఇష్టపడవు. మీ ముంగిట్లో దీన్ని పెంచుకోగలిగితే... లోపలికి దోమలు రావు.
- **మాచిపత్రి:** ఆస్టరేసి కుటుంబానికి చెందిన దవనం, మాచిపత్రిగా పిలిచే ఈ మొక్కలకి ఉండే సువాసన దోమల్ని రానివ్వకుండా అడ్డుకుంటుంది.

హాయిగా నిద్రపోనివ్వండి...

పసిపాపల్నే కాదు... కాస్త ఎదిగిన పిల్లల్ని సమయానికి నిద్రపుచ్చడం ఈ రోజుల్లో చాలా కష్టం. నిద్ర సరిపోక ఉదయాన్నే లేవలేరు... చదువుల్లో చురుగ్గా ఉండలేరు. ఈ పరిస్థితికి కారణాలెన్నో ఉన్నాయి. అవేంటి... వాటిని ఎలా అధిగమించాలో తెలుసుకుందామా?

❖ చిన్నారులు ఉత్సాహంగా ఉండటం లేదంటే... ముందు వారికి నిద్ర సరిపోతోందా లేదా అనేది గమనించండి. కనీసం తొమ్మిది గంటల నిద్రలేకపోతే వారు బద్ధకంగా మారిపోతారు. దేనిమీదా ఏకాగ్రత, ఆసక్తీ ఉండవు. అందుకే వేళకు నిద్రపోయేలా చూడండి.

❖ ఒకప్పుడు పిల్లలు సాయంత్రం స్కూలు నుంచి రాగానే కాస్త పాలు తాగి, ఏ చిక్కీలో, జంతికలో చిరుతిళ్లుగా తినేవారు. రాత్రి ఆరు ఏడింటి మధ్య అన్నం తినేసేవారు. అది నిద్రపోయే సమయానికి జీర్ణమయ్యేది. దాంతో హాయిగా నిద్రపట్టేది. ఇప్పుడలా లేదు. సాయంత్రం నూడుల్స్, మంచూరియా వంటి బరువైన ఆహారం తీసుకోవడం ఆపై రాత్రి ఆకలివేయక ఆలస్యంగా భోజనం కానిస్తున్నారు. ఆ ప్రభావం నిద్రపైనా పడుతుంది. రాత్రిపూట తేలికైన ఆహారం పెట్టడం మంచిది.

❖ పిల్లలు సరిగ్గా నిద్రపోకపోవడానికి మరో కారణం ఎలక్ట్రానిక్ వస్తువులపై మోజు. స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టీవీలకు అతుక్కుపోవడం, మితిమీరి ఆడే వీడియోగేమ్‌లు వంటివి కంటి సమస్యలు, కుంగుబాటుకు గురిచేస్తాయి. టీవీ, ఫోన్ తెరల్లో ఉండే కాంతి కిరణాలు నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. కొందరు చిన్నారులు వాటిని చూసేందుకు బలవంతంగా నిద్రనూ మానుకుంటారు. రోజులో కొంత సమయాన్ని మాత్రమే వారు దానికి కేటాయించుకునేలా చూడండి.

❖ చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్నా, వేళకు నిద్రపోవాలన్నా... తగిన శారీరక శ్రమ ఉండాలి. అలాని పెద్దవారిలా వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదు. కాసేపు ఆరుబయట ఆడుకున్నా చాలు. రోజూ సాయంత్రం ఓ గంటైనా వారి ప్రణాళికలో ఆటలకు సమయం ఉండేలా చేయండి. ఇది వారి జీవక్రియా రేటుని మెరుగుపరుస్తుంది.

విరిగిపోయిన పాలు వాడేద్దామిలా

కాలం ఏదైనా, కారణాలు ఏవైనా కొన్నిసార్లు పాలు విరిగిపోతుంటాయి. ఆ పాలను పారబోయకుండా ఇలా ఉపయోగించి చూడండి.

❖ విరిగిపోయిన పాలతో స్వీట్ కోవా తయారు చేసుకోవచ్చు. లేదంటే గుడ్డు కలిపి చక్కని స్మూతీగానూ ప్రయత్నించొచ్చు. పాన్‌కేక్‌లూ చేసుకోవచ్చు.

❖ ఈ పాలను పూలకుండీకి ఎరువుగా వేయండి. దీనిలో ఉండే క్యాల్షియం మొక్కని ఆరోగ్యంగా ఉంచుతుంది. టొమాటో మొక్కకు ఇది మంచి ఎరువు.

❖ చేపల్ని శుభ్రపరిచేప్పుడు ఈ పాలను వాడండి. అవి సులభంగా శుభ్రపడటమే కాదు కూరకూ మంచి రుచి వస్తుంది.

❖ పొడిచర్మం ఉన్నవారు ఈ పాలలో తేనె కలిపి ముఖానికి రాసి కడిగేయాలి. చర్మం మృదువుగా మారుతుంది.

నజరానా

చుండ్రు సమస్య ఇబ్బంది పెడుతోందా... గుప్పెడు వేపాకుల్ని ముందురోజు రాత్రి నీళ్లలో నానబెట్టాలి. మర్నాడు ఆ నీటిని తలకు రాసుకుని ఆరాక కడిగేస్తే చాలు. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

బంగారం వెండి

28న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,713	3,680
వెండి (గ్రా)	51.90	50.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	40,100	39,850	40,190	40,040	38,500	38,500	40,240	39,720	39,540	39,620
ఆర్నమెంట్	37,440	37,150	37,220	37,080	35,590	35,450	37,130	36,640	36,780	36,850
వెండి(కిలో)	48,160	46,730	48,500	47,000	46,800	45,700	48,500	47,000	47,500	47,500

ఫైయింగ్ కమాండెంట్‌గా ధామి

భారత వైమానిక దళ వింగ్ కమాండర్ శాలిజా ధామి ఇటీవల ఫైయింగ్ యూనిట్‌లో ఫైయింగ్ కమాండెంట్‌గా కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ ఘనత సాధించిన మొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఉత్తరప్రదేశ్, ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో చేతక్ హెలీకాప్టర్ యూనిట్‌లో విధుల్లో చేరారామె. చేతక్ హెలికాప్టర్ సింగిల్ ఇంజిన్‌తో నడుస్తుంది. ఇందులో ఆరుగురు వెళ్లిరావొచ్చు. గంటకు 220 కిమీ చొప్పున ఇది ప్రయాణిస్తుంది. ధామి 15 ఏళ్ల నుంచి వైమానిక దళంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె పంజాబ్‌లోని లూధియానాలో పెరిగారు. పాఠశాల రోజుల నుంచే పైలట్ కావాలనే లక్ష్యంతో చదివారు. 1994 నుంచి మహిళలను వైమానిక రంగంలోకి అనుమతించడంతో ఆమె ఈ దిశగా ప్రయత్నాలు చేశారు. ధామి చేతక్, చీతా హెలీకాప్టర్లకు మొదటి మహిళా ఫైయింగ్ శిక్షకురాలిగా బాధ్యతలు నిర్వర్తించి రికార్డు సృష్టించారు. వైమానిక దళంలో శాశ్వత కమిషన్ అధికారిగా పని చేసిన మొదటి మహిళా ధామియే కావడం విశేషం.

మార్పు సహజం.. అనివార్యం. రేపు ఎప్పటికీ నిన్నటిలాగా ఉండదు. జాబ్ మార్కెట్ కూడా అంతే. ఆటోమేషన్ మహిమతో రోజు రోజుకీ అప్‌డేట్ అవుతూనే ఉంది. కొత్త అభ్యర్థులు కొలువు సాధించుకోవాలంటే కొత్త కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిందే. ఉద్యోగాల్లో ఉన్నవాళ్లూ దాన్ని కాపాడుకోవాలంటే స్కిల్స్ పెంచుకోవాల్సిందే. అందుకే కాలేజీ రోజుల నుంచే రేపటి సవాళ్లకు దీటుగా సిద్ధం కావాలి.

రేపటికి రెడీనా?

కొన్నేళ్ల క్రితం వరకూ ఉద్యోగం అంటే నిలకడగా, దీర్ఘకాలం ఒకేచోట పనిచేయడం ప్రధాన లక్షణంగా ఉండేది. విద్యా వ్యవస్థా అందుకు తగిన విధంగానే విద్యార్థులను తీర్చిదిద్దేది. అందుకే ఒక వ్యక్తి విద్యాభ్యాసం పూర్తవగానే ఏ సంస్థలో చేరతాడో దాదాపుగా అందులోనే పదవీ విరమణ చేయడం కనిపించేది. ఇంటర్నెట్ యుగ ప్రారంభ దశలో ఈ పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చింది. జీవితాంతం ఒకేచోట పనిచేయడం అనే దృక్పథంలో మార్పులు మొదలయ్యాయి. అప్పట్లో అభ్యర్థులు మొదటి ఉద్యోగానికైనా అవసరమైన నైపుణ్యాలతో సంసిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. సాధారణంగా ఉద్యోగం ఇచ్చిన సంస్థలే తగిన శిక్షణ ఇచ్చేవి. దీర్ఘకాలం తమతో ఉండే విధంగా చూసుకునేవి.

ప్రస్తుత జాబ్ మార్కెట్ చాలా మారిపోయింది. గత దశాబ్ద కాలంలో ఎప్పుడూ వినని కొత్త జాబ్‌రోల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇందుకు విభిన్న విషయాలపై అవగాహన అవసరం అవుతోంది. అలాగే తమ విభాగంతో ఏమాత్రం సంబంధం లేనివాటితోనూ కలిసి పనిచేయాల్సి వస్తోంది. సమీప భవిష్యత్తులో రోబోలతో పనిచేయడమూ తప్పనిసరి కానుంది. దీంతో అభ్యర్థుల నుంచి సంస్థలు మరిన్ని నైపుణ్యాలను ఆశిస్తున్నాయి.

పైగా ఇప్పుడు ఫ్రీలాన్స్ సర్వీసెస్, తక్కువ వ్యవధిలో సేవలందించేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో సంస్థలూ ప్రతి చిన్నదానికి ఏళ్లపాటు జీతాలిచ్చే వారిని తీసుకోవడానికి సుముఖంగా లేవు. కాబట్టి, వచ్చిన ప్రతి అవకాశమూ అభ్యర్థికి విలువైనదే అవుతుంది. భవిష్యత్తు స్పష్టంగా తెలియని స్టార్టప్, మార్కెట్‌లో ఇప్పటికే బలంగా స్థిరపడిన సంస్థ.. ఇలా సంస్థ ఏదైనప్పటికీ నేరుగా సేవలు అందించేలా అభ్యర్థి ఉండటం తప్పనిసరి అయింది. కాబట్టి, ఉద్యోగ వేట ప్రారంభానికి ముందే భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి.

ఒంటరైనా.. బృందమైనా!

ఉద్యోగ విషయంలో లైఫ్ స్కిల్స్‌కు ప్రాధాన్యం ఎక్కువ. ఆటోమేషన్‌తో సంబంధం లేకుండానే వీటికి ప్రాధాన్యం ఎక్కువ. మామూలుగా సంస్థ అన్నాక నలుగురితో పని చేయాల్సి వస్తుంది. భిన్నమైన మనస్తత్వాల వారితో కలిసి ప్రభావవంతంగా పనిచేయాల్సి ఉంటుంది. దీని అవసరం గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. ఓపిక, సమయపాలన, భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవడం వంటివి ఎన్నో అవసరమవుతాయి. వాటిని అభివృద్ధి చేసుకోవాలి. కానీ ఇదొక్కటే సరిపోవడం లేదు. ఇంకా కొన్ని జీవన నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా జాబ్ రెడీనెస్‌కు ఎంత ప్రాధాన్యముందో తెలిసిందే. కాబట్టి, బృందంతో పనిచేయడంతోపాటు స్వీయ ప్రదర్శనకూ ప్రాధాన్యం పెరుగుతోంది. ఇందుకు అభ్యర్థిలో స్వీయ నాయకత్వం, స్వతంత్ర లక్షణాలు అవసరమవుతున్నాయి. అంటే తనకు తానే బాస్, మార్కెటింగ్ ఆఫీసర్, టెక్నాలజీ ఆఫీసర్.. అవసరాన్ని బట్టి తనకు తాను మారాలి.

ఉదాహరణకు- ఏదైనా పనిని చేయాల్సి వచ్చినపుడు తనకు తాను గడువు నిర్ణయించుకునే బాస్ లక్షణం; తన ఆలోచనను మార్కెటింగ్ చేసుకోగలగడం; భవిష్యత్‌కు తోడ్పడుతుందనుకునే టెక్నాలజీలను ముందుగా నేర్చుకోవడం ఇలా తన భవిష్యత్తును తాను నిర్మించుకునేలా తయారవ్వాలి. నేర్చుకోవడం, తనను తాను మలచుకోవడం, లక్ష్యంగా దిశగా నడిపించుకోవడం వంటివన్నీ అలవరచుకోవాలి. మొత్తంగా ఈ లైఫ్‌స్కిల్స్‌తో కళాశాల నుంచి బయటకు రాగలగాలి.

ప్రాక్టికల్ పరిజ్ఞానముందా?

ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లాలనుకుంటాం. అక్కడ చూడాల్సిన ప్రదేశాలు, వంటకాలు వంటి వాటి గురించి నెట్ సాయంతో వెతికేస్తాం. ఎక్కువమంది సిఫారసు చేసినవాటికి ప్రాధాన్యమిస్తాం. ఆన్‌లైన్‌లో ఏదైనా కొనుగోలు చేయాలనుకుంటాం. ఇదివరకు కొన్నవారి అభిప్రాయాన్ని కామెంట్ల ద్వారా తెలుసుకుంటాం. నచ్చితే అప్పుడు కొంటాం. కదా! ఇదే పద్ధతి కెరియర్‌లోనూ ఉపయోగపడుతుందని తెలుసా?

పరీక్షలో పాస్ మార్కులు వచ్చినా, డిస్టింక్షన్ మార్కులు వచ్చినా పొందేది ఒకే డిగ్రీ. సబ్జెక్టుపై ఎంత పట్టు ఉందనేదే ముఖ్యం. పాస్ అయిన ప్రతి ఒక్కరి చేతిలోనూ డిగ్రీ ఉంటుంది. మార్కుల్లో తేడా కొంత ప్రభావం చూపినా సబ్జెక్టుపై ఎంత అవగాహన ఉందనేదానికే తుది ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి, మార్కులపై కాకుండా విషయం తెలిసినవారిని ఎంచుకోవడానికి సంస్థలు సుముఖంగా ఉంటాయన్నది గుర్తించాలి. కేవలం చదవడానికే పరిమితం కాకుండా ప్రాక్టికల్‌గా అది ఎంతవరకూ ఉపయోగపడుతుందన్న దానిపై ఎక్కువ ఆసక్తి చూపాలి. పరీక్షలు నెగ్గటంపై కాకుండా నిజంగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. ఇలాంటివారికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, ఆన్‌లైన్ ఉద్యోగాలు ఇలా ఎన్నో అవకాశాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. దాదాపుగా ప్రతి రంగంలో ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని అందుకోగలగాలి.

ఇతర సబ్జెక్టులూ ముఖ్యమే

ప్రతి రంగంలోనూ ఏటా ఎన్నో ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయి. వివిధ సబ్జెక్టుల పరిజ్ఞానం ఉన్నపుడే ఇది ఎక్కువగా సాధ్యమవుతుందనేది నిపుణుల అభిప్రాయం. ఈమధ్య కాలంలో దీనికి సానుకూలంగా చాలామంది మాట్లాడుతున్నారు. విద్యార్థులను ఆపరంగా నడిపేలా కృషి చేస్తున్నారు కూడా! ఇంటర్ డిసిప్లినరీ భావన దీనికి సంబంధించినదే. కాబట్టి, కేవలం ఎంచుకున్న సబ్జెక్టుకే పరిమితం కాకుండా వేరే వాటికీ ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదాహరణ చెప్పాలంటే.. జీపీఎస్, గూగుల్ మ్యాప్‌లు, జియోలోకేషన్లు.. నూతన ప్రదేశాల, చిరునామాలు కనుక్కునే ప్రక్రియను సులభతరం చేస్తున్నాయని మనందరికీ తెలిసిందే. మేథమేటిక్స్, జాగ్రఫీల కలయికతో రూపొందిందిది.

ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన వాటితోపాటు ఇతర సబ్జెక్టులను నేర్చుకోవడానికి ప్రయత్నించండి. దగ్గరి సంబంధమున్న సబ్జెక్టులైనా, విభిన్నమైనవి అయినా సరే దేన్నైనా ఎంచుకోవచ్చు. ఇది సబ్జెక్టుకే పరిమితం కాదు. విభిన్న మనస్తత్వాలను అర్థం చేసుకోవడానికీ పనికొస్తుందని ఒక భావన. సంస్థ తాను బృందాలుగా చేసి ఇస్తే పని చేసే వారికంటే అందరిపై అవగాహన ఉండి, ఎవరికి వారు కలిసి త్వరితగతిన ఉత్పాదకతను ఇచ్చే వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకూ వివిధ అంశాల పరిజ్ఞానం అవసరమవుతుంది.

నేర్చుకోవడానికి సంసిద్ధత

చదువుకుంటున్నప్పుడే తమ రంగానికి సంబంధించిన పరిశ్రమ, అందులో తరచుగా వస్తున్న మార్పులపై అధ్యయనం చేస్తుండాలి. సంబంధిత రిపోర్టులు, వార్తలు, అధ్యయనాలు అన్నింటినీ అనుసరిస్తుండాలి. వాటిని సేకరించుకుని దగ్గరపెట్టుకోవాలి. వివిధ సెమినార్లకు సంబంధించిన వీడియోలను గమనిస్తుండాలి. సంబంధిత టెక్నాలజీపైనా దృష్టిపెట్టాలి. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతుండాలి.

వాటిలో దీర్ఘకాల అవసరమున్న వాటిని నేర్చుకునే ప్రయత్నం చేయాలి. సంబంధిత కోర్సులు ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలుసుకుని, నేర్చుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పుడు ఎన్నో ఆన్‌లైన్ సంస్థలు ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. వాటిని ప్రయత్నించవచ్చు. సంబంధిత రంగంలో పరిచయమున్న వారి సూచనలూ పనికివస్తాయి.

పద్ధతి ఏదైనా కావొచ్చు. కానీ నేర్చుకోవడానికి మాత్రం ఎప్పుడూ సుముఖంగా ఉండాలి. నేర్చుకున్నవాటిని ఆచరణలో పెట్టే మార్గాన్ని ఎంచుకోవాలి. ఎందుకంటే చదివి, విని నేర్చుకున్నదాని కంటే చేయడం ద్వారా నేర్చుకున్నదానికి ఎక్కువ విలువ ఉంటుంది. మొత్తంగా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. అలాగే రంగానికి సంబంధించిన వివిధ సంస్థల ప్రణాళికలను గమనిస్తుండాలి. పరిశ్రమలు తమ ఉద్యోగుల కోసం చేపడుతున్న కార్యక్రమాలనూ తెలుసుకుంటుండాలి. మీరు నేర్చుకుంటున్నవీ, వారికి కావాల్సినవీ ఒకేలా ఉన్నాయో లేదో బేరీజు వేసుకుంటుండాలి. చివరగా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. అవసరం ఏదైనా మీ అంతట మీరు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అవసరమైతే సంస్థ నేర్పిస్తుందిలే అన్న భావనలో ఉండొద్దు!

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

ఆర్ఆర్‌క్యాట్, ఇండోర్

ఇండోర్‌లోని రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఆర్ఆర్‌క్యాట్) అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ ట్రేడ్ అప్రెంటిస్ **కాలవ్యవధి:** ఒక ఏడాది
ఖాళీలు: 70 **ట్రేడులు:** ఫిట్టర్, మెషినిస్టు, టర్నర్, వెల్డర్ తదితరాలు.
అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
వయసు: 15.10.1997 - 14.10.2001 మధ్య జన్మించి ఉండాలి.
ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: సెప్టెంబరు 20
వెబ్‌సైట్: www.rrcat.gov.in

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎస్ఎస్‌సీ - ట్రాన్స్‌లేటర్ ఎగ్జామ్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)... దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు/ విభాగాలు/ సంస్థల్లో హిందీ ట్రాన్స్‌లేటర్, ఇతర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, హిందీ ప్రధ్యాపక్. **ఖాళీలు:** కమిషన్ తర్వాత వెల్లడిస్తుంది.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, సర్టిఫికెట్/ డిప్లొమా ఉత్తీర్ణత. **వయసు:** 30 సంవత్సరాలు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా.
పరీక్ష తేది: నవంబరు 26 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 26 **ఫీజు చెల్లించడానికి చివరితేది:** సెప్టెంబరు 30
వెబ్‌సైట్: https://ssc.nic.in/

ఐఐటీ పాలక్కడ్‌లో నాన్‌టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), పాలక్కడ్ (కేరళ)... నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: సూపరింటెండింగ్ ఇంజినీర్-01, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-01, అసిస్టెంట్ ఇంజినీర్-01, జూనియర్ సూపరింటెండెంట్-02, జూనియర్ లైబ్రరీ సూపరింటెండెంట్-01, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-04, జూనియర్ టెక్నీషియన్-08, జూనియర్ లైబ్రరీ టెక్నీషియన్-01, జూనియర్ అసిస్టెంట్-04. **అర్హత:** పదోతరగతి, ఐటీఐ/ డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: సెప్టెంబరు 27 **వెబ్‌సైట్:** https://iitpkd.ac.in/

మెట్రో రైలు కంపెనీలో మెయింటైనర్లు

దిల్లీ/ దేశ రాజధాని ప్రాంతంలోని మెట్రో రైలు కంపెనీలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: జూనియర్ ఇంజినీర్-05, మెయింటైనర్-42.
విభాగాలు: ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఎలక్ట్రోమెకానిక్ సిగ్నలింగ్.
అర్హత: సంబంధిత ట్రేడులు/ బ్రాంచుల్లో ఐటీఐ, ఇంజినీరింగ్ డిప్లొమా, అనుభవం. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.
చివరితేది: సెప్టెంబరు 16 **వెబ్‌సైట్:** www.becil.com

ఎన్ఎల్‌సీలో మైనింగ్ సిర్దార్లు

నైవేలిలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్... ఒడిశాలోని గనుల యూనిట్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: మైనింగ్ సిర్దార్ **ఖాళీలు:** 12
అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్/ డిప్లొమా, అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** సెప్టెంబరు 2 నుంచి 23 వరకు. **వెబ్‌సైట్:** www.nlcindia.com

దరఖాస్తు చేశారా?

- **డీఆర్‌డీవో విభాగాల్లో 290 సైంటిస్టు పోస్టులు**
  అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ, గేట్ స్కోరు; చివరితేది: ఆగస్టు 30
- **ఇండియన్ నేవీలో స్పోర్ట్స్ కోటా పోస్టులు**
  అర్హత: పదోతరగతి, ఇంటర్, డ్రీడార్హతలు; చివరితేది: ఆగస్టు 30
- **స్టాఫ్ సెలక్షన్ కమిషన్ - 1350 సెలక్షన్ పోస్టులు**
  అర్హత: పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఉన్నత విద్యార్హతలు; చివరితేది: ఆగస్టు 31
- **ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో ట్రైనీ పోస్టులు**
  అర్హత: పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ/ బీటెక్; చివరితేది: ఆగస్టు 31
- **ఇండియన్ కోస్టుగార్డులో నావిక్ పోస్టులు**
  అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో 10+2; చివరితేది: సెప్టెంబరు 1

Cat's paw.. ప్రయోగం ఎలా?

కొత్త వ్యక్తీకరణలను గమనించటం, వాటిని మాటల్లో, రాతల్లో సందర్భానుసారం ప్రయోగించటం వల్ల భాషాజ్ఞానం వృద్ధి చెందుతుంది. ఇంగ్లీష్‌లో Cat's paw అనే expression అర్థం, దాని ప్రయోగం తీరును ఉదాహరణల సాయంతో తెలుసుకుందాం!

Jayasankar: When did you see Bhakthavatsal? How is he and how did you find him? (నువ్వు భక్తవత్సల్‌ను ఎప్పుడు చూశావు? ఎలా ఉన్నాడు?)

Vidyadhar: He is slowly recovering from ill health. He is recovering fast from his illness. (అతను తన అనారోగ్యంనుంచి ఇప్పుడే కోలుకుంటున్నాడు. అతను చాలా తొందరగా కోలుకుంటున్నాడు)

Jayasankar: The doctor advised him to take plenty of fruits and some rice to fill his belly (అతన్ని డాక్టర్ పండ్లు బాగా తినమనీ, కొంత అన్నం కూడా తినమనీ సలహా ఇచ్చాడు)

ఎం. సురేశన్

Vidyadhar: Our friend Srikanth makes use of others to help him in his needs. He uses Sekhar as a cat's paw to save him from a very dangerous task, and often troubles him a lot. (మన స్నేహితుడు శ్రీకాంత్ ఇతరులను బాగా వాడుకుంటాడు. శేఖర్‌ను అతను చాలా ప్రమాదకరమైన.. లేకుంటే అనాహ్లాదకరమయిన పనులకు వాడుకుంటాడు)

Jayasankar: But why should Sekhar allow him to use him for his jobs? He should not do it at all. (కానీ శేఖర్ శ్రీకాంత్‌కు ఎందుకు పనులు చేసి పెట్టాలి? అతను ఆ పనులను చేయకూడదు)

Vidyadhar: That may be true, but Sekhar finds it difficult to satisfy Srikanth. (అది నిజమే. కానీ శేఖర్ అన్ని పనులు చేసిపెట్టినా అతన్ని తృప్తిపరచడం కష్టమవుతోంది.)

Jayasankar: Jaivanth, you know is in politics. He is up to neck deep in politics. He finds it woke to be in politics and does not care about his friends. (నీకు తెలుసు గదా? జైవంత్ రాజకీయాలలో ఉన్నాడు. అతను బాగా రాజకీయాలలో మునిగిపోయి ఉన్నాడు. అతను వాటిలో మునిగి తన స్నేహితులను కూడా లెక్కచేయటం లేదు)

Vidyadhar: that is the trouble with him. He is up to neck deep in politics and he is going to contest in the next elections as an MLA. (అదే అతనితో చిక్కు. అతను రాజకీయాలలో నిండా మునిగి ఉన్నాడు. వచ్చే ఎన్నికలలో అతను పోటీ చేయబోతున్నాడు)

Jayasankar: Why should he do that? Why should he be involved in politics? That is not the right thing for him. (అతనెందుకు అది చేస్తున్నాడు? రాజకీయాల్లో అతనెందుకు మునగాలి? అది అతనికి అంత మంచిది కాదు)

Vidyadhar: I do not know. I warned him a number of times not to get involved in politics but he does not care for my advice. (నాకు తెలీదు. అతన్ని నేను చాలాసార్లు హెచ్చరించాను, రాజకీయాలతో సంబంధం పెట్టుకోవద్దని. కానీ అతను నా సలహాను పెడచెవిని పెట్టాడు).

Jayasankar: Well, he is deeply involved in politics, and we cannot do anything to him. (అతను బాగా లోతుగా రాజకీయాల్లో మునిగిపోయి ఉన్నాడు. మనమేం చేయలేము.)

Look at the following words from the conversation

1) Cat's paw = A person used by another person to carry out a dangerous or unpleasant task (ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిని ప్రమాదకర విషయంలో గానీ, ఇబ్బంది కలిగించే విషయంలోకానీ ముంచటం)

a) Ramana: It is very dangerous for Gangadhar to be used by his friend to carry on his job. His friend often troubles him and asks him to do the job for him. (స్నేహితుడు తనను ఉపయోగించుకోవటం గంగాధర్‌కు చాలా ప్రమాదం. అతని స్నేహితుడు అతడితో పనిచేయించుకుంటూ తరచూ ఇబ్బందులకు గురిచేస్తుంటాడు)

Lakshmikanth: But why should Gangadhar do the job for him? Gangadhar uses him as a cat's paw. He uses Gangadhar as a cat's paw to work for him. His friend owes him a lot of money and that is why he does jobs for him. (కానీ గంగాధర్ అతని పనులను ఎందుకు చేసిపెట్టాలి? గంగాధర్‌ను అతని స్నేహితుడు ప్రమాదకరమైన పరిస్థితులకు గానీ, అనాహ్లాదకరమైన పనులకు గానీ వాడుకుంటాడు)

Notes:

1 Recovering = Return to normal state (కోలుకోవటం).

2 belly = stomach (కడుపు).

3 neck deep = Up to his neck. (గొంతువరకు)

ఛాంపియన్

ఆ ఇద్దరిలో నేనుండాలి

దిల్లీ: 2020 టోక్యో ఒలింపిక్స్ బెర్తే తన లక్ష్యమని భారత అగ్రశ్రేణి ఆటగాడు భమిడిపాటి సాయిప్రణీత్ తెలిపాడు. ప్రస్తుత ర్యాంకును కాపాడుకుంటే ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం ఖాయమని చెప్పాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచిన సాయిప్రణీత్.. తాజా ర్యాంకింగ్స్‌లో 4 స్థానాలు మెరుగుపరుచుకుని 15వ ర్యాంకు సాధించాడు. 2020 ఏప్రిల్ 30 నాటికి టాప్-16 ర్యాంకింగ్స్‌లో ఉండే క్రీడాకారులకు ఒలింపిక్స్ బెర్తు దక్కుతుంది. ఒకదేశం నుంచి గరిష్టంగా ఇద్దరికి మాత్రమే అవకాశం లభిస్తుంది. ఆ ఇద్దరిలో తాను ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రణీత్ చెప్పాడు. "వచ్చే ఏడాది స్విస్ ఓపెన్ వరకు జరిగే టోర్నీల్లో మెరుగ్గా ఆడితే ర్యాంకు కాపాడుకోవచ్చు. స్విస్ ఓపెన్‌లో మాత్రమే ఎక్కువ పాయింట్లు నిలబెట్టుకోవాల్సి ఉంటుంది. నిరుడు చైనా, కొరియా ఓపెన్ ఆడలేదు. డెన్మార్క్, ఫ్రెంచ్, హాంకాంగ్ ఓపెన్‌లలో ఆరంభంలోనే వెనుదిరిగా. ఈసారి ఈ టోర్నీల్లో క్వార్టర్స్, సెమీస్ చేరుకున్నా.. టైటిల్ గెలిచినా ర్యాంకింగ్ మరింత మెరుగవుతుంది. ఫిట్‌గా ఉంటే బాగా ఆడగలనని నాకు తెలుసు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ క్వార్టర్స్‌లో జొనాథన్ క్రిస్టీపై చివరి పాయింటు నెగ్గడం నా జీవితంలో మరిచిపోలేని అనుభూతి"నని సాయిప్రణీత్ చెప్పాడు.

ద్రవిడ్ బాధ్యతలు కోటక్, మాంబ్రేలకు!

ముంబయి: జాతీయ క్రికెట్ అకాడమీ బాధ్యతలు స్వీకరించిన మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ ఇక భారత జూనియర్ కోచ్‌గా కొనసాగడు. అతడి స్థానంలో భారత్-ఎ, అండర్-19 కోచ్‌లుగా సితాంశు కోటక్, పరాస్ మాంబ్రే బాధ్యతలు అందుకోనున్నారు. వచ్చే కొన్ని నెలల కోసమే వీరిని నియమించినట్లు తెలుస్తోంది. కోటక్ 130 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో 41.76 సగటుతో 8061 పరుగులు చేశాడు. కోటక్ భారత్-ఎ బ్యాటింగ్‌పై దృష్టిపెడతాడు. బౌలింగ్ కోచ్‌గా రమేశ్ పొవార్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పనిచేయనున్నారు. మరోవైపు మాంబ్రే ఇప్పటికే ద్రవిడ్‌తో కలిసి చేశాడు. మాంబ్రే 91 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 284 వికెట్లు పడగొట్టాడు.

ఇప్పటి ఆటగాళ్లే కోచ్‌లు కావాలి

ఈనాడు, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్‌లో శిక్షకుల కొరత ఉందని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. నాణ్యమైన కోచ్‌ల తయారీపై దృష్టిసారించలేకపోయామని తెలిపాడు. "అవసరమైన స్థాయిలో నాణ్యమైన కోచ్‌లను తయారు చేయడంపై దృష్టిసారించలేకపోయాం. ప్రస్తుతం ప్రపంచ స్థాయి కోచ్‌ల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుత తరం క్రీడాకారులు రిటైరైన అనంతరం శిక్షకులుగా మారితే కోచ్‌ల కొరత తీరుతుంది. అప్పటివరకు ఈ ప్రశ్నకు సమాధానం దొరకడం కష్టం. విదేశీ కోచ్‌లపై ఆధారపడాల్సిందే" అని గోపీచంద్ తెలిపాడు.

సక్సేనా సరికొత్త రికార్డు

ఆలూర్ (కర్ణాటక): భారత దేశవాళీ ఆటగాడు జలజ్ సక్సేనా సరికొత్త రికార్డు సృష్టించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 6 వేలకు పైగా పరుగులు చేయడంతో పాటు 300కు పైగా వికెట్లు తీసిన ఈ ఆల్‌రౌండర్.. ఇప్పటి వరకు జాతీయ జట్టు తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా దేశవాళీలో ఆ ఘనత సాధించిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. 113 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన ఈ రైటార్మ్ ఆఫ్ స్పిన్నర్ 6,044 పరుగులు చేశాడు. బంతితో కూడా రాణించి 305 వికెట్లు తీశాడు. దేశవాళీలో అద్భుత ప్రదర్శనతో సత్తాచాటుతున్న సక్సేనాకు ఇంతవరకు టీమ్‌ఇండియా నుంచి పిలుపు రాకపోవడం దురదృష్టకరం.

అంజుమ్

ఫైనల్లో ఎలావెనిల్, అంజుమ్

రియో డి జనీరో: షూటింగ్ ప్రపంచకప్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో భారత షూటర్లు ఎలావెనిల్ వలారివన్, అంజుమ్ మౌద్గిల్‌లు ఫైనల్లో స్థానాన్ని ఖాయం చేసుకున్నారు. క్వాలిఫికేషన్‌లో ఎలావెనిల్ 629.4 పాయింట్లు, అంజుమ్ 629.1 పాయింట్లు స్కోర్ చేశారు. అంజుమ్ ఇంతకు ముందే ఒలింపిక్ కోటా స్థానం సాధించింది. ఇప్పుడు ఆమె దృష్టంతా పతకంపై మాత్రమే.

ఆటకు అజంత వీడ్కోలు

దిల్లీ: మిస్టరీ స్పిన్నర్‌గా కొన్నేళ్ల కింద అందరినీ ఆకర్షించిన శ్రీలంక బౌలర్ అజంత మెండిస్ క్రికెట్ వీడ్కోలు పలికాడు. అని ఫార్మాట్ల నుంచి రిటైరవుతున్నట్లు బుధవారం ప్రకటించాడు. 34 ఏళ్ల మెండిస్ లంక తరపున 19 టెస్టుల్లో 70 వికెట్లు, 87 వన్డేల్లో 152 వికెట్లు, 39 టీ20ల్లో 66 వికెట్లు పడగొట్టాడు. గాయాలు, ఫామ్ లేమితో కెరీర్‌ను పొడిగించుకోలేకపోయాడు. 2008లో అరంగేట్రం చేసిన అతడు.. చివరిసారి 2015లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. టీ20 క్రికెట్లో రెండుసార్లు ఆరు వికెట్ల ఘనత సాధించిన ఏకైక బౌలర్ అజంత మెండిస్.

పారా షట్లర్లకు ప్రధాని అభినందన

130 కోట్ల మంది గర్విస్తున్నారు

మానసి జోషి

దిల్లీ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన భారత షట్లర్లను ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరిగిన వేదికలోనే ఈ టోర్నీ కూడా నిర్వహించారు. భారత పారా షట్లర్లు మూడు స్వర్ణాలు సహా 12 పతకాలు సాధించారు. "భారత పారా బ్యాడ్మింటన్ బృందాన్ని చూసి 130 కోట్ల మంది భారతీయులు గర్విస్తున్నారు. జట్టు మొత్తానికి అభినందనలు. వీరిలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకం. వారి విజయం ఎంతో సంతోషంతో పాటు స్ఫూర్తినీ అందిస్తుంది" అని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. టోర్నీ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఈవెంట్లో ప్రమోద్ భగత్, డబుల్స్ ఎస్ఎల్3, ఎస్ఎల్4 ఈవెంట్లో ప్రమోద్ భగత్-మనోజ్ సర్కార్, మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో మానసి జోషి స్వర్ణాలు సాధించగా.. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4లో తరుణ, డబుల్స్ ఎస్ఎల్3, ఎస్ఎల్4లో కుమార్ నితీశ్-తరుణ్, డబుల్స్ ఎస్ఎస్6లో నగార్ కృష్ణ-రాజా మగోత్రా.. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో పారుల్ పర్మార్ రజతాలు గెలిచారు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3లో మనోజ్ సర్కార్, ఎస్ఎల్4లో సుకంత్ కదమ్, డబుల్స్ ఎస్ఎల్3, ఎస్ఎల్4లో ఉమేశ్‌విక్రమ్-చవారత్, డబుల్స్ ఎస్యు5లో రాజ్‌కుమార్-రాకేశ్ పాండే కాంస్యాలు సాధించారు.

దక్షిణాఫ్రికాతో టీ20లకు ధోని లేనట్లే!

దిల్లీ: మహేంద్రసింగ్ అంతర్జాతీయ కెరీర్ విషయంలో సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అంతా అనుకున్నట్లుగా ప్రపంచకప్ తర్వాత రిటైర్మెంటూ ప్రకటించలేదు. అలాగని మ్యాచ్‌లూ ఆడలేదు. వెస్టిండీస్ సిరీస్‌కు దూరమై రెండు వారాల పాటు సైన్యంలో పని చేసి వచ్చాడు. అది అయ్యాక ఖాళీగానే ఉన్నాడు. మరి వచ్చే నెలలో దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో ధోని ఆడతాడా లేదా అని చూస్తున్నారు అభిమానులు. అయితే మహి అందుబాటులో ఉంటాడో లేదో కానీ.. సెలక్టర్లు మాత్రం అతడికి అవకాశం ఇవ్వకపోవచ్చన్నది బోర్డు వర్గాల సమాచారం. భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌నే కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను క్వీన్ స్వీప్ చేసిన జట్టునే సఫారీలతో సిరీస్‌కూ ఎంపిక చేసే అవకాశాలున్నాయి. సెప్టెంబరు 15, 18, 22 తేదీల్లో ఈ సిరీస్ జరగనుంది. 4వ తేదీన జట్టును ఎంపిక చేయనున్నారు. వచ్చే ఏడాది చివర్లో జరిగే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని పంత్‌తో పాటు ఇంకో ఇద్దరు వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్‌కు అవకాశాలివ్వాలని సెలక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం.

అప్పట్లో బుమ్రా ఉండుంటే..

రాబర్ట్స్

ఆంబ్రోస్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: టెస్టుల్లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో దూసుకెళ్తోన్న టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను విండీస్ దిగ్గజ బౌలర్లు ఆంబ్రోస్, ఆండీ రాబర్ట్స్ ప్రశంసలతో ముంచెత్తారు. బుమ్రా విండీస్‌లో పుట్టి.. ఆనాటి రోజుల్లో ఆడి ఉంటే తమతో పాటు దిగ్గజంగా నిలిచిపోయేవాడని పేర్కొన్నారు. "పిచ్ స్వభావాన్ని బట్టి, బ్యాట్స్‌మన్ ఆటతీరును గమనించి బుమ్రా తన లెంగ్త్‌లో వైవిధ్యం ప్రదర్శిస్తున్నాడు. పిచ్ పరిస్థితులకు అనుగుణంగా లెంగ్త్‌ను మార్చుకుంటూ.. అతను బ్యాట్స్‌మన్‌కు కొరకరాని కొయ్యలా మారుతున్నాడు. అతను కోట్నీ వాల్ష్‌ను గుర్తుకుతెస్తున్నాడు. మా రోజులు గుర్తొస్తున్నాయి. అప్పట్లో మాలో ఉండే పేస్, దూకుడు, సామర్థ్యం, బౌలింగ్ కళ అతనిలో కనిపిస్తున్నాయి. బుమ్రా మా రోజుల్లో ఆడివుంటే... మా తరంలో పరిపూర్ణమైన బౌలర్‌గా అవతరించేవాడు" అని ఆంబ్రోస్ చెప్పాడు. తాను చూసిన భారత బౌలర్లలో బుమ్రా అత్యుత్తమమని రాబర్ట్స్ తెలిపాడు. "అప్పట్లో భారత్ ఎక్కువగా స్పిన్నర్లపై ఆధారపడేది. స్పిన్‌తో విదేశాల్లో మ్యాచ్‌లు గెలవడం సాధ్యం కాదు. కపిల్ లాంటి బౌలర్లు ఆ దేశానికి ఆడారు. కానీ బుమ్రా లాంటి అత్యుత్తమ పేసర్ ఆ దేశం నుంచి వస్తాడని అనుకోలేదు. అతని విలక్షణమైన శైలిని అర్థం చేసుకోవడానికి చాలా కాలం పట్టేలా ఉంది. మా తరంలో అతను విండీస్‌లో పుట్టి ఉంటే మాలో కలిపేసుకునేవాళ్లం" అన్నాడు.

హరియాణా హ్యాట్రిక్

దిల్లీ: ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ విజయాల హ్యాట్రిక్ నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 41-25 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌ను చిత్తుచేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటిన ఆ జట్టుకిది వరుసగా మూడో గెలుపు. రైడింగ్‌లో వికాస్ ఖండోలా (7), ప్రశాంత్ కుమార్ రాయ్ (8).. ట్యాక్లింగ్‌లో రవి కుమార్ (6) రాణించి హరియాణాకు విజయాన్ని అందించారు. వినయ్ (7) ఆల్‌రౌండ్ నైపుణ్యంతో మెరిశాడు. మ్యాచ్ మొదటి నుంచే స్టీలర్స్ ఆధిపత్యం ప్రదర్శించింది. వికాస్, ప్రశాంత్ చెలరేగడంతో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన ఆ జట్టు 15-7తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ప్రథమ అర్ధభాగాన్ని 20-11తో ముగించింది. విరామం తర్వాత కూడా అదే జోరు కొనసాగించిన హరియాణా అలవోకగా గెలిచింది. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 40-24తో యు ముంబాపై విజయం సాధించింది. దిల్లీ జట్టులో రైడర్ నవీన్ కుమార్ (11), డిఫెండర్లు రవిందర పహాల్ (8), జోగిందర్ నర్వాల్ (6) సత్తాచాటారు. ముంబా తరపున అర్జున్ దేశ్వాల్ (7), సందీప్ నర్వాల్ (6) ఆకట్టుకున్నారు.

ప్రొ కబడ్డీలో ఈనాడు	బంగాల్ × తలైవాస్ (రా.7:30 నుంచి)

జడేజా సంకల్పాన్ని మెచ్చుకోవాలి

సౌరభ్ గంగూలీ

వెస్టిండీస్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న టీమ్‌ఇండియా సిరీస్‌ను వైట్‌వాష్ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. మూడు ఫార్మాట్లలో ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించడం అత్యుత్తమ ప్రదర్శన కిందే లెక్క. వన్డేలు, టీ20 సిరీస్‌ల తర్వాత టెస్టు సిరీస్‌లోనూ పెద్ద తేడా కనిపించట్లేదు. ప్రపంచ స్థాయి సీమర్లను అందించిన విండీస్ గడ్డపై టీమ్‌ఇండియా పేసర్లంతా సత్తాచాటడం ముచ్చటేస్తుంది. గత కొంతకాలం నుంచి టీమ్‌ఇండియా ప్రధాన పేసర్‌గా బుమ్రా రాణిస్తున్నాడు. రవీంద్ర జడేజా దృఢ సంకల్పాన్ని మెచ్చుకోవాల్సిందే. టెస్టులు, వన్డే జట్లలో రెగ్యులర్ ఆటగాడు కాకపోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన జడేజా ఇప్పుడు టెస్టుల్లోనూ టీమ్‌ఇండియాకు అండగా నిలుస్తున్నాడు.

SEAGRAM'S
ROYAL STAG
MEGA MUSIC CDs

ఒసాకా

ఫాబియానో

ధీమ్

యుఎస్ ఓపెన్

ధీమ్‌కు షాక్

- ఫాబియానో సంచలనం
- నాదల్ శుభారంభం
- ఒసాకా, హాలెప్ ముందంజ

యుఎస్ ఓపెన్‌లో సంచలనం. నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ కథ తొలి రౌండ్లోనే ముగిసింది. ఇటలీ అన్‌సీడెడ్ ఆటగాడు ఫాబియానో అతణ్ని ఇంటిముఖం పట్టించాడు. రెండో సీడ్ రఫెల్ నాదల్, ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఒసాకా, నాలుగో సీడ్ హాలెప్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లగా.. 11వ సీడ్ స్టీఫెన్స్ నిష్క్రమించింది.

న్యూయార్క్

రెండు సార్లు ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ డొమినిక్ థీమ్ యుఎస్ ఓపెన్‌లో చుక్కెదురైంది. అతడితో పాటు ప్రపంచకప్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ఉన్న మరో ముగ్గురు ఆటగాళ్లు సిట్సిపాస్, కచనోవ్, బటిస్టా తొలి రౌండ్లోనే పరాజయం పాలయ్యారు. ఇటలీకి చెందిన థామస్ ఫాబియానో 6-4, 3-6, 6-3, 6-2తో థీమ్ (ఆస్ట్రియా)కు షాకిచ్చాడు. ఎనిమిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 4-6, 7-6 (7-5), 6-7 (7-9), 5-7తో ఆండ్రీ రుబ్లెవ్ (రష్యా) చేతిలో, 9వ సీడ్ కచనోవ్ (రష్యా) 6-4, 5-7, 5-7, 6-4, 3-6తో పోస్పిసిల్ (కెనడా) చేతిలో, బటిస్టా అగట్ (స్పెయిన్) 6-3, 1-6, 4-6, 6-3, 3-6తో కుకుష్కిన్ (కజకిస్థాన్) చేతిలో ఓడిపోయారు. రఫెల్ నాదల్ (స్పెయిన్) తిరుగులేని ఆటతో రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. ఏకపక్షంగా సాగిన మొదటి రౌండ్లో అతడు 6-3, 6-2, 6-2తో జాన్ మిల్మాన్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేశాడు. నాదల్ ఆరు ఏస్‌లు, 22 విన్నర్లు కొట్టాడు. అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) హోరాహోరీ పోరులో 6-1, 6-3, 3-6, 4-6, 6-2తో అల్బోట్ (మాల్డోవా)పై విజయం సాధించాడు. నిక్ కిర్గియోస్ (ఆస్ట్రేలియా) 6-3, 7-6 (7-1), 6-4తో స్టీవ్ జాన్సన్ (అమెరికా)ను ఓడించాడు. 24 ఏస్‌లు సంధించిన కిర్గియోస్ ఏకంగా ఎనిమిది డబుల్ ఫాల్ట్ చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సిలిచ్ (క్రొయేషియా) 6-3, 6-2, 7-6 (8-6)తో క్లిజాన్ (స్లోవేకియా)పై, ఇస్నర్ (అమెరికా) 6-3, 6-4, 6-4తో లోపెజ్ (స్పెయిన్)పై, మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) 7-6 (7-1), 6-4, 6-3తో వినోలాస్ (స్పెయిన్)పై, వెర్డాస్కో (స్పెయిన్) 6-3, 3-6, 6-1, 6-2తో కంకే (జర్మనీ)పై, థాంప్సన్ (ఆస్ట్రేలియా) 6-3, 6-2, 6-4తో సౌసా (పోర్చుగల్)పై విజయం సాధించారు. సోంగా (ఫ్రాన్స్) 6-1, 7-6 (7-2), 4-6, 6-7 (5-7), 5-7తో సాండ్‌గ్రెన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు .

స్టీఫెన్స్ ఔట్: మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఒసాకా (జపాన్) తొలి రౌండ్లో చెమటోడ్చింది. ఆమె 6-4, 6-7 (5-7), 6-2తో బింకోవా (రష్యా)పై గెలిచింది. వింబుల్డన్ ఛాంపియన్ సిమోనా హాలెప్ (రొమేనియా) 6-3, 6-2, 6-2తో నికోల్ గిబ్స్ (అమెరికా)ను ఓడించింది. గిబ్స్ ఇటీవల క్వాన్సర్‌ను జయించింది. ఆ తర్వాత గ్రాండ్‌స్లామ్‌లో బరిలోకి దిగడం ఇదే తొలిసారి. 15 ఏళ్ల అమెరికా అమ్మాయి కొకో గాఫ్ కూడా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. ఆరంభ పోరులో ఆమె 3-6, 6-2, 6-4తో పొటపోవా (రష్యా)పై నెగ్గింది. 11వ సీడ్ స్టీఫెన్స్ (అమెరికా) తొలి రౌండ్ దాటలేకపోయింది. స్టీఫెన్స్ 3-6, 4-6తో కలిన్‌స్కాయా (రష్యా) చేతిలో ఓటమి చవిచూసింది. మాజీ నంబర్‌వన్ అజరెంక (బెలారస్) 6-3, 3-6, 4-6తో తన దేశానికే చెందిన సబలెంక చేతిలో కంగుతింది. ఇతర మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ బెర్డెన్స్ (నెదర్లాండ్స్) 6-4, 6-2తో బదోసా (స్పెయిన్)పై, వోజ్నియాకి (డెన్మార్క్) 1-6, 7-5, 6-3తో వాంగ్ (చైనా)పై, కోలిన్స్ (అమెరికా) 6-3, 4-6, 6-4తో హెర్కాగ్ (స్లోవేనియా)పై విజయం సాధించారు.

ఆ సమయాన హ్యూస్ గుర్తుకొచ్చాడు

లండన్: మెడకు బంతి తగిలి ప్రాణాలు వదిలిన ఆస్ట్రేలియా క్రికెటర్ ఫిల్ హ్యూస్ ఉదంతాన్ని క్రికెట్ అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. ఆ విషాదాంతం తర్వాత ఏ బ్యాట్స్‌మన్‌కు మెడ, ఆ పైభాగంలో బంతి తాకినా అందరికీ హ్యూసే గుర్తుకొస్తున్నాడు. యాషెస్ రెండో టెస్టు సందర్భంగా ఇంగ్లాండ్ ఫాస్ట్‌బౌలర్ జోఫ్రా ఆర్చర్ విసిరిన బంతి ప్రమాదకర రీతిలో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్‌కు తాకినపుడూ అదే ఆలోచన వచ్చింది. స్మిత్‌కు సైతం ఆ సమయంలో హ్యూసే గుర్తుకొచ్చాడట. "ఆ సమయంలో కొన్ని ఆలోచనలు మదిలో మెదిలాయి. కొన్నేళ్ల కిందట జరిగిన ఉదంతం గుర్తుకొచ్చింది. నేను దేని గురించి మాట్లాడున్నానో అర్థమై ఉంటుంది" అని స్మిత్ చెప్పాడు. బంతి తాకాక కాసేపు మైదానం బయట గడిపిన స్మిత్.. మళ్లీ బ్యాటింగ్‌కు తిరిగొచ్చాడు. ఔటయ్యేంత వరకు ఆడాడు. కానీ తర్వాత గాయం ప్రభావం చూపించడంతో మరుసటి రోజు మైదానంలోకి రాలేదు. తర్వాతి టెస్టుకూ దూరమయ్యాడు. ఆర్చర్ బౌలింగ్‌లో ఒకటికి రెండుసార్లు గాయపడ్డప్పటికీ అతనంటే తనకేమీ భయం లేదని స్మిత్ అన్నాడు.

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ
189 ↓	59 ↓
37452	11046

డోజోన్స్	నాస్‌డాక్
232 ↑	27 ↑
26010	7853

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00ప (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి	ముడిచమురు
71.77 ↓ 29 పైసలు	60.53 ↑
(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	28న	మార్పు%	నిఫ్టీ	28న	మార్పు%
HCL TECH	1123.95	2.82	YES BANK	59.50	-7.75
BPCL	350.55	2.41	VEDANTA	132.35	-4.16
INFOSYS	802.50	2.27	TATA STEEL	336.95	-3.98
TECH MAHINDRA	690.20	2.05	JSW STEEL	205.75	-3.58
EICHER MOTORS	16297.45	1.89	COAL INDIA	185.05	-3.54
BHARTI INFRATEL	248.80	1.53	ONGC	121.20	-3.50
BRITANNIA	2703.10	0.64	TATA MOTORS	116.35	-3.32

28న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

కోడిగుడ్లు				
	హైదరాబాద్	322	నమక్కల్	351
	చిల్లరగా(ఒక గుడ్డు)	3.80	29వ తేదీకి	
	బెంగళూరు	340	వరంగల్	325
	విజయవాడ	338	విశాఖపట్నం	361
	గోదావరి	338	చెన్నై	345
			చిత్తూరు	338

ఎఫ్‌డీఐ.. ఢంకా మోగింది

- పలు సంస్కరణలకు పచ్చజెండా
- బొగ్గు గనుల తవ్వకంలో 100% ఎఫ్‌డీఐ
- కాంట్రాక్ట్ తయారీలోనూ నూరు శాతం
- డిజిటల్ మీడియాలో 26%
- ఏక బ్రాండ్ రిటైల్‌లో నిబంధనల సడలింపు
- ఆమోద ముద్ర వేసిన కేబినెట్

'ఎఫ్‌డీఐ విధానంలో మార్పుల వల్ల భారత్ విదేశీ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఇంకా ఆకర్షణీయంగా మారుతుంది. తద్వారా పెట్టుబడులు, ఉద్యోగిత, వృద్ధి.. ఇలా అన్నీ పెరుగుతాయి. కేబినెట్ తాజా నిర్ణయాల వల్ల ఎఫ్‌డీఐ విధానాన్ని మరింత సరళీకరించినట్లు అవుతుంది. దేశంలో వ్యాపారాన్ని సులువుగా చేయడానికి వీలవుతుంది'

– కేబినెట్ సమావేశానంతరం విలేకర్లతో వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్

దిల్లీ: ఆర్థిక మందగమనానికి మందు వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు చర్యలను ప్రకటించి వారం రోజులు కాకముందే.. ఎఫ్‌డీఐ సంస్కరణలకు తెరలేపింది. బుధవారం జరిగిన మంత్రి మండలి(కేబినెట్) సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదముద్ర లభించింది. తద్వారా ఎఫ్‌డీఐ సంస్కరణలను మరింత సరళీకరించినట్లయింది.

ఇందులో భాగంగా.. బొగ్గు గనుల తవ్వకం, కాంట్రాక్ట్ తయారీలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతినిచ్చింది. ఏక బ్రాండ్ రిటైలర్లకు సోర్సింగ్ నిబంధనలను సడలించారు. డిజిటల్ మీడియాలో 26 శాతం మేర విదేశీ పెట్టుబడులకు అనుమతినిచ్చారు. తద్వారా అయిదేళ్ల కనిస్థానికి చేరిన ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. మొత్తం మీద నాలుగు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) నిబంధనలను సడలించింది.

గనుల రంగం

- ఇక నుంచి గనుల తవ్వకం, బొగ్గు విక్రయం విషయంలో విదేశీ కంపెనీలు ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం మేర పెట్టుబడులు పెట్టవచ్చు. బొగ్గుకు సంబంధించిన, అనుబంధంగా ఉండే ప్రాసెసింగ్ అంశాల్లోనూ వారు కార్యకలాపాలు నిర్వహించవచ్చు.
- అంటే బొగ్గు వాషరీ, క్రషింగ్, హ్యాండ్లింగ్, విడదీత(మాగ్నెటిక్, నాన్-మాగ్నెటిక్) వంటివి కూడా చేసుకోవచ్చు.
- ప్రస్తుత ఎఫ్‌డీఐ విధానం ప్రకారం.. విద్యుత్, ఇనుము, ఉక్కు, సిమెంటు కంపెనీలు తమ సొంత వినియోగం కోసం బొగ్గు, లిగ్నైట్ గనుల తవ్వకాల కోసం మాత్రం ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించవచ్చు.
- 'కంపెనీలు వాషరీస్ వంటి బొగ్గు ప్రాసెసింగ్ ప్లాంట్లను సైతం 100 శాతం ఎఫ్‌డీఐతో ఏర్పాటు చేయవచ్చు. అయితే అవి తమ ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి బొగ్గు గనుల తవ్వకాన్ని చేయవచ్చు. వాష్డ్ బొగ్గు, సీజ్డ్ బొగ్గు విక్రయాలను సైతం బహిరంగ మార్కెట్లో చేయరాదు. ఎవరైతే ముడి బొగ్గును బొగ్గు ప్రాసెసింగ్ ప్లాంట్లకు వాషింగ్ లేదా సైజింగ్ కోసం సరఫరా చేస్తారో వారికి మాత్రమే వాష్డ్, సీజ్డ్ బొగ్గును సరఫరా చేయవచ్చ'ని ఒక అధికారిక ప్రకటన పేర్కొంది.

బొగ్గు గనుల తవ్వకంలో 100 శాతం ఎఫ్‌డీఐ వల్ల అంతర్జాతీయ కంపెనీలను మన బొగ్గు మార్కెట్లోకి ఆహ్వానించడానికి వీలవుతుందని గోయెల్ పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ తయారీ

కాంట్రాక్ట్ తయారీ రంగంలోనూ 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే మేకిన్ ఇండియా నిబంధనలను ఈ సంస్థలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ప్రస్తుత విధానంలో తయారీ రంగంలో ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతులు ఉన్నాయి. అయితే కాంట్రాక్ట్ తయారీ రంగంపై స్పష్టత లేదు. 'కాంట్రాక్ట్ తయారీపై స్పష్టతనివ్వడం కోసం ఈ రంగంలోనూ 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతినిస్తున్నామ'ని ఒక ప్రకటన వెల్లడించింది.

డిజిటల్ మీడియా

డిజిటల్ మీడియాలో వార్తలను, వర్తమాన వ్యవహారాలను అప్‌లోడ్ లేదా స్ట్రీమింగ్ చేయడానికి సైతం ప్రభుత్వ అనుమతుల మార్గంలో 26 శాతం విదేశీ పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతులు తెలిపింది. ప్రస్తుత ఎఫ్‌డీఐ విధానంలో డిజిటల్ మీడియా విభాగంపై ఎటువంటి విధానాలు లేవు.

ప్రింట్ మీడియాలో 26% ఎఫ్‌డీఐకి; కంటెంట్ బ్రాడ్‌క్యాస్టింగ్ సేవల్లో 49 శాతం ఎఫ్‌డీఐకి అనుమతులు ఇప్పటికే ఉన్నాయి. 'డిజిటల్ మీడియాలో ఎఫ్‌డీఐకి అనుమతులు ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం. వేగంగా వృద్ధి చెందుతున్న ఈ మీడియా పరిశ్రమపై స్పష్టత ఇవ్వడం వల్ల మూలధన నిధులు తరలి వస్తాయి. ఎంచదగ్గరీతిలోనే పెట్టుబడులు కనిపించనున్నాయ'ని డెలాయిట్ పార్టనర్ జెహిల్ టక్కర్ పేర్కొన్నారు.

ఏక బ్రాండ్ రిటైల్

ఏక బ్రాండ్ రిటైల్ వాణిజ్యం(ఎస్‌బీఆర్‌టీ)లోనూ ప్రభుత్వం ఎఫ్‌డీఐ నిబంధనలను సరళీకరించింది. సోర్సింగ్ నిబంధనలను సడలించింది. 30 శాతం తప్పనిసరి స్థానిక సోర్సింగ్ నిబంధనల నిర్వచనాన్ని విస్తృతం చేసింది. అంటే ఇప్పటిదాకా 51% వరకు ఎఫ్‌డీఐలున్న ఏక బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ సంస్థలు ఏటా 30 శాతం వరకు వస్తువులను దేశీయంగా సేకరించాలన్నది నిబంధన. అయితే ఇకపై అయిదేళ్లకు సగటున 30 శాతం సమీకరించి ఉన్నా సరిపోతుంది. మరో పక్క, సంప్రదాయ స్టోర్లను ప్రారంభించకముందే ఆన్‌లైన్ విక్రయాలను సైతం కంపెనీలు ప్రారంభించడానికి సైతం కేబినెట్ ఆమోదించింది. అయితే ఆన్‌లైన్ రిటైలింగ్ చేపట్టిన రెండేళ్ల లోపే అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 'ఆన్‌లైన్ విక్రయాల వల్ల రవాణా, డిజిటల్ చెల్లింపులు, కస్టమర్ కేర్, శిక్షణ, ఉత్పత్తి నైపుణ్యాల్లో పలు ఉద్యోగాలు వస్తాయ'ని గోయెల్ పేర్కొన్నారు.

మొబైల్ తయారీదార్లకు మేలు

తాజా సంస్కరణలతో అంతర్జాతీయ బ్రాండ్లయిన యాపిల్, ఒన్‌ప్లస్, ఒప్పో, వివో వంటివి స్టోర్లను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతం ఇవి ఇ-కామర్స్ మార్గంతో పాటు ఫ్రాంఛైజీ రిటైల్ స్టోర్ల ద్వారా భారత మార్కెట్లో అమ్మకాలు సాగిస్తున్నాయి. కాగా, వచ్చే 4-5 ఏళ్లలో దేశీయ హ్యాండ్ సెట్ మార్కెట్ ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 25 బి. డాలర్ల నుంచి 80 బిలియన్ డాలర్లకు చేరనుందన్న అంచనాలు ఉన్నాయి.

'ఎస్‌బీఆర్‌టీ సంస్కరణలు మార్కెట్‌పై గట్టి ప్రభావాన్ని చూపనున్నాయి. రిటైల్ మొబైల్ హ్యాండ్‌సెట్ మార్కెట్ అంతర్జాతీయ ప్రమాణాలకు చేరుతుంది. ఐకానిక్ స్టోర్ల వల్ల దేశ విలువ కూడా పెరుగుతుంద'ని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్(ఐసీఈఏ) ఛైర్మన్ పంకజ్ మొహింద్రూ పేర్కొన్నారు. స్వీడన్‌కు చెందిన ఫ్యాషన్ రిటైలర్ హెన్స్ అండ్ మారిజ్ సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే దేశానికి చెందిన ఫర్నిచర్ దిగ్గజం ఐకియా సైతం ప్రభుత్వ నిర్ణయం 'ప్రోత్సాహకరం'గా ఉందని పేర్కొంది.

రూ. 2,500 కోట్లు సమీకరిస్తాం: జీఎంఆర్

ఈనాడు, హైదరాబాద్: ఒకేసారి కానీ, రెండు మూడు దఫాలుగా కానీ రూ.2,500 కోట్ల నిధులు సమీకరించాలని జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈక్విటీ షేర్ల జారీ లేదా మరేదైనా మార్గంలో ఈ నిధులు సేకరిస్తారు. దీనికి వచ్చే నెల 16న జరిగే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) లో వాటాదార్ల నుంచి అనుమతి తీసుకుంటారు. ఇదే కాకుండా ఒక్కొక్కటీ రూ.57.42 కోట్ల ముఖ విలువ కల నాలుగు ఓసీడీ (ఆప్షనల్లీ కన్వర్టెడ్ డిబెంచర్) లను జారీ చేయటం ద్వారా రూ.229.68 కోట్లు సమీకరించాలని కూడా కంపెనీ నిర్ణయించింది. ఏజీఎంలో వాటాదార్ల అనుమతి తీసుకున్న తర్వాత ఈ నిధుల సేకరణ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎల్ఐసీ ఎండీ పదవికి ఎంకే గుప్తా, రాజ్ కుమార్ పేర్లు

దిల్లీ: బీమా దిగ్గజం ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవికి ముకేశ్ కుమార్ గుప్తా, రాజ్ కుమార్ పేర్లను బ్యాంక్ బోర్డ్ బ్యూరో (బీబీబీ) సిఫారసు చేసింది. ఇక జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ), అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పదవులకు దేవేశ్ శ్రీవాస్తవ, మలయ్ కుమార్ పొద్దార్ పేర్లను సూచించింది. ఈ పదవులకు ఇంటర్వ్యూలు మంగళవారం జరిగాయి. ఛైర్మన్‌తో పాటు ఎల్ఐసీకి నలుగురు ఎండీలు ఉన్నారు. మే, జులైల్లో బి.వేణుగోపాల్, హేమంత్ భార్గవలు పదవీ విరమణ చేయడంతో రెండు పదవులకు ఖాళీ ఏర్పడింది.

నిఫ్టీ 50లోకి నెస్లే ఇండియా

దిల్లీ: నిఫ్టీ 50 సూచీలో ఇండియాబుల్స్ ఫైనాన్స్ స్థానాన్ని నెస్లే ఇండియా భర్తీ చేయనున్నట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. సెప్టెంబరు 27 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఇక నిఫ్టీ నెక్స్ట్ 50 సూచీల్లోకి ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, బెర్జర్ పెయింట్స్, పీఎఫ్‌సీ, పీఎన్‌బీలు చేరనున్నాయి. ఏబీబీ ఇండియా, బెల్, ఎమ్ఆర్ఎఫ్, సెయిల్ స్థానాలను ఇవి భర్తీ చేస్తాయి.

యెస్ బ్యాంక్ రేటింగ్ తగ్గింపు

ముంబయి: జూన్ 11 నుంచి ఇప్పటి వరకు రెండుసార్లు యెస్ బ్యాంక్ రేటింగ్ తగ్గింపు హెచ్చరికలు చేసిన మూడీస్, తాజాగా భవిష్యత్ అంచనాను 'ప్రతికూలం'గా మార్చింది. ఇటీవల క్యూఐపీ ఇష్యూ నుంచి మూలధన సమీకరణ అంచనాల కంటే తక్కువగా ఉండటం, షేరు క్షీణత వల్ల మరిన్ని నిధులకు అడ్డంకిగా మారొచ్చని మూడీస్ అభిప్రాయపడింది. బ్యాంక్ దీర్ఘకాల విదేశీ కరెన్సీ జారీ రేటింగ్‌ను 'బీఏ1' నుంచి 'బీఏ3'కు మార్చింది. పెట్టుబడుల స్థాయి కంటే ఇది దిగువన ఉన్నట్లు అర్థం.

నీలో వాటా నాకు.. నాలో వాటా నీకు

- సుజుకీ, టయోటా పరస్పర వాటా కొనుగోలు

దిల్లీ: జపాన్ వాహన తయారీ దిగ్గజాలు టయోటా మోటార్ కార్పొరేషన్, సుజుకీ మోటార్ కార్పొరేషన్‌లు తమ మధ్య ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఒక సంస్థలో వాటాను మరోటి కొనేలా ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం.. సుజుకీలో 2.4 కోట్ల షేర్లను 96 బిలియన్ యెన్‌ల(దాదాపు రూ.6,510 కోట్లు)కు టయోటా కొనుగోలు చేయనుంది. మరోవైపు టయోటాలో 48 బిలియన్ యెన్ (దాదాపు రూ.3,255 కోట్లు)లకు సమానమైన షేర్లను సుజుకీ కొనుగోలు చేయనుంది. 2016 అక్టోబరు 12న ఇరు సంస్థలు తమ తొలి వ్యాపార భాగస్వామ్య ఒప్పందాన్ని ప్రకటించాయి. సంయుక్తంగా ఉత్పత్తుల అభివృద్ధి, తయారీ సహకారం, ప్రచారం నిమిత్తం ఈ ఏడాది మార్చిలో కూడా ఇరు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. విద్యుదీకరణ సాంకేతికత టయోటా బలమైతే, కాంపాక్ట్ వాహనాల సాంకేతికతలో సుజుకీకి మంచి పట్టు ఉంది. వాహన రంగానికి ఎదురవుతున్న కొత్త సవాళ్లను అధిగమించి స్థిరమైన వృద్ధి సాధించే ఉద్దేశంతో ఇరు సంస్థలు ఈ మూలధన భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు టయోటా, సుజుకీలు ఓ సంయుక్త ప్రకటనలో తెలియజేశాయి. ఓ పక్క పోటీ సంస్థలుగా కొనసాగుతూనే కొత్త విభాగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోనున్నట్లు తెలిపాయి.

కృత్రిమ మేధలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతాం

- ఆన్‌లైన్ ద్వారా తక్కువ ఫీజుతో శిక్షణ
- రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన ఐఐటీ మద్రాసు అంకురాలు

ఈనాడు, సంగారెడ్డి: భవిష్యత్తులో కృత్రిమ మేధ కీలక భూమిక పోషించనుంది. ఈ రంగంలో నైపుణ్యమున్న వారికి ఆకర్షణీయమైన వేతనాలూ దక్కుతాయి. ప్రస్తుతం దేశంలో నిపుణుల కొరత ఉంది. వచ్చే రోజుల్లో ఈ సంఖ్యను గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ఐఐటీ మద్రాసు, అంకుర సంస్థలు రెండు కలిసి సంయుక్తంగా కార్యాచరణను రూపొందించాయి. 2020 కల్లా లక్ష మందిని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఈ సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు ఐఐటీ మద్రాసు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. అంకుర సంస్థలు గువి, వన్ ఫోర్త్ ల్యాబ్‌లు తక్కువ ఫీజుతోనే ఈ కోర్సును అందుబాటులోకి తెచ్చాయి. ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ చేసుకొని ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవచ్చు. 6 నెలల పాటు నాలుగు దశల్లో మొత్తం 15 కోర్సులను పూర్తి చేసేలా దీనిని రూపొందించారు. విద్యార్థులయితే రూ.1000, ఉద్యోగులయితే రూ.5000 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు www.guvi.in/dl ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన కోర్సుకు మంచి స్పందన లభించిందని, దేశవ్యాప్తంగా ఉన్న వారికి ఈ కోర్సులను అందుబాటులోకి తేవాలన్నదే తమ ఉద్దేశమని వన్ ఫోర్త్ ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ మితేష్ ఖాప్రా వివరించారు. ఆన్‌లైన్ ద్వారా అందించడం వల్ల ఎక్కడ నుంచైనా నేర్చుకునే వెసులుబాటు కలగడంతో పాటు ఖర్చు తగ్గుతుందని డాక్టర్ ప్రత్యూష్ కుమార్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొందరు త్వరగా తెలుసుకుంటారు. మరికొందరు నేర్చుకోవడంలో కొంత ఆలస్యమవుతుంది. అందుకే వ్యక్తిగత సామర్థ్యాలను బట్టి ఒక్కొక్కరికి ఒక్కోలా ఈ కోర్సులను నేర్పేలా వీరు జాగ్రత్త తీసుకోవడం విశేషం. ప్రతి దశ పూర్తి కాగానే సర్టిఫికెట్ కూడా అందించనున్నారు.

ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ బ్యాంక్ సీఈఓగా హైదరాబాద్ వాసి

హైదరాబాద్ (చంచల్‌గూడ), న్యూస్‌టుడే: ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా హైదరాబాద్ పాతబస్తీ చంచల్‌గూడ నివాసి హఫీజ్ సయ్యద్ మూసా కలీం ఫలాహి ఎంపికయ్యారు. జమాతే ఇస్లామి హింద్ పూర్వ కార్యదర్శిగా ఉన్న మౌలానా సయ్యద్ యూసఫ్ కుమారుడైన మూసా కలీంకు ఇస్లామిక్ బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. గతంలో ఖతర్, దుబాయ్, నూర్ ఇస్లామిక్ బ్యాంకుల్లో అత్యున్నత హోదాల్లో ఈయన విధులు నిర్వహించారు. దుబాయ్, నూర్ ఇస్లామిక్ బ్యాంక్ సంస్థల్లో 11 ఏళ్ల పాటు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇస్లామిక్ బ్యాంకింగ్ రంగాల్లో ఆర్థిక నిపుణుడిగా ప్రసిద్ధి చెందారు. ప్రస్తుతం ఈ బ్యాంక్ ఆఫ్ఘనిస్తాన్ దేశవ్యాప్తంగా 58 శాఖల్లో లావాదేవీలు జరుపుతోంది.

కిమ్స్ సీఈఓగా అభినయ్

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా డాక్టర్ బి.అభినయ్ నియమితులయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 9 ఆసుపత్రులను కిమ్స్ నిర్వహిస్తోంది. అభినయ్ ఇప్పటి వరకూ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలను అందించారు. కొండాపూర్‌లో 200 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడం, విశాఖపట్నం, అనంతపురం, ఒంగోలులలో అక్కడ ఉన్న ఆసుపత్రులతో భాగస్వామ్యం కుదుర్చుకొని, సంస్థను విస్తరించడంలో ఆయన కీలకంగా పని చేశారు. ఈ సందర్భంగా కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. కొత్త సీఈఓ ఆధ్వర్యంలో సంస్థ మరింత విస్తరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇండోర్, భువనేశ్వర్, గువహాటిలలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కొత్త ప్రాంతాలకు విస్తరించడంతోపాటు, అధునాతన సాంకేతికతలను తీసుకురావడం ద్వారా మరింత మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని అభినయ్ తెలిపారు.

లక్స్, లైఫ్‌బాయ్ ధరలు తగ్గాయ్

దిల్లీ: అగ్రగామి సబ్బు తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నాయి. అమ్మకాలు తగ్గడంతో వాటిని మళ్లీ పెంచుకోవడంలో భాగంగా ధరల కోతకు మొగ్గుచూపుతున్నాయి. పామాయిల్ ధరలు తగ్గడం కూడా ఇందుకు ఒక కారణం. హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్ యూఎల్) ప్రముఖ సబ్బు బ్రాండ్లు లక్స్, లైఫ్‌బాయ్, డవ్ ధరలను ఇప్పటికే తగ్గించింది. సంతూర్ సబ్బులను తయారు చేసే విప్రో కన్జూమర్ కేర్ కూడా ధరలు తగ్గించడం గమనార్హం. 'ముడి వస్తువుల ధరలు కొంత కాలంగా స్థిరంగా ఉండటంతో లక్స్, లైఫ్‌బాయ్ ధరలను 4-6 శాతం మేర తగ్గించాం. వినియోగదారులకు ప్రయోజనాలు బదలాయించడం కోసం కొన్ని ప్యాక్‌లపై ఇంకా ఎక్కువ కోత విధించాం' అని హెచ్ యూఎల్ తెలిపింది. ముడివస్తువుల ధరలు తగ్గడంతో సబ్బు ధరల కోత విధించామని, ఇది వినియోగం పెరగడానికి దోహదపడుతుందని విప్రో కన్జూమర్ కేర్ అధ్యక్షుడు అనిల్ ఛుగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతుల కోసం రూ.34 కోట్లు

వాల్‌మార్ట్ ఫౌండేషన్ గ్రాంటు

ఈనాడు, హైదరాబాద్: రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంతోపాటు, అధునాతన వ్యవసాయ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చేందుకు వాల్‌మార్ట్ ఫౌండేషన్ రూ.34 కోట్లను గ్రాంటుగా ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని దాదాపు 81,000 మంది రైతులకు దీనివల్ల ప్రయోజనం కలగనుంది. ఇందులో దాదాపు 29,030 మంది మహిళా రైతులూ ఉన్నారు. దేశంలో రైతుల పరిస్థితిని మెరుగుపరిచ్చి, వారికి ఆదాయం పెంచే చర్యల్లో భాగంగా గత ఏడాది సెప్టెంబరులో వాల్‌మార్ట్ 2023 నాటికి రూ.180 కోట్ల మేరకు (25 మిలియన్ డాలర్లు) ఖర్చు చేస్తామని ప్రకటించింది. దీంతోపాటు తమ విక్రయ కేంద్రాల్లోని వస్తువుల్లో 25శాతం వరకూ రైతుల నుంచి నేరుగా కొంటామని ప్రకటించింది. ఈ 25 మిలియన్ డాలర్లలో తొలివిడత, ఇప్పుడు కలిపి 10 మిలియన్ డాలర్లను ఇచ్చినట్లయ్యిందని వాల్‌మార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

విపణిలోకి రెనో ట్రైబర్

ధరల శ్రేణి రూ.4.95-6.49 లక్షలు

దిల్లీ: వచ్చే మూడేళ్లలో అమ్మకాలను రెట్టింపు చేసుకునే దిశగా ఫ్రెంచ్ వాహన దిగ్గజం రెనో అడుగులు వేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ, చిన్న పట్టణాల్లో అమ్మకాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం భారత్‌లో ఏటా దాదాపు 80,000 వాహనాలను రెనో విక్రయిస్తోంది. ఈ సంఖ్యను రాబోయే మూడేళ్లలో 2 లక్షలకు పెంచుకోవాలని యోచిస్తోంది. కొత్త మోడళ్లు విడుదల, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలను పెంచుకోవడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని అనుకుంటోంది. ఈ ప్రణాళికలో భాగంగానే బహుళ ప్రయోజిత వాహనం ట్రైబర్‌ను బుధవారం విడుదల చేసింది. ధర రూ.4.95 లక్షల నుంచి రూ.6.49 లక్షల మధ్య ఉండనుంది. 1 లీటర్ పెట్రోలు ఇంజిన్‌తో కూడిన ఈ వాహనంలో ఏడు సీట్లు, నాలుగు ఎయిర్ బ్యాగ్‌లు ఉంటాయి. '2022 వరకు ఏటా ఒక కొత్త మోడల్‌ను భారత్ విపణిలోకి విడుదల చేయనున్నామ'ని రెనో ఇండియా సీఈఓ, ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లె తెలిపారు.

లాభాల పరుగుకు విరామం

- మళ్లీ మాంద్యం భయాలు
- తోడైన రూపాయి బలహీనతలు

సమీక్ష

మూడు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. అమెరికాలో మాంద్యం రావొచ్చన్న భయాలతో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 29 పైసలు తగ్గి 71.77 వద్ద ముగిసింది. ఇటీవల పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణ సైతం ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలతో ఎఫ్‌పీఐలు నికర విక్రేతలుగా నిలిచారు. ఆసియా మార్కెట్లల్లో.. షాంఘై, హాంగ్‌సెంగ్‌లు నష్టాల్లో, కోస్పి, నిక్కీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 37,655.77 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. అనంతరం అదే జోరులో 37,687.82 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. మళ్లీ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 37,249.19 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్.. చివరకు 189.43 పాయింట్ల నష్టంతో 37,451.84 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 59.25 పాయింట్లు కోల్పోయి 11,046.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,987.65- 11,129.65 పాయింట్ల మధ్య కదలాడింది.

- మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ రేటింగ్ తగ్గించడంతో యెస్ బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 9.72 శాతం కుప్పకూలిన షేరు రూ.58.05 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 7.47 శాతం నష్టంతో రూ.59.50 దగ్గర స్థిరపడింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.1,223.66 కోట్లు తగ్గి రూ.15,174.34 కోట్లకు చేరింది.
- కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ లేఖ వెలుగుచూసిన తర్వాత.. పలువురు ఆర్‌బీఎల్ బ్యాంక్ అధికారులు తమ షేర్లను విక్రయించారన్న వార్తలు వెలువడ్డాయి. సిద్ధార్థకు చెందిన పలు కంపెనీలకు ఆర్‌బీఎల్ బ్యాంక్ రుణాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ షేరు ఇంట్రాడేలో రూ.291.90 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 12.09 శాతం నష్టంతో రూ.313.65 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 7.47%, వేదాంతా 4.06%, టాటా స్టీల్ 4.02%, ఓఎన్‌జీసీ 3.62%, టాటా మోటార్స్ 3.28%, మారుత

నష్టాలు ఎదురైనప్పుడు తట్టుకొనే విధంగా ఆర్‌బీఐ వద్ద తగినంత నిల్వ లుండాలి. ప్రతికూల పరిస్థితుల ప్రభావాల నుంచి మన ఆర్థిక వ్యవస్థ తట్టుకునే పరిమాణంలో ఈ నిల్వలుండాలి కానీ భారీమొత్తం అదనంగా అవసరం లేదు. బ్యాలెన్స్‌షీట్‌లో 5.5-6.5 శాతం మేర ఈ నిల్వలుంటే సరిపోతుందని సిఫారసు చేస్తున్నాం.

– బిమల్ జలాన్

రెండు రోజులు వెనక్కి వెళ్తే... ఓ పెద్ద వార్త.. రూ.1.76 లక్షల కోట్లు... ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి బదిలీ కాబోతున్నాయంటూ.. ఇంత పెద్ద మొత్తం ప్రభుత్వం చేతికి వస్తే ఏం జరుగుతుంది...? ఆ డబ్బుతో ప్రభుత్వం ఏం చేస్తుంది...? అసలు ఈ సొమ్ములన్నీ నిజంగానే బదిలీ అవుతాయా..? అంకెల గారడీయా..? గతంలో ఇలా బదిలీ చేసిన సందర్భాలు ఉన్నాయా..? భవిష్యత్తులో కూడా ఇలాగే సొమ్ములు అందుతూ ఉంటాయా..? ఇది ఈ ఒక్కసారికే పరిమితమా...? ఇతర దేశాల్లో పరిస్థితి ఏమిటి...? అక్కడి కేంద్ర బ్యాంకులు కూడా ప్రభుత్వాలకు ఇలాగే నిధులు అందిస్తూ ఉంటాయా..? తరచి చూస్తే ఎన్నో ప్రశ్నలు... వీటిని విశ్లేషించే ప్రయత్నమే ఈ కథనం...

ఈనాడు బిజినెస్

ఎందుకు వినియోగించొచ్చు

- ద్రవ్యలోటు లక్ష్యమైన 3.3 శాతానికి కట్టుబడి ఉండేందుకు
- నగదు లభ్యత సమస్యలకు పరిష్కారం చూపేందుకు..
- బ్యాంకులు అదనపు మూలధనం సమకూర్చేందుకు...
- పన్ను వసూళ్లు బలహీనపడుతున్నందున లోటు పూడ్చుకునేందుకు.. ప్రభుత్వం ఈ నిధులు వినియోగించుకోవచ్చు.

అదనం రూ.58,000 కోట్లు

ఆర్‌బీఐ బదిలీ చేసేందుకు అంగీకరించిన మొత్తం..	రూ.1,76,051 కోట్లు
2019-20 బడ్జెట్‌లో ప్రభుత్వం ఆశించిన డివిడెండ్..	రూ.90,000 కోట్లు
ప్రభుత్వానికి అదనంగా సమకూరే మొత్తం..	రూ.86,051 కోట్లు
ఇప్పటికే ఆర్‌బీఐ అందించిన మధ్యంతర డివిడెండ్ ...	రూ.28,000 కోట్లు
ప్రభుత్వానికి చేరే అదనపు కేటాయింపులు ..	రూ.58,051 కోట్లు

ఈ సొమ్ము జీడీపీలో 0.3 శాతానికి సమానం.

ఆర్‌బీఐ

1.76

లక్షల కోట్లు

ప్రభుత్వం

ఈ డబ్బులెటు వెళ్తాయ్..

ఆయా సంవత్సరాలకు ప్రభుత్వానికి ఆర్‌బీఐ నిధుల బదిలీ (రూ.కోట్లలో)

2012-13	: 33,010
2013-14	: 52,679
2014-15	: 65,896
2015-16	: 65,876
2016-17	: 30,659
2017-18	: 50,000
2018-19	:1,76,051



ఏ సంస్థ అయినా ఒక ఆర్థిక సంవత్సరంలో తాను ఆర్జించిన లాభాల్లో కొంతమేర డివిడెండ్‌గా వాటాదారులకు పంచి, మిగిలిన మొత్తాన్ని మూలధన నిల్వగా (క్యాపిటల్ రిజర్వ్) తనతో అట్టే పెట్టుకుంటుంది. ఈ సొమ్ము ఏదైనా అత్యవసర సమయాల్లో ఉపయోగపడుతుంది. పైగా చేతిలో సొమ్ము ఉంటే ఆ భరోసానే వేరు. అందుకే లాభాల్లో ఉండే కంపెనీలకు ఏటేటా మిగిలిన సొమ్ముతో మూలధన నిల్వలు పెరుగుతుంటాయి. ఫలితంగా కొన్నేళ్లకు అటువంటి సంస్థల ఈక్విటీ వాటాల ముఖ విలువ కంటే పుస్తక విలువ (మూలధనం+ మూలధన నిల్వలు కలిసి. ..) ఎక్కువగా ఉంటుంది.

.. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా ఇదే చేస్తుంటుంది. ఏటా వచ్చే లాభాల్లో కొంత వాటాను డివిడెండుగా తన యజమాని అయిన ప్రభుత్వానికి కేటాయించి, మిగిలిన మొత్తాన్ని మిగులు నిధుల కింద ఉంచుతుంది. ఆర్‌బీఐ వద్ద మూలధన నిల్వలు ఎంతమేర ఉంచుకోవచ్చనే విషయమై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచన మేరకు రూ.1.76 లక్షల కోట్లు బదిలీ చేసేందుకు ఆర్‌బీఐ బోర్డు అంగీకరించింది. నిధులు బదిలీ అయితే బడ్జెట్, బడ్జెటేతర వ్యయాలకు ఆ మొత్తాన్ని సర్దుబాటు చేసే వీలు ప్రభుత్వానికి కలుగుతుంది.

.. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించిన పరిస్థితుల్లో భారీమొత్తం నిధుల బదిలీ వల్ల ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని కొందరు నిపుణులు పేర్కొంటున్నారు. అయితే క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక సంక్షోభాలు ఎదురైనపుడు మిగులు నిల్వలు లేకపోతే ఎలా అని ఆర్‌బీఐ, బ్యాంకుల ఉద్యోగుల సంఘాలు, మరికొందరు నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

ప్రపంచ దేశాలతో పాటు మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నెమ్మదిస్తున్న పరిస్థితుల్లో ఆర్‌బీఐ నుంచి భారీగా అందనున్న నిధులు ప్రభుత్వానికి ఊరట కలిగిస్తాయని చెబుతున్నారు. ఆర్‌బీఐ బోర్డు ఆమోదించిన ప్రకారం డివిడెండ్‌గా రూ.1,23,414 కోట్లు, ఒకసారి చెల్లించే అదనపు కేటాయింపుల కింద మరో రూ.52,637 కోట్లు కలిపి మొత్తం రూ.1,76,051 కోట్లు ఖజానాకు చేరనున్నాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తొలగేందుకు ఇది తోడ్పడవచ్చు.

ఎలా సాధ్యమవుతోంది?

సవరించిన ఆర్థిక మూలధన నిబంధనావళి (ఈసీఎఫ్) ప్రకారం..ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్‌లో 24.5-20 శాతం మేర నిధులను డివిడెండ్/మిగులు కింద బదిలీ చేయొచ్చు. 2019 జూన్ 30 నాటి ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ ప్రకారం 23.3 శాతాన్ని డివిడెండ్‌గా బదిలీ చేయాలని నిర్ణయించారు. 2018-19 ఆర్థిక సంవత్సరం (జులై-జూన్)లో ఆర్‌బీఐ నికర ఆదాయం రూ.1,23,414 కోట్లు ఇలా బదిలీ చేస్తున్నారు. 2017-18లో ఆర్‌బీఐ నికర ఆదాయం రూ.50,000 కోట్లు మాత్రమే. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐకి ఇంతటి అధిక ఆదాయం ఎలా వచ్చిందనే విషయమై ఇంకా అధికారికంగా బయటకు రాలేదు. అయితే ఓపెన్ మార్కెట్ కార్యకలాపాల ద్వారా ఈ మొత్తం సమకూరిందని చెబుతున్నారు.

ఏమి జరగనుంది?

ప్రభుత్వం ఈ నిధులు ఎంత సమర్థంగా వినియోగిస్తుంది అనే దానిపై ఆధారపడి, ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనాలుంటాయి. నిధుల లభ్యత, రుణ మంజూరు తగ్గినందున, ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తోంది. ముఖ్యంగా ఏదైనా ఖర్చు చేయాలంటే, వినియోగదారులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటున్నారు. పలు సంస్థలు ఉద్యోగులను తొలగిస్తుండటం, చిన్నపాటి ఉపాధి కూడా కష్టమవుతున్నందున, ఆర్థిక పరమైన విశ్వాసం లోపించడమే ఈ పరిస్థితికి కారణం. రుణ లభ్యత తగ్గినందున, ప్రైవేటు రంగ పెట్టుబడులూ పరిమితమవుతున్నాయి. 2013 నాటి ఆర్థిక మందగమనం, 2016 నవంబరులో పెద్దనోట్ల రద్దు వల్ల ఏర్పడిన పరిణామాల వృద్ధి నెమ్మదించడం కంటే మరింత దుర్భరంగా ప్రస్తుత పరిణామాలున్నాయని చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఏం జరుగుతోంది?

- అమెరికా ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, జెర్మన్ బుండెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ కూడా తమ దేశ చట్టాలను అనుసరించి, లాభాలను ప్రభుత్వానికి బదిలీ చేస్తుంటాయి. ఎంతమేర లాభాన్ని లేదా లాభాల్లో వాటాను పంపిణీ చేయాలో ఆ దేశ చట్టాల్లో ఉంది.
- అమెరికా ఫెడ్ 2015లో 100.2 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆర్జిస్తే, అందులో 97.7 బిలియన్ డాలర్లను ప్రభుత్వానికి బదిలీ చేసింది.
- బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ తమ లాభాల నుంచి 5.5 బిలియన్ పౌండ్ల క్యాపిటల్ రిజర్వ్ ఏర్పాటు చేసుకోవచ్చు. అంతకుమించి ఆర్జించిన మొత్తాన్ని ప్రభుత్వానికి బదిలీ చేస్తుంది.
- జపాన్‌లో ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన 2 నెలల్లోపు, తన నికర లాభాన్ని ప్రభుత్వ ఖజానాకు బదిలీ చేస్తుంది. సాధారణ ఖాతా వ్యయాల కింద ఈ మొత్తాన్ని ప్రజల కోసం ప్రభుత్వం వెచ్చిస్తుంది.
- అర్జెంటీనా ప్రభుత్వం 2009 నుంచి ఆ దేశ కేంద్రబ్యాంకు వ్యవహారాల్లో తలదూర్చి, మిగులు నిధులను బదిలీ చేయమని ఆదేశించింది. తదుపరి అంతర్జాతీయ రుణాలను 7 సార్లు, దేశీయ రుణాలను 5 సార్లు చెల్లించలేక, ఆదేశ ప్రభుత్వం చేతులెత్తేసింది. భారత్‌కు ఎప్పుడూ ఆ పరిస్థితి తలెత్తకపోడానికి సంపృద్ధిగా ఉన్న మిగులు నిల్వలే కారణమని, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా చేసిన విరాల్ ఆచార్య పేర్కొన్నారు.

ఇది అప్పు కాదు

ఆర్‌బీఐ ప్రైవేటు కంపెనీ కాదు. అందువల్ల తన యజమాని అయిన 'సార్వభౌమ ప్రభుత్వానికి' బదిలీ చేసే లాభాల నిధులను డివిడెండ్‌గా పేర్కొనకూడదు. మిగులు నిధులుగానే వ్యవహరించాలి. అయితే సాధారణ వాడుకలో డివిడెండ్‌గానే పిలుస్తున్నారు. డివిడెండ్ మాదిరే ఈ మొత్తాన్ని ప్రభుత్వం వినియోగించుకుంటుంది. మళ్లీ ఆర్‌బీఐకి చెల్లించాల్సిన పని లేదు.

ఈ పరిస్థితి మారాలంటే..

- తక్కువ వ్యయానికి రుణాలు విరివిగా అందాలి. ఇందుకోసమే గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు ఆర్‌బీఐ 110 బేసిస్ పాయింట్లు (1.1 శాతం) మేర కీలకరేట్లను తగ్గించింది. వ్యవస్థలోకి నిధులు చొప్పించడం ద్వారా, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి రుణాలు విరివిగా ఇప్పించేందుకు ప్రయత్నించవచ్చు.
- ప్రభుత్వం వ్యయాలు పెంచొచ్చు. ఇందువల్ల ప్రజల వద్దకు నిధులు చేరి, వినియోగం తద్వారా వృద్ధి పెరుగుతుంది. అదే సమయంలో పెరిగిన గిరాకీకి అనుగుణంగా, ద్రవ్యోల్బణం ఎగబాకొచ్చు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనంతరం, 2009లో ప్రభుత్వం ఉద్దీపనల కోసం 6.5 బిలియన్ డాలర్లు (ప్రస్తుత డాలర్ మారకపు విలువతో లెక్కిస్తే సుమారు రూ.46,800 కోట్లు) వెచ్చించింది. 2008 జీడీపీలో 0.5 శాతానికి సమానమని అంతర్జాతీయ ద్రవ్య నిధి పేర్కొంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు తగ్గే అవకాశం ఉన్నందున, ద్రవ్యలోటు (వ్యయాలు, ఆదాయం మధ్య తేడా) లక్ష్యానికి కట్టుబడి ఉండేందుకు ఈ నిధులను వినియోగించుకోవాలంటే మాత్రం, వ్యయాలు పెంచకపోవచ్చు.
- ఏదేమైనా అదనంగా రుణాలు చేసే పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని ఆర్‌బీఐ గట్టెక్కించినట్లే. అందువల్ల ప్రభుత్వ బాండ్లపై రాబడులు తగ్గుతాయి. భారీమొత్తం రుణాలిచ్చే ఎన్‌బీఎఫ్‌సీలకు ఈ పరిణామం ఉపకరిస్తుంది. రేటింగ్ బాగున్న అగ్రశ్రేణి సంస్థలకు తక్కువ వ్యయానికే నిధుల లభ్యత పెరిగి, మరింతగా వినియోగదార్లకు రుణాలివ్వగలుగుతాయి. అందువల్లే ఆర్థిక సంస్థల స్టాక్స్ లాభపడుతున్నాయి.

ఆందోళన చెందుతున్నవారు ఏమంటున్నారు?

ఆర్థిక అంశాల్లో ఆర్‌బీఐ స్వతంత్రత పోయి, ప్రభుత్వం కోరిన విధంగా నిధులు బదిలీ చేస్తోందని, ఇందువల్ల సంక్షోభ సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌బీఐ పూర్వ గవర్నర్లు రఘురాం రాజన్, ఉర్జిత్ పటేల్, ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య, ఈ విషయంలో ప్రభుత్వంతో విబేధించినట్లు, తత్ఫలితంగా వారు తమ పదవుల నుంచి తప్పుకున్నట్లు ప్రచారం కావటం తెలిసిందే. మరోపక్క ఈ విషయంలో తొందరపాటు తగదని, సంబంధిత అన్ని వర్గాలను సంప్రదించి ఏకాభిప్రాయాన్ని సాధించిన తర్వాతే తుది నిర్ణయానికి రావాలని అఖిల భారత రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) పేర్కొన్నాయి. ఆర్థిక స్థిరత్వానికి భంగం వాటిల్లుతుందేమోననే విషయాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని ఈ సంఘాలు కోరాయి.

అదనపు నిధులు ..

ఆర్‌బీఐ వ్యయాల తరవాత, కొంతభాగాన్ని అత్యవసర నిధికి జమచేస్తుంది. మిగిలిన నిధులను ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో బదిలీ చేస్తుంటుంది. అత్యవసరమైతే ప్రభుత్వ సూచన మేరకు మధ్యంతర డివిడెండ్ కూడా ఇస్తోంది. గత 8 సంవత్సరాలుగా ఆర్‌బీఐ బ్యాలెన్స్‌షీట్ 10-11 శాతం వార్షిక వృద్ధిని సాధిస్తోంది.

- **అత్యవసర నిధి:** అత్యవసర నిధి కోసం 2012-13 వరకు ఆర్‌బీఐ కేటాయింపులు చేసింది. 2010-11, 2012-13 సంవత్సరాల మధ్య అయితే ఏకంగా ఆర్‌బీఐ తమ స్థూల లాభాల్లో 32-45 శాతాన్ని జమచేసింది. అందువల్ల ఆర్‌బీఐ మొత్తం ఆస్తుల్లో అత్యవసర నిధి వాటా 9-10 శాతానికి చేరింది. 2013-14 నుంచి 2015-16 వరకు ఈ విధానం మార్చేసి, మిగులు నిధులను ప్రభుత్వానికి బదలాయించారు. మళ్లీ 2016-17 నుంచి సీఎఫ్‌కు బ్యాలెన్స్ షీట్‌లో 6.8 శాతం కేటాయించడం ప్రారంభించారు. దీన్ని 6.5-5.5 శాతం చేయమని జలాన్ కమిటీ సూచించింది. ఆర్‌బీఐ బోర్డు 5.5 శాతం ఉంచాలని నిర్ణయించి, ఇంతకు మించి అదనంగా ఉన్న రూ.52,637 కోట్లు ప్రభుత్వానికి బదిలీ చేయనుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం / ఈనాడు హైదరాబాద్

ఆర్‌బీఐని బలహీనపరచడమే

ఈపీఎస్ శర్మ
ఐఏఎస్
ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి

మన దేశంలో ఎటువంటి ఆర్థిక సమస్యలు తలెత్తకుండా ముందుచూపుతో వ్యవహరిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకునే గురుతరమైన బాధ్యత రిజర్వు బ్యాంకు మీద ఉంది. వ్యాపార, ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల ద్వారా వ్యాపార సంస్థలకు రుణాలు లభించే చర్యలు తీసుకోవటం, మరోపక్క వడ్డీ రేట్లను నిర్ణయించటం, నగదు లభ్యత సజావుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవటం, ధరలు పెరగకుండా నియంత్రించటం రిజర్వు బ్యాంకు ప్రధానమైన విధులు. తద్వారా ఈ సంస్థ ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తోందనేది తెలిసిపోతోంది. ఇంతటి ప్రాధాన్యం కల సంస్థ తన విధులు సక్రమంగా నిర్వర్తించాలంటే దాని చేతిలో తగినంతగా నిధులు ఉండాలి.

ఇదేకాకుండా రిజర్వు బ్యాంకు మరికొన్ని ముఖ్యమైన బాధ్యతలు కూడా నిర్వర్తిస్తోంది. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను పర్యవేక్షించటం, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు అనుగుణంగా రుణాలు సేకరించటం... ఇందులో ముఖ్యమైనవి.

విదేశీ వర్తకంలో దేశానికి మేలు జరగాలంటే రూపాయి మారక విలువ మీద కొంతవరకూ నియంత్రణ ఉండాలి. ఈ పని రిజర్వు బ్యాంకు చేస్తుంది. మనకు విదేశాల్లో కొన్ని పెట్టుబడులు ఉంటాయి. ఆ పెట్టుబడులను పర్యవేక్షించే పని రిజర్వు బ్యాంకు చేస్తుంది. విదేశీ మారక ద్రవ్య రేట్లు మనకు అనుకూలంగా లేనప్పుడు విదేశీ ద్రవ్యాన్ని అమ్మే బాధ్యత, విదేశీ మారక ద్రవ్యం బలపడి మన ఎగుమతులకు నష్టం కలిగే పరిస్థితి ఉండే విదేశీ మారక ద్రవ్యాన్ని కొనే బాధ్యత కూడా రిజర్వు బ్యాంకుదే. ఈ క్రమంలో లాభనష్టాలు ఉంటాయి. దాన్ని రిజర్వు బ్యాంకు భరించాలి. ఎప్పుడు నష్టాలు వస్తాయో చెప్పలేం. కొన్నిసార్లు లాభాలు రావచ్చు. కానీ నష్టభయం ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి నష్టాలను తట్టుకోవాలంటే కూడా ఈ సంస్థ వద్ద తగినంతగా మిగులు నిధులు ఉండాలి. లేనిపక్షంలో రిజర్వు బ్యాంకు సమర్థంగా వ్యవహరించలేకపోతుంది.

రిజర్వు బ్యాంకుకు ఏటా వచ్చే ఆదాయం నిజమైన ఆదాయం కాదు. అందులో చాలా వరకూ విదేశీ మారక ద్రవ్యం విలువలో హెచ్చుతగ్గుల వల్ల వచ్చే ఆదాయం ఉంటుంది. అటువంటి ఆదాయాన్ని మిగులు సొమ్ముగా భావిస్తూ కేంద్ర ప్రభుత్వానికి మళ్లించటం సరికాదు. ఏటా రిజర్వు బ్యాంకు డివిడెండు రూపంలో కేంద్ర ప్రభుత్వానికి పెద్దమొత్తంలో నిధులు ఇస్తుంది. అదికాకుండా మిగులు నిధులను ఆర్‌బీఐ నుంచి కేంద్ర ప్రభుత్వానికి బదలాయించటం వల్ల కొన్ని సమస్యలు ఎదురవుతాయి.

- రిజర్వు బ్యాంకు ఆర్థికంగా బలహీనపడి దేశ ఆర్థిక పరిస్థితిలో కానీ, అంతర్జాతీయంగా క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు కానీ సమర్థంగా ఎదుర్కొనలేదు. అంతర్జాతీయ సంస్థలు మనదేశం 'రేటింగ్'ను తగ్గించే పరిస్థితి రావచ్చు.
- ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి లభిస్తున్న సమాచారం ప్రకారం గత రెండేళ్లుగా ప్రభుత్వానికి తగినంతగా పన్ను ఆదాయం లేక బడ్జెట్‌లో ఆదాయానికి మించి ఖర్చు ఉండటం వల్ల ప్రభుత్వానికి అప్పుల భారం పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ నుంచి మిగులు నిధులు తీసుకుంటే ఆ సొమ్ము ప్రభుత్వం అప్పులు తీర్చుకోవటానికి ఉపయోగపడుతుందే కానీ అభివృద్ధికి దోహదపడే పెట్టుబడులుగా మారవు.
- బాధ్యతతో వ్యవహరించే ఏ ప్రభుత్వం అయినా రిజర్వు బ్యాంకు నుంచి నిధులు తీసుకునే బదులు దుబారా ఖర్చులు తగ్గించేందుకు, ప్రభుత్వ బ్యాంకుల పాలనా వ్యవహారాలను చక్కదిద్దేందుకు, ఇతర ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రయత్నించాలి.
- రిజర్వు బ్యాంకును ఒక పరాయి వ్యవస్థగా భావించి ఆ సంస్థ నుంచి నిధులు తీసుకోవటం అంటే... ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించటం లేదనే. అంతర్జాతీయ ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం వచ్చే మూడు నుంచి నాలుగేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రంగంలో పెనుసవాళ్లు రాబోతున్నాయి. అటువంటి నేపథ్యంలో రిజర్వు బ్యాంకును బలోపేతం చేయాల్సింది పోయి... దాని నుంచి నిధులు బదలాయించుకోవటం సరైన విధానం కాదు.

ఒక్కసారి అయితే ఓకే

సతీష్ కంతేటి
సంయుక్త ఎండీ
జెన్ సెక్యూరిటీస్

"రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి కేంద్రానికి బదిలీ అవుతున్న దాదాపు రూ.1.76 లక్షల కోట్లలో మొత్తం మిగులు నిధులే లేవు. అందులో ఇప్పటికే ప్రభుత్వానికి చెల్లించిన రూ.28,000 కోట్ల మధ్యంతర డివిడెండ్ ఉంది. ఇక మిగిలింది రూ.1.48 లక్షల కోట్లు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రిజర్వు బ్యాంకు నుంచి రూ.90,000 కోట్లు రానున్నట్లు లెక్క చెప్పింది. దీన్ని కూడా మినహాయిస్తే ఇక మిగిలింది రూ.58,000 కోట్లు. వాస్తవానికి ఆర్‌బీఐ నుంచి అదనంగా ప్రభుత్వం తీసుకుంటున్న సొమ్ము ఇదే. దాన్ని కూడా ఆర్‌బీఐ 'కంటింజెన్సీ నిధుల' నుంచి తీసుకుంటున్నారు. రీ-వాల్యూయేషన్ రిజర్వును ముట్టుకోవటం లేదు. ఒకందుకు ఇది పర్వాలేదు. బిమల్ జలాన్ కమిటీ మధ్యేమార్గాన్ని అనుసరించినట్లుగా ఉంది. అటు ప్రభుత్వాన్ని, ఇటు ఆర్‌బీఐని కష్టపెట్టకుండా ఇరుపక్షాలను సంతృప్తిపరచినట్లుగా కనిపిస్తోంది. సాధారణంగా ఆర్‌బీఐ ఆర్థికంగా బలంగా ఉండే మాంద్య పరిస్థితులు వచ్చినప్పుడు, కరెన్సీ విలువ క్షీణించినప్పుడు తట్టుకోవటానికి అవకాశం ఉంటుంది. తన వద్ద మిగులు నిధులతో ఆర్థిక వ్యవస్థను కాపాడగలుగుతుంది. కానీ మిగులు నిధులను ఖాళీ చేస్తే అటువంటి మద్దతు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది. రీ-వాల్యూయేషన్ రిజర్వు జోలికి వెళ్లకుండా. .. ఒక దఫా మాత్రమే (వన్ టైమ్) కంటిజెన్సీ నిధులను తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదు. ప్రతిసారి ఏదో ఒక సందర్భంలో నిధులు తీసుకుంటూ... ఆర్‌బీఐని ఖాళీచేస్తే మాత్రం ఇబ్బందే. అలా చేయరనే అనుకుంటున్నాం. మొత్తంగా ఉన్న నిధులు అన్నీ తీసుకోవటం లేదు కాబట్టి ప్రస్తుతానికి ఎటువంటి సమస్య ఉండకపోవచ్చు.

ఆర్‌బీఐ నుంచి లభించిన నిధులతో కేంద్ర ప్రభుత్వానికి కొంత లోటు భారం తగ్గుతుంది. ఇది ఒక సానుకూలమైన పరిణామం. తగినంతగా నిధుల లభ్యత లేకపోతే ప్రభుత్వం బహిరంగా మార్కెట్లో అధికంగా అప్పులు చేయాల్సి వస్తుంది. దీనివల్ల బాండ్లపై వడ్డీరేట్లు పెరుగుతాయి. ఇప్పుడు ఆ అవసరం లేదు. కాబట్టి వడ్డీరేట్లు దిగివస్తాయి. తక్కువ వడ్డీరేట్లు ఉండి, రుణలభ్యత సులువవుతుంది. అంతేగాకుండా ఆర్థికంగా కుంగిపోతున్న వ్యాపార రంగాలను గుర్తించి ఏదైనా 'ఆర్థిక ప్యాకేజీ' ప్రకటించటానికి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఉంది. ఆర్‌బీఐ నుంచి నిధులు రాని పక్షంలో అటువంటి ప్యాకేజీలు ప్రకటించే అవకాశం ఎంతమాత్రం ఉండదు."

ఫోరెన్సిక్ ఆధారాలు తప్పనిసరి

- అప్పుడే నేరస్థులు తప్పించుకునే అవకాశం ఉండదు
- క్రిమినల్ కేసుల్లో దోష నిర్ధరణ రేటు అత్యల్పం
- పోలీస్ సంస్కరణలు తీసుకొద్దాం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

దిల్లీ: దేశంలో క్రిమినల్ కేసుల్లో దోష నిర్ధరణ రేటు అత్యంత తక్కువగా ఉండడంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆందోళన వ్యక్తం చేశారు. అనుమానితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఫోన్ ట్యాపింగ్ వంటి కాలం చెల్లిన పోలీసు పద్ధతులతో నేరాలను అరికట్టడంలో ఆశించిన ఫలితాలు నెరవేరడం లేదన్నారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, ప్రపంచంలో అగ్రశ్రేణి 3 ఆర్థిక వ్యవస్థల సరసన నిలపాలన్న ప్రధాని నరేంద్రమోదీ కలసాకారం కావాలంటే దేశంలో శాంతి భద్రతల వాతావరణం చక్కగా ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని పోలీసు మేధోసంస్థ.. 'బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చి, డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ)' 49వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసు సంస్థల ఉన్నతాధికారుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఏమేం చేయాలి?

- ఏడేళ్లకుపైగా శిక్షలు పడే అన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ ఆధారాలను తప్పనిసరి చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది.
- నేరగాళ్లకు శిక్షలు పడేలా చేసేందుకు పోలీసు దర్యాప్తు అధికారులు ఫోరెన్సిక్ ఆధారాలను ఉపయోగించడం అవసరం.
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో కార్యనిర్వహణ పద్ధతుల కోసం బీపీఆర్‌డీ ప్రణాళికలు రూపొందించాలి.
- నేరన్యాయస్మృతి (సీఆర్పీసీ), భారత శిక్షాస్మృతి (ఐపీసీ)ల్లో దీర్ఘకాలంగా ఎలాంటి మార్పులు రాలేదు.
- సీఆర్పీసీ, ఐపీసీల్లో ప్రభావశీల మార్పుల కోసం దేశవ్యాప్తంగా సంప్రదింపుల ప్రక్రియను చేపట్టాలి.
- పోలీసు బలగాల కోసం మెరుగైన విధానాల్ని, సాంకేతిక పరిష్కారాల్ని సిద్ధం చేయాలి.

పాతవీ మేలే

- నేరాలను ఆపాలనుకుంటే నేటి కాలంలోనూ కొన్ని పాత పద్ధతుల్ని వాడుకలోకి తేవాలి.
- సామాజిక పోలీసింగ్, ఇన్సార్మర్ల వ్యవస్థ వంటివి భారీ ప్రయోజనాల్ని అందిస్తాయి. బీటు పద్ధతిని బలోపేతం చేయాలి.

బీపీఆర్‌డీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని దిల్లీలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఓ అధికారిణికి అవార్డు అందజేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి, బీపీఆర్‌డీ డైరెక్టర్ జనరల్ వి.ఎస్.కౌముది

ఫోరెన్సిక్ వర్సిటీ

- జాతీయ స్థాయిలో పోలీసు ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రాల స్థాయిలో దీనికి అనుబంధ కళాశాలలూ ఏర్పాటవుతాయి.
- పన్నెండో తరగతి ఉత్తీర్ణులయ్యే విద్యార్థుల్లో పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో కెరీర్‌ను ఎంచుకునే వారికి ప్రారంభ దశ నుంచే తగిన శిక్షణ అందాలి. అలాంటి విద్యార్థులకు పరీక్షల్లో వెయిటేజీని కూడా కల్పించాలి. ఈ దిశగా బీపీఆర్‌డీ ప్రతిపాదన పంపింది. తుది నిర్ణయం కోసం కేబినెట్ ముందుంచుతాం.
- ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలల్ని(ఎఫ్ఎస్ఎల్) ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలి. దీనిని చట్టపరిధిలో తప్పనిసరి చేయాలి. బీపీఆర్‌డీ ఈ దిశగా కృషి చేయాలి.

మానవ వనరులకు శిక్షణ

- ఫోరెన్సిక్ ఆధారాలను తప్పనిసరి చేయాలంటే అవసరమైన మానవ వనరులు మనవద్ద లేవు.
- ఫోరెన్సిక్ సైన్స్‌లో విద్యార్థులు, అధికారులను తయారు చేసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత కాల వ్యవధితో కూడిన వ్యవస్థను రూపొందించాలి.

న్యాయస్థానాల్లో విజయాలెలా..

- పోలీసు దర్యాప్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో విజయాల రేటు చాలా తక్కువగా ఉండడం ఆందోళనకరం.
- ప్రస్తుత కాలంలోనూ ఇది ఇలాగే కొనసాగరాదు. ఫోరెన్సిక్ ఆధారాలతో దర్యాప్తు జరిగినప్పుడే దీనిని సరిదిద్దే అవకాశం ఉంది.
- ఫోరెన్సిక్ ఆధారాలతో అభియోగపత్రాన్ని రూపొందిస్తే దోష నిర్ధరణ రేటు మెరుగవుతుంది.
- నేరగాళ్లు, నేరపూరిత స్వభావం ఉండే వారికన్నా పోలీసులు నాలుగు అడుగులు ముందే ఉండడం తప్పనిసరి.
- పోలీసులు వెనుకంజ వేయొద్దు. పోలీసు వ్యవస్థను సమగ్రంగా ఆధునికీకరించినప్పుడే అది సాధ్యం.
- దర్యాప్తులో శాస్త్రీయ నైపుణ్యాల్ని ఉపయోగించాలి.
- ఇలాంటి ప్రయోగం గుజరాత్‌లో విజయవంతమైంది.

సంస్కరణలు

- పోలీసు సంస్కరణలు, పోలీసింగ్ ప్రక్రియలో సంస్కరణలు.. రెండూ విభిన్న అంశాలు. పోలీసింగ్ ప్రక్రియను సరికొత్తగా రూపుదిద్దాలి.
- శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో దృక్పథం మారాలి. ఈ దిశగా హోంశాఖ కృషి చేస్తోంది.

పీఎంఎల్‌ఏ ట్రైబ్యునల్ ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ గౌర్

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసుల్లో, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ముందస్తు బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్ గౌర్... నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్‌ఏ) అప్పీలేట్ ట్రైబ్యునల్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. సెప్టెంబరు 23న ఆయన ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నెల 23న పదవీ విరమణ పొందడానికి 48 గంటల ముందే చిదంబరం బెయిల్ పిటిషన్లను గౌర్ తిరస్కరించారు.

పర్సు చోరీ.. ఉద్యోగం హాలీ

దిల్లీ: ఎయిర్ ఇండియా రీజినల్ డైరెక్టర్ (ఈస్ట్) రోహిత్ భాసిన్‌తో ఆ సంస్థ బలవంతంగా రాజీనామా చేయించింది. జూన్ 22న ఆయన సిడ్నీ విమానాశ్రయంలోని ఓ దుకాణం నుంచి పర్సును చోరీ చేయడమే ఇందుకు కారణం. వీఆర్ఎస్ వెసులుబాటును కల్పించాలని రోహిత్ కోరినా అందుకు అధికారులు అంగీకరించలేదు.

ఆయుర్వేద ఆహారంపై కొత్త విభాగం: ఎఫ్ఎస్ఎస్ఏఐ

ముంబయి: ఆయుర్వేదిక్ ఆహారం పేరిట కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తెలిపింది. ఇందులో ఆయుర్వేద మంత్రిత్వ శాఖ కూడా భాగస్వామ్యం వహిస్తుందని పేర్కొంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ కార్యనిర్వాహక అధికారి పవన్ అగర్వాల్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు.

బంధువులను పదవులకు దూరంగా ఉంచండి: ప్రధాని మోదీ

దిల్లీ: "వాస్తవాలనే చెప్పండి. నిరూపించడానికి ఆధారాలు ఉన్న అంశాలనే మాట్లాడండి. మాధ్యమాల్లోనూ, ప్రజల వద్ద అనవసరమైన విషయాలు ప్రస్తావించవద్దు" అని తన మంత్రివర్గ సహచరులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన కేంద్ర మంత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. "మీ మంత్రిత్వ శాఖల్లోనూ, విభాగాల్లోనూ సలహాలు ఇచ్చే అధికారులుగా మీ బంధువులు, ఆప్తులు, ఆత్మీయులను కూడా చేర్చుకోవద్దు" అని ప్రధానమంత్రి చెప్పారు.

మోదీని ఏనాడూ సమర్థించలేదు: శశిథరూర్

"ప్రధాని మోదీని నేనెప్పుడూ సమర్థించలేదు. ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో నేనేం మాట్లాడానన్నది పరిశీలిస్తే మీకు ఈ విషయం బోధపడుతుంది. ప్రభుత్వ బిల్లులపై అధ్యయనం చేయడంలోగాని, మోదీ సర్కారును ఇరుకున పెట్టడంలోగాని నేను చేస్తున్నదాంట్లో పదోవంతు కృషిచేస్తున్న మరెవరైనా కేరళ కాంగ్రెస్ నాయకుడు ఉంటే చూపించండి! 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మొత్తం ఓట్లలో 20% కంటే తక్కువే వచ్చాయి. మోదీ మాత్రం గతం కంటే 6% ఎక్కువగా ఇటీవలి ఎన్నికల్లో 37% ఓట్లను భాజపాకు తెచ్చిపెట్టారు. దీనిపై కాంగ్రెస్ నేతలంతా సమీక్షించుకునే ప్రయత్నం చేయాలి."

(మోదీని పొగిడారంటూ వచ్చిన ఆరోపణలపై కేరళ పీసీసీ అధ్యక్షుడు ఎం. రామచంద్రానికి థరూర్ బుధవారం ఈ-మెయిల్‌లో పంపిన వివరణ.)

నాలుగేళ్ల పిల్లలూ హెల్మెట్ ధరించాల్సిందే

- 1 నుంచి కొత్త వాహన చట్టం అమలు
- భారీగా పెరగనున్న జరిమానాలు

ఈనాడు, దిల్లీ: 'మోటారు వాహనాల సవరణ చట్టం-2019'లోని 28 నిబంధనలను సెప్టెంబరు 1 నుంచి అమలు చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మిగతా సెక్షన్లకు సంబంధించి ముసాయిదా నిబంధనలను రూపొందించి, అభిప్రాయ సేకరణ తర్వాత వాటిని అమలు చేస్తామంది. తొలుత రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధించిన పాలనాపరమైన నిబంధనలనే ఎక్కువగా అమల్లోకి తెస్తున్నారు. ఇకపై ద్విచక్ర వాహనంపై వెళ్లే నాలుగేళ్లలోపు పిల్లలూ హెల్మెట్ ధరించాల్సి ఉంటుంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై రూ.500 నుంచి రూ.10,000 వరకూ జరిమానా, ఆరు నెలలపాటు జైలు శిక్ష విధించే నిబంధనలు అమలవుతాయి. అధిక లోడుతో వెళ్లే వాహనాలపై రూ. 20 వేల జరిమానాతో పాటు ప్రతి అదనపు టన్నుకు రూ.2 వేల చొప్పున వసూలు చేస్తారు. పైగా, అదనపు బరువును దించేంతవరకూ ఆ వాహనాన్ని ముందుకు కదలనివ్వరు. నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కించుకొనే వాహనాలకు ఒక్కో ప్రయాణికుడిపై రూ.200 చొప్పున జరిమానా విధించడంతోపాటు, అదనపు ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యం కల్పించిన తర్వాతే ముందుకు వెళ్లేందుకు అనుమతిస్తారు. సీటు బెల్టు ధరించని డ్రైవర్లకు రూ.వెయ్యి జరిమానా విధిస్తారు.

కొత్త జరిమానా రుసుముల వివరాలు www.eenadu.netలో...

భారత రక్షణ దళాల బలమిదీ..

జమూ-కశ్మీర్‌లో 370 అధికరణం రద్దు నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కశ్మీర్ అంశంపై అంతర్జాతీయ వేదికలపై భారత్ విస్పష్టమైన వాణిని వినిపిస్తూ నెగ్గుకొస్తుండగా.. పాక్ నేతలు మాత్రం కవ్వింపు వ్యాఖ్యలు చేస్తున్నారు. అణుయుద్ధం గురించి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తావిస్తుండగా ఆ దేశ రైల్వేమంత్రి షేక్ రషీద్ అక్టోబర్, నవంబర్‌లలో యుద్ధం రావచ్చన్నారు. ఈ నేపథ్యంలో భారత రక్షణ దళాల బలం ఎంత? త్రివిధ దళాల్లో అధికార, ఇతర హోదాల్లో ఉన్న సిబ్బంది సంఖ్య తదితర వివరాలు ఆసక్తికరం.



భారత్‌తో 'పూర్తిస్థాయి యుద్ధం': పాక్ మంత్రి

రావల్పిండి: భారత్-పాకిస్థాన్‌ల మధ్య అక్టోబరు-నవంబరులో 'పూర్తిస్థాయి యుద్ధం' జరగవచ్చని పాక్ రైల్వేమంత్రి షేక్ రషీద్ అహ్మద్ బుధవారమిక్కడ సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీరీల స్వాతంత్ర్య పోరాటం తుది అంకానికి చేరిందని, త్వరలో భారత్‌తో జరిగేది చివరి యుద్ధం కానుందని అన్నారు.

మూడు వైమానిక మార్గాలను మూసివేసిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మళ్లీ అక్కసు కక్కింది. భారత విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించకుండా కరాచీ మీదుగా ఉన్న మూడు వైమానిక మార్గాలను మూసేసింది. ఈ నెల 28 నుంచి 31 వరకూ ఇది వర్తిస్తుందని పౌర విమానయాన సంస్థ బుధవారం వెల్లడించింది.

ఎల్ఓసీ వద్దకు వెళ్తా: షాహిద్ అఫ్రిది

పాకిస్థాన్ సైన్యం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 'కశ్మీర్ అవర్'ను పాటించనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తాను నియంత్రణరేఖ (ఎల్ఓసీ) వద్దకు వెళ్లి, శాంతి పతాకాన్ని ఎగురవేస్తానని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది బుధవారం వెల్లడించారు.

జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్‌లపై మంత్రుల బృందం!

దిల్లీ: కొత్తగా ఏర్పడనున్న కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్‌లలో అభివృద్ధి, ఆర్థిక, సామాజిక అంశాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేసినట్లు బుధవారం ఇద్దరు ఉన్నతాధికారులు చెప్పారని పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని మరో అధికారి చెప్పినట్లు పేర్కొంది.

రాజ్యాంగ ధర్మాసనానికి 370

- అక్టోబరు నుంచి విచారణ: సుప్రీంకోర్టు

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణను అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగిస్తూ బుధవారం సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకొంది. అక్టోబరు మొదటి వారం నుంచి విచారణ జరుగుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎస్.ఎ.నజీర్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరళ్లు కోర్టులోనే ఉన్నందున ప్రత్యేకంగా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రం చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ నోటీసుల ప్రభావం సరిహద్దుల ఆవల కూడా ఉంటుందని తెలిపారు.

- జమ్మూ-కశ్మీర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ యూసుఫ్ తరిగామిని కలుసుకొనేందుకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఇదే ధర్మాసనం అనుమతిచ్చింది.
- జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థి మొహమ్మద్ అలీం సయీద్ జమ్మూ-కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న తన తల్లిదండ్రులను కలుసుకునేందుకు కూడా ఇదే ధర్మాసనం అనుమతిచ్చింది.

శ్రీనగర్‌లోని ఓ ట్యూషన్ కేంద్రంలో బుధవారం హోంవర్క్ చేస్తున్న చిన్నారి

జైలుకు వెళ్లేవారు నాయకులవుతారు

జమ్మూ-కశ్మీర్ గవర్నర్ వ్యాఖ్య

శ్రీనగర్: "అరే! ప్రజలు నాయకులవడం మీకు ఇష్టం లేదా? జైలుకు వెళ్లేవారు నాయకులవుతారు. ఎంత ఎక్కువ సమయం కారాగారంలో గడిపితే అంతగా వారు ఎన్నికల్లో లాభపడతారు" అని జమ్మూ-కశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ విలేకరులతో అన్నారు. ఆర్టికల్ 370 రద్దు; రాష్ట్ర విభజన అనంతరం ఆయన తొలిసారిగా విలేకరులతో మాట్లాడారు. ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితర నేతలను ఇంకా ఎన్నాళ్లు నిర్బంధిస్తారని ప్రశ్నించగా... మాలిక్ ఈ విధంగా సమాధానమిచ్చారు. తాను కూడా 30 సార్లు జైలుకెళ్లానన్నారు.

మరోసారి మాటల యుద్ధం

పాక్ నివేదికలో రాహుల్ పేరుపై వివాదం

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన 370 అధికరణం రద్దుపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ అధికరణం రద్దు తరువాత ఆ రాష్ట్రంలో అణచివేత విధానాలు అమలవుతున్నాయంటూ ఇటీవల రాహుల్ చేసిన విమర్శలు తాజా వివాదానికి కారణమయింది. జమ్మూ-కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ పాకిస్థాన్ మానవ హక్కుల మంత్రి షిరీన్ మజారీ తాజాగా ఐక్యరాజ్య సమితికి లేఖ రాశారు. రాహుల్ వ్యాఖ్యలను అందులో ఉటంకించారు. పాక్ లేఖలో తన పేరును ప్రస్తావించడంపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. జమ్మూ-కశ్మీర్‌లో పాక్ హింసను ప్రోత్సహిస్తోందని, అక్కడి పరిస్థితిపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. తాను ప్రభుత్వంతో చాలా అంశాల్లో విభేదిస్తానని, అయితే జమ్మూ-కశ్మీర్ సమస్య భారత అంతర్గత విషయం అనడంలో మరోమాటకు తావు లేదని చెప్పారు. ఈ మేరకు వివరణ ఇస్తూ ప్రకటన జారీ చేశారు. భాజపా నేత, కేంద్ర మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్ దీనిపై స్పందిస్తూ 370 రద్దుపై రాహుల్ చేసిన విమర్శలు పాక్‌కు అస్త్రాలుగా మారాయని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యల ద్వారా ఆయన దేశాన్ని అవమానపరిచారని విమర్శించారు..

ఇండో- పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా వ్యూహాత్మక ప్రణాళికలు

దిల్లీ: హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రంతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా వ్యూహాత్మక ముందడుగుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో చైనాను సమతౌల్యం చేస్తూ, త్రైపాక్షికంగా ముందుకు సాగాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూడు దేశాల సమావేశం ఫ్రాన్స్‌లో ఈ ఏడాదే జరుగనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో ప్రధాని మోదీ ఇటీవల చేపట్టిన చర్చల్లో సురక్షిత స్వేచ్ఛాయుత నేవిగేషన్, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరతను కాపాడటం వంటివే అజెండాగా నిలిచాయి. ఇరుదేశాలు సముద్రయాన నిఘా కోసం ఉమ్మడిగా ఉపగ్రహాల్ని రూపొందాలని నిర్ణయించాయి.

చట్టసభల సభ్యులకు ప్రవర్తన నియమావళి!

ఈనాడు, దిల్లీ: చట్టసభల సమావేశాలకు ఆటంకం కలిగిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చే సభ్యులపై వెంటనే (ఆటోమేటిక్‌గా) సస్పెన్షన్ వేటుపడేలా నిబంధనలు తీసుకురావాలని బుధవారం దిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన శాసనసభ, శాసనమండలి సభాపతుల సమావేశంలో తీర్మానించారు. ఇందు కోసం ఒక కమిటీ ఏర్పాటుచేసి దేశంలోని స్పీకర్లు, శాసనమండలి అధిపతులతో విస్తృతస్థాయి చర్చలు జరిపి నివేదిక తయారుచేయాలని నిర్ణయించారు. ఆ నివేదికపై నవంబర్ 12, 13 తేదీల్లో ఉత్తరాఖండ్ రాజధాని దేహ్రాదూన్‌లో జరిగే సభాపతుల సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు.

బ్రిటన్ పార్లమెంట్ సమావేశాల సస్పెన్షన్

లండన్: బ్రిటన్ పార్లమెంట్ సమావేశాలను అక్టోబర్ 14 వరకు సస్పెండ్ చేయాలన్న ప్రధానమంత్రి జాన్సన్ వినతికి బుధవారం ఎలిజబెత్ రాణి-2 ఆమోదం తెలిపారు. బ్రెగ్జిట్‌కు అక్టోబర్ 31 వరకు తుదిగడువు ఉండటంతో సరికొత్త శాసన అజెండాను ఆవిష్కరించేందుకు వీలుగా సమావేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని ప్రధాని నిర్ణయించారు. తాజా పరిణామాలపై విపక్షం నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. బ్రెగ్జిట్‌పై చర్చ చేపట్టకుండా నిలువరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారని హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్ జాన్ బెర్కో దుయ్యబట్టారు. ఇది రాజ్యాంగపరమైన దౌర్జన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో ట్యాక్సీ డ్రైవర్లు కుదేలు!

జమ్మూ-కశ్మీర్: ఆంక్షలు కొనసాగుతున్న కశ్మీర్ లోయలో 24 రోజులుగా బేరాల్లేక ట్యాక్సీ యజమానులు దిగాలు పడుతున్నారు. ప్రతిరోజూ ఎంతో ఆశతో ట్యాక్సీ స్టాండులకు వస్తున్నా గిరాకీ లేక చేతికి చిల్లిగవ్వ కూడా రావడం లేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. బ్యాంకు రుణాలు తీసుకుని వాహనాలు కొన్నామని.. వాయిదాలు ఎలా కట్టాలో తెలియట్లేదని తలలు పట్టుకుంటున్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితీ ఇంతకంటే భిన్నంగా లేదు. పూట గడవడానికి భారమంతా దేవుడిపైనే వేసి బతుకుతున్నామని దైన్యంగా చెబుతున్నారు.

మమత కాళ్లకు మొక్కి..

పశ్చిమబెంగాల్: ఆయన ఐజీ హోదాలో ఉన్న పోలీసు అధికారి.. ఓ కార్యక్రమానికి హాజరైనపుడు ముఖ్యమంత్రి పాదాలకు వినయంగా నమస్కరించడం ఇప్పుడు వివాదాస్పదమైంది. ఈ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఓ పోలీసు అధికారి ఇలా చేయడమేమిటంటూ విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు పశ్చిమ మిద్నాపుర్‌కు వెళ్లారు. బీచ్ వద్ద కూర్చుని అక్కడున్న వారికి ఆమె కేకు తినిపించారు. అక్కడే ఉన్న ఐజీ రాజీవ్ మిశ్రాకూ మమత కేకు తినిపించగా.. ఆయన ఆమె కాళ్లకు మొక్కారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి.

కొబ్బరిచెట్టుకు సీమంతం..!

మహారాష్ట్ర: తన పెరటిలోని కొబ్బరిచెట్టుకు సంప్రదాయబద్ధంగా సీమంతం చేసి ఓ మహిళ అందరినీ ఆశ్చర్యపరిచారు. చెట్టు ఆరోగ్యంగా ఎదిగి, కాయాలని ఆకాంక్షిస్తూ ఈ వేడుక జరిపారు. పుణెలోని కార్వెనగర్ వాసి నీతా యాదవ్ ప్రకృతి ప్రేమికురాలు. తన బంగ్లా చుట్టూ బోలెడు చెట్లు పెంచుతున్నారు. కొంకణ్ విశ్వవిద్యాలయం నుంచి అప్పట్లో కొబ్బరి మొక్కలు తీసుకొచ్చి నాటారు. వాటిలో ఓ చెట్టు సరిగా కాయడం రాలేదు. దానిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎరువులు వేస్తున్న నీతా తన స్నేహితురాళ్లతో కలిసి ఆ చెట్టుకు సీమంతం కూడా చేశారు. చెట్టుకు చీర కట్టి అలంకరించారు.

ఆస్తి దక్కించుకోవాలని.. కు.ని. చేయించేశాడు!

ఉత్తర్‌ప్రదేశ్: ఆస్తిని దక్కించుకోవడానికి బంధువులు, కుటుంబసభ్యులపై కుట్రలూ కుతంత్రాలు పన్నడం.. తగదాలు పడటం తరచూ వింటుంటాం. ఇదే కోవలో యూపీలో ఓ వ్యక్తి పథకం వేశాడు. తనకు సమీప బంధువైన ఓ యువకుడికి పెళ్లికి ముందే పిల్లలు పుట్టకుండా చేయాలని, ఏకంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాడు. మాధురి దేవీ రావత్‌పుర్ వాసి. భర్త చనిపోగా.. ఆమె తన 22 ఏళ్ల కుమారుడు ఆనంద్‌తో జీవిస్తున్నారు. ఆమెకు 4 బిఘాల పొలం, 83 గజాల భూమి ఉన్నాయి. ఈ ఆస్తిపై సమీప బంధువు శివనాథ్ కన్నేశాడు. ఏదో పనిమీద డబల్‌పులియాకు వెళుతున్న ఆనంద్‌ను అడ్డగించి, మరో ముగ్గురితో స్నేహితులతో బలవంతంగా ఓ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ అతనికి మత్తుమందు ఇచ్చి కొన్ని కాగితాలపై వేలుముద్రలు తీసుకున్నాడు. తర్వాత కు.ని. శస్త్రచికిత్స చేయించేశాడు. అపస్మారక స్థితి నుంచి కోలుకున్న ఆనంద్ ఇంటికి వెళ్లి జరిగిందంతా తన తల్లికి చెప్పాడు. విషయం తెలుసుకున్న ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఆవు కడుపులో 45 కేజీల పాలిథిన్

హరియాణా: పర్యావరణాన్ని దారుణంగా దెబ్బతీస్తున్న పాలిథిన్ మూగజీవాల పాలిట కూడా శాపంలా మారుతోంది. వాడిపారేస్తున్న ప్లాస్టిక్ సంచుల వంటివాటిని తింటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. ఇందుకు హరియాణాలో జరిగిన ఘటన ఓ ఉదాహరణ మాత్రమే. హిసార్‌లోని ఓ గోశాలలో పెంచుతున్న ఒక ఆవు పొట్ట క్రమేపీ పెరిగిపోయి అనారోగ్యం పాలైంది. పశువైద్యుల వద్దకు తీసుకెళ్లగా.. 8 గంటల పాటు ఆపరేషన్ చేసి 45 కేజీల పాలిథిన్‌ను బయటకు తీసి ఆ గోమాత ప్రాణాలు కాపాడారు. ఇంత పెద్ద పరిమాణంలో పాలిథిన్ ఉండటాన్ని చూసి పశువైద్యులే నివ్వెరపోయారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RN